ప్రజాపక్షం 8th ANNIVERSARY 22nd October, 2026
www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM ★★★

13 కోట్ల ఓటర్ల తొలగింపుపై
తమిళనాడులో
లెఫ్ట్ ఆందోళన ఉధృతం
07
మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌పార్టీని గెలిపిస్తే
గిరిజనులకు విద్యా వైద్య
సదుపాయాలు

సంపుటి 09, సంచిక: 302 | శుక్రవారం | 02-10-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంపై
# త్వరలో అఖిలపక్షం



- ఆ తర్వాత అత్యవసర మంత్రివర్గ సమావేశం • సహాయం కోసం కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని కేబినెట్ నిర్ణయం

**ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న రెండు డిఎల చెల్లింపునకు ఆమోదముద్ర**

- అతిత్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, సరఫరా
- రంగారెడ్డి జిల్లా కోహెడలో వరల్డ్ క్లాస్ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్‌మార్కెట్ పనులు వేగవంతం
- దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పున:సమీక్షించాలి
- తెలంగాణలో డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్‌కు ప్రత్యేక పాలసీ అమలు ప్రతిపాదనకు పరిశీలన
- రాష్ట్ర మంత్రి వర్గ నిర్ణయాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 2024 సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న డిఎలలో రెండు డిఎలను చెల్లించేందుకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై త్వరలో ఏర్పాటు చేయనున్న అత్యవసర మంత్రివర్గ సమావేశానికి ముందే అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని, రాష్ట్రానికి సహాయం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో ఎల్‌నినో పరిస్థితులు, ఉద్యోగుల సమస్యలు, విద్యుత్, సాగునీటి ప్రాజెక్ట్ తదితర అంశాలపై చర్చించారు. మంత్రివర్గ సమావేశం నిర్ణయాలను అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌లతో కలిసి రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాకు వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు రెండు డిఎలు ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదం. 2024 నుంచి బకాయి తరువాయి 12లో




హనుమకొండలో..

# ‘సర్’ నిలిపేయాలి

- సిఇసి జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే తొలగించాలి
- అక్రమంగా తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలి
- కలెక్టరేట్ల ఎదుట వామపక్షాల భారీ ధర్నా, నిరసన ప్రదర్శనలు
- కలెక్టర్లకు మెమోరాండం అందజేత




ప్రజాపక్షం/హైదరాబాద్ / హనుమకొండ

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే తొలగించాలని రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద వామపక్షాలు, ఇతర రాజకీయ పార్టీలు ధర్నాలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిసూ పేదల ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారని తీవ్రంగా మండిపడ్డాయి. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుండి బర్తరఫ్ చేయాలని, తొలగించిన ప్రతి ఒక్క ఓటును వెంటనే పునరుద్ధరించాలని, వివాదాస్పదంగా మారిన ‘సర్’ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశాయి. కార్యక్రమంలో భాగంగా హనుమకొండ కలెక్టరేట్ వద్ద సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఖమ్మం కలెక్టరేట్ వద్ద సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొనగా, ఆయా జిల్లాల కలెక్టరేట్ల వద్ద జరిగిన కార్యక్రమాల్లో వామపక్ష పార్టీలు జిల్లా కార్యదర్శులు, నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సిఇసి జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పలు జోట్ల నల్లజెండాలతో నిరసనలు తెలిపారు. హనుమకొండలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజల హక్కుల పరిరక్షణ కోసం వామపక్షాలు నిరంతరం పోరాడుతాయని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించి ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నదని అన్నారు. దొడ్డి దారిన సిఇసిని ఉపయోగించుకునే మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసే వరకు వామపక్షాలు దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి తరువాయి 12లో

ఫారం-6లో మార్పులు చేయాలని
## ఎవరు ఆదేశించారు?
టిసిఎస్‌పై ఏమైనా ఒత్తిడి తెచ్చారా? : నిలదీసిన రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** కేంద్ర ఎన్నికల సంఘం పనితీరును లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మరోమారు ప్రశ్నించారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఆన్‌లైన్ ఫారం – 6ను చట్టవిరుద్ధంగా మార్చారని మండిపడుతూ ఈ మార్పు చేయమని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌ను ఎన్నికల సంఘంలో ఎవరు ఆదేశించారు, ఆ సంస్థలో ఎవరు దానికి ఆమోదం తెలిపారు అని ఆయన ప్రశ్నించారు. ఆన్‌లైన్ ఫారం–6లో మార్పులు చేయడానికి టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్)పై ఏమైనా ఒత్తిడి తెచ్చారా అని రాహుల్‌గాంధీ ఎక్స్‌వేదికగా నిలదీశారు. కాగా, రాహుల్‌గాంధీ పోస్ట్‌ను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ట్యాగ్ చేస్తూ ‘ఎన్నికల జాబితా నుండి జెన్ జీ ఓటర్లను తొలగించడానికి, 2026 జులై మధ్యలో కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) రాజ్యాంగ విరుద్ధంగా తరువాయి 8లో

రాష్ట్రంలో ఫారమ్-6 కు
# డిక్లరేషన్ ఇవ్వాల్సిందే!

- ‘సర్’ పూర్తయిన రాష్ట్రాల్లోనే డిక్లరేషన్ అవసరం లేదు
- నోటీసులు అందుకున్న ఓటర్లకు ఇంటి వద్దే సేవలు
- మరోసారి ‘సర్’ పొడిగింపు లేదు
- 90లక్షల మందికిగాను 65లక్షల మంది నోటీసులకు సమాధానాలు ఇచ్చారు
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కాలంలో మాత్రమే ఫారం6కు జతచేసిన డిక్లరేషన్ ఫారాన్ని ఉపయోగించాలని, సాధారణ (నాన్‌ఎస్ఐఆర్) కాలంలో ఆ డిక్లరేషన్ ఫారాన్ని తప్పనిసరి చేయబోమని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. సర్ ప్రక్రియ గడువు మళ్లీ పొడిగించే ఉద్దేశం లేదని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే ఓసారి గడువు పెంపుకోరామని అందువల్ల ఇది కుదరదన్నారు. ప్రస్తుతం ఉన్న గడువు ప్రకారం క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలుకు గడువు అక్టోబర్ 7 వరకు ఉండగా నోటీసులు జారీ, అభ్యంతరాల పరిష్కారానికి నవంబర్ 5 వరకు, తుది ఓటరు జాబితా 9 నవంబర్‌ను ప్రచురించనున్నారు. హైదరాబాద్ బిఆర్‌కె భవన్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి, అదనపు రాష్ట్ర తరువాయి 8లో

‘జమిలి’ఎన్నికలపై జడ్జిలతో అనధికారిక చర్చలు
## రాజ్యాంగ విరుద్ధం

- రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్
- ప్రతిపక్షాల అభ్యంతరాలతో సుప్రీం సందర్శనను వాయిదా వేసుకున్న కమిటీ



**న్యూఢిల్లీ :** ‘ఒకే దేశం, ఒకే ఎన్నిక’ అంశంపై బిల్లులను పరిశీలిస్తున్న పార్లమెంటు సంయుక్త కమిటీ, ఈ అంశంపై న్యాయమూర్తులతో అనధికారిక చర్చలు జరిపేందుకు సుప్రీం కోర్టును సందర్శించనుందని రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ గురువారం పేర్కొన్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని, అలాగే అధికార విభజన సూత్రానికి వ్యతిరేకమని ఆయన అన్నారు. తన సుదీర్ఘ న్యాయవాద వృత్తిలో ఇలాంటి చర్యను తాను ఎప్పుడూ చూడలేదని సిబల్ అన్నారు. భవిష్యత్తులో అదే చట్టంపై సుప్రీంకోర్టులో సవాలు ఎదురయ్యే అవకాశం ఉన్నప్పుడు, ఆ చట్టం ఎంత మంచిదో కమిటీ న్యాయమూర్తులకు వివరించడం అపూర్వమైన చర్య అని ఆయన పేర్కొన్నారు. ‘ఆ చట్టం ఎంత మంచిదో ప్రభుత్వం వారికి వివరిస్తోంది. ఇదే చట్టంపై భవిష్యత్తులో పిటిషన్ దాఖలవుతుంది, ఆ పిటిషన్ చెల్లుబాటు తరువాయి 8లో

ఎఐఎస్‌ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులుగా మరోసారి
# మణికంఠరెడ్డి, లక్ష్మణ్ ఎన్నిక

**రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఇటిక్యాల రామకృష్ణ , రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా రెహమాన్**

ప్రజాపక్షం/హనుమకొండ


మణికంఠ రెడ్డి | లక్ష్మణ్ | రామకృష్ణ | రెహమాన్

అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికైంది. హనుమకొండలో సెప్టెంబర్ 28,29,30 తేదీల్లో జరిగిన ఎఐఎస్‌ఎఫ్ 90వ వార్షికోత్సవాల సందర్భంగా ఈ కొత్త కమిటీని ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. 28వ తేదీన జరిగిన భారీ విద్యార్థి ర్యాలీ దేశం మొత్తం విస్తృత చర్చ జరిగిందని ,29,30 తేదీల్లో ఎఐఎస్‌ఎఫ్ 90 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం పోరాటాలు, విజయాలు, విద్యారంగ సమస్యలపై చర్చించడం జరిగిందని, 30వ తేదీన రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర నూతన ఆఫీస్ బేరర్స్ కమిటీని ఎన్నుకున్నట్లు ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, తరువాయి 8లో

సిఇసి రాజీనామాకై
## నేటి నుంచి సిజెపి ఆందోళన

**ముంబయి :** ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు సంబంధించి వెలువడిన వార్తా కథనాల దృష్ట్యా ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను చేయాలని ‘కాక్రోచ్ జనతా పార్టీ’ (సిజెపి) డిమాండ్ చేసింది. లేని పక్షంలో దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే గురువారం హెచ్చరించారు. ఈనెల 2 నుంచి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన నిర్వహిస్తామని పేర్కొన్నారు. ముంబయి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో తరువాయి 8లో

ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికలు
ప్రభుత్వ మద్దతు ఉన్న యూనియన్‌ను గెలిపిస్తే
# సర్కార్‌ను ప్రశ్నించలేదు



కార్మికుల గొంతుక ఎంప్లాయీస్ యూనియన్

- ఉద్యోగుల హక్కులే మా ప్రధాన ఎజెండా
- విలీనం, బకాయిలు, ఉద్యోగ భద్రతపై రాజీలేని పోరాటం
- ‘ప్రజాపక్షం’ ఇంటర్వ్యూలో ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్.బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉద్యమమే ఊపిరిగా పురుడు పోసుకున్న ఎఐటియుసి అనుబంధ సంస్థ ‘ఎంప్లాయీస్ యూనియన్’ కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తుందని ఆ యూనియన్ అధ్యక్షుడు ఎస్. బాబు తెలిపారు. ‘ఎంప్లాయిస్ యూనియన్ కార్మికుల ప్రశ్నించే గొంతుక. వారి హక్కుల కోసం నిరంతరం పోరాడే శక్తి. ప్రభుత్వ మద్దతు ఉన్న యూనియన్ గెలిస్తే ప్రభుత్వాన్ని ప్రశ్నించే విషయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. దీనివల్ల కార్మికుల సమస్యల పరిష్కారం ఆలస్యమయ్యే ప్రమాదం ఉంది. ఉద్యోగుల హక్కుల కోసం స్వతంత్రంగా పోరాడే యూనియన్‌గా ఎంప్లాయీస్ యూనియన్‌ను కూటమిని బలపర్చి, బస్సు గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నాం’ అని చెప్పారు. కార్మికుల సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా గళం విప్పుతామని, ఉద్యోగులకు అవసరమైన హక్కులు సాధించే వరకు విశ్రమించబోమన్నారు. సంస్థ ప్రయోజనాలు, ఉద్యోగుల హక్కులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి) ఉద్యోగులు ప్రస్తుతం పొందుతున్న 8 గంటల పనిదినం, మహిళా కండక్టర్లకు 33 శాతం రిజర్వేషన్ తదితర హక్కులతో పాటు ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలనే అంశాన్ని తరువాయి 8లో

ఖైరతాబాద్ ఉప ఎన్నికకు
# నోటిఫికేషన్ ఇవ్వం

**హై కోర్టుకు కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టీకరణ**

ప్రజాపక్షం/హైదరాబాద్




ఖైరతాబాద్ శాసనసభ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహించే విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం హైకోర్టుకు కీలక స్పష్టీకరణ ఇచ్చింది. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎన్నికను సవాలు చేస్తూ హైకోర్టులో దాఖలైన ఎన్నికల పిటిషన్‌పై డివిజన్ బెంచ్ తుది నిర్ణయం వెలువడే వరకు ఉప ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయబోమని గురువారం నివేదించింది. పార్టీ ఫిరాయింపుల కేసులో పదో షెడ్యూలు ప్రకారం దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడిన నేపథ్యంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక నిర్వహించే అవకాశం ఏర్పడింది. అయితే, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పి.విజయారెడ్డి.. బిఆర్‌ఎస్ తరపున దానం ఎన్నికైనట్లు ప్రకటించడాన్ని సవాలు చేస్తూ ఇప్పటికే హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. దానం ఎన్నిక చెల్లదని ప్రకటించడంతోపాటు, తనను ఎమ్మెల్యేగా గుర్తించాలని ఆమె ఆ పిటిషన్‌లో కోరారు. ఈ ఎన్నికల పిటిషన్‌పై నిర్ణయం తరువాయి 8లో

# ఇండియా కూటమి సమరోత్సాహం

దేశ రాజధాని ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో బుధవారం 'జన్‌బంధన్' పేరిట జరిగిన ఇండియా కూటమి సమావేశం ప్రజాస్వామ్య పరిరక్షణకు సవ్యమైన దిశను నిర్దేశించింది. ప్రజాస్వామ్యాన్ని చెరబట్టేందుకు బిజెపి అగ్రనేతలు కుయుక్తులు, వారి కనుసన్నల్లో పని చేస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దుష్కృత్యాలపై సమర శంఖం పూరించింది. తద్వారా దేశానికి ఇండియా కూటమి నేతలు గట్టి భరోసానే కల్పించారు. జాతిపిత మహాత్మాగాంధీ జయంతి అక్టోబర్ 2 నుంచి మొదలు రెండు నెలల పాటు గల్లీ నుంచి ఢిల్లీ దాకా కార్యాచరణను 'జన్‌బంధన్' సమావేశం ప్రకటించింది. అంతే కాకుండా కూటమిలో లుకలుకలున్నాయనే అధికార పార్టీ ప్రచారాలను తిప్పికొట్టింది. ఈ సమావేశానికి 19 పార్టీలు హాజరై దేశం కోసం ఏకతాటిపై ఉన్నామని చాటాయి. ఆమ్ ఆద్మీ పార్టీ, డిఎంకె గైర్హాజరయ్యాయని, ఇది ప్రతిపక్షాల్లో అనైక్యతకు నిదర్శనమని బిజెపి నేత, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సన్నాయి నొక్కులు నొక్కారు. నిజానికి ఆ రెండు పార్టీలు చివరి సారిగా జూన్ 8న జరిగిన ఇండియా కూటమి సమావేశానికి రాలేదు. అదే సమయంలో ఆ రెండు పార్టీలేమి బిజెపి, జ్ఞానేశ్ కుమార్‌ల విషయంలో మౌనంగా లేవు. అవి నిక్కచ్చిగా తూర్పారపట్టాయి కూడా. పంజాబ్‌లో త్వరలో జరిగే ఎన్నికల్లో అధికారంలో ఉన్న ఆప్‌తో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ ప్రత్యక్షంగా తలపడనుండటమే ఇందుకు కారణమని ఎవరైనా అర్థం చేసుకుంటారు. తమిళనాడులో కాంగ్రెస్ తమను వీడి టివికె కూటమిలో చేరడంపై ఆగ్రహంతో డిఎంకె గతంలోనే ఇండియా కూటమి నుంచి వైదొలగింది. కానీ, బిజెపిపై తన సైద్ధాంతిక వ్యతిరేకతను వదులుకున్న దాఖలాలేవీ ఇప్పటికి కనిపించలేదు.

ఇండియా కూటమి తాజా సమావేశంలో పార్టీల మధ్య ఐక్యత కనపడినప్పటికీ, దేశానికి సంబంధించిన అంశం కాబట్టి కాంగ్రెస్ పార్టీ ఏకపక్షంగా పోవద్దనే సలహాలు వ్యక్తమయ్యాయి. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశానికి హాజరైన శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ ఠాక్రే ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు వార్తలు వచ్చాయి. ఒక్కటిగా ముందుకు వెళ్తేనే ప్రజలకు సరైన సందేశం వెళ్తుందనే సూచన చేసినట్లు తెలిసింది. అలాగే ఇండియా కూటమి పార్టీలు ఒకే గొంతు వినిపించేందుకు వీలుగా అధికారిక వాచస్పతుల నియామకం గురించి చర్చ వచ్చింది. దీనిపై సబ్ కమిటీ వేయాలనే నిర్ణయానికొచ్చారు. ఇండియా కూటమికి చైర్మన్‌గా గతంలోనే మల్లిఖార్జున ఖర్గే నియమితులైనప్పటికీ, కమిటీ ఏర్పాటుపై పలు సందర్భాలలో అభిప్రాయాలు వచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. నిజానికి ఆగస్టు మాసంలోనే హైదరాబాద్‌లో ఇండియా కూటమి సమావేశం జరపాలనే నిర్ణయం అమలు కాలేదు. ఇలాంటివి ప్రజల్లో పలుచనభావం కలుగజేస్తాయి. ఒక నిర్దిష్టమైన వర్కింగ్ కమిటీ, అధికార ప్రతినిధులు, తరచూ సమావేశాలవడం ద్వారా ప్రజల్లో కూటమిపై విశ్వాసం పాదుకొల్పవచ్చు. ఇది కూటమి పక్షాల మధ్య సాన్నిహిత్యం పెరగడంతో పాటు, ఏ ఒక్క పార్టీ ఏకపక్షంగా పోతుందనే పరస్పర సందేహాలకు చెక్ పెట్టినట్లవుతుంది.

కాంగ్రెస్ కీలక నేత రాహుల్‌గాంధీ పొడగిట్టనట్లు గతంలో వ్యవహరించిన తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈసారి సమావేశంలో ఆయన ప్రధాని అయినా అభ్యంతరం లేదనడం ఆశ్చర్యకరమే. కూటమి ఐక్యత కోసం తాను సాధారణ కార్యకర్తగా పని చేస్తానని,అందుకు తానేమీ అహానికి పోబోనని, ఇటీవల తాను నవీన్ పట్నాయక్ (బిజూ జనతాదళ్), ఎం.ఎ.బేబి(సిపిఐ(ఎం)లతో సంభాషించానని చెప్పారు. బిజెపి అప్రజాస్వామ్య పోకడలతో ఆమెలో మార్పు వచ్చి ఉండవచ్చు. అదే స్ఫూర్తిని నంద్రిగామ్ ఉప ఎన్నికల్లో ప్రదర్శిస్తే బాగుండేది. ఎందుకంటే, టిఎంసి అభ్యర్థి పోటీ నుంచి తప్పుకోవడంతో, గత ఎన్నికల్లో మూడవ స్థానంలో నిలిచిన వామపక్ష సంఘటన తరపు సిపిఐ అభ్యర్థికి కాకుండా, నోటా కంటే తక్కువ ఓట్లతో ఆరవ స్థానంలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్‌కు చేరువయ్యేందుకు ఆమె తహతహ ద్యోతకమవుతోంది.

మరోవైపు, సర్‌పై, జ్ఞానేశ్ కుమార్ తీరుపై వెల్లువెత్తిన వ్యతిరేకత నేపథ్యంలో టిడిపి, ఎల్‌జెపి వంటి ఎన్‌డిఏ పక్షాలు నుంచి అసంతృప్తి నోటి నుంచి తప్ప నాభి నుంచి రాలేదు. ఆ తరువాత అవి సర్దుకున్నాయి కూడా. బిజెపిపై పెరుగుతున్న వ్యతిరేకత తమపై పడకూడదనే ఉద్దేశ్యంతో అవి అప్పుడప్పుడు గోడ మీది పిల్లి వాటం ప్రకటనలు చేస్తుంటాయి. అదే సమయంలో ఇండియా కూటమిలోని పక్షాల మధ్య సఖ్యత క్రమంగా దృఢపడుతోంది. ఇండియా కూటమి గత సమావేశం నాటికి పశ్చిమ బెంగాల్ విజయోన్మత్తులో ఉన్న బిజెపి, టిఎంసి, శివసేన పార్లమెంటు సభ్యులను అక్రమంగా చీల్చి తమ దరికి చేర్చుకుంది. ఎన్‌సిపి (శరద్ పవార్) పార్టీ పని పడతామని, డిఎంకెను తమవైపు తిప్పుకుంటామని రంకెలు వేశారు. చీలిపోయి కొత్త పార్టీలో విలీనమైన టిఎంసి ఎంపిలు ఇప్పుడు తమ పదవికి ఎసరువచ్చే ప్రమాదముందని బిక్కు బిక్కుమంటున్నారు. అనేక ఎదురుదెబ్బలు తిని నిలిచిన ఇండియా కూటమి మాత్రం సమరోత్సాహంతో కదం తొక్కుతోంది.



## రాజకీయాల్లోకి రాకుంటే పది హోటళ్ళు ఉండేవి

**రాజకీయాల్లో ఉంటూనే వ్యాపారం చేస్తే తప్పేముంది? 2006లో రాజకీయాలలోకి వచ్చిన. అమెరికాలో సంపాదించుకున్న నాలుగు పైసలతో అప్పడే ఒక హోటల్ పెట్టుకున్నాను. ఒక్క హోటల్ 20 ఏళ్లలో పెరిగి మూడు హోటళ్లు అయ్యాయి. భార్య, పిల్లలకు బువ్వ పెట్టేందుకు వ్యాపారం చేస్తున్న. రాజకీయం పట్టించుకోకుండా వ్యాపారంపైనే దృష్టి పెడితే ఈపాటికి 10 హోటళ్లు ఉండేవి. ఇప్పడు మూడు మాత్రమే ఉన్నాయి. నా హోటళ్ళకు రేవంత్ రెడ్డి ఫ్రీ పబ్లిసిటీ ఇచ్చిండు. చాలా సంతోషం. నా హోటళ్ళకు పబ్లిసిటీ ఇచ్చినందుకు మీకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్న.**

– బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



# తెలంగాణ పులి నల్ల నరసింహులు

జీవితం సమాజానికి అంకితం చేసి పేరు కోసం పాకులాడక జనం పేగు బాధ తీర్చడానికి బ్రతికిన వీరులెందరో చరిత్రలో విస్మృతికి గురైనారు. వారి త్యాగాలు భూమిలో కప్పి వేయబడినప్పటికీ అవి విత్తనంలా మొలకెత్తక మానవు, అవి బాహ్య ప్రపంచాన్ని చూడక మానవు, మానై సమాజానికి ఆదర్శంగా నిలబడకమానవు. అలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన నిలువెత్తు ఉద్యమ స్ఫూర్తి శిఖరం తెలంగాణ పులి నల్ల నర్సింహులు. తెలంగాణలో ఏ మట్టి వీరుల నుదుటన సింధూరమై మెరిసిందో, ఎక్కడ త్యాగాలు నిరంతరం దివిటీలలా వెలుగుతూ మార్గదర్శకత్వం వహించాయో, ఎక్కడ దోపిడీకి, పీడనకు వ్యతిరేకంగా పిడికిళ్ళు బిగించుకొని దొరల గడీలను బద్దలు కొట్టాయో, ఎక్కడ అన్యాయం సహించలేని కళ్ళు నిప్పులు కురిపించాయో, ఎక్కడ సాయుధ పోరాట జ్వాలలు నింగికంటుకున్నాయో అటువంటి రణక్షేత్రమైన కడివెండిలో లచ్చమ్మ, లచ్చయ్య దంపతులకు ఒక పేద చేనేత కుటుంబంలో 1926 అక్టోబర్ 2న నల్లా నరసింహులు జన్మించాడు. స్వాతంత్ర్య ఉద్యమానికి సారథ్యం వహించిన గాంధీ, దేశానికి రెండవ ప్రధానిగా పనిచేసిన లాల్ బహుదూర్ శాస్త్రి జన్మించిన అక్టోబర్ 2వ తేదీన నల్ల నరసింహులు జన్మించి తెలంగాణ సాయుధ పోరాట నరసింహంగా వెలుగొందిన వీరుడు. యాదృచ్ఛికంగా ఈ ముగ్గురు మహోన్నతులు ఒకే తేదీన పుట్టడం కాకతాళీయం కావచ్చు కానీ వీరు దేశం గర్వించదగ్గ భరతమాత ముద్దుబిడ్డలు. ఈ ముగ్గురివి స్వతంత్ర పోరాటాలే కానీ దారులు వేరు. గాంధీ, శాస్త్రిలు దేశ దాస్య శృంఖలాలు తెంచడానికి అహింసా మార్గంలో ఉద్యమిస్తే, నల్ల నరసింహులు నిజాం నిరంకుశపాలకుల నుండి దొరలు, దేశ్‌ముఖ్‌ల అకృత్యాలనుండి ప్రజలను రక్షించడానికి సాయుధ పంథా అనుసరించాడు. తండ్రి లచ్చయ్య మంచి నైపుణ్యంగల చేనేత కళాకారుడు. అతి సన్నని దారంతో వస్త్రాలు నేయుటలో నేర్పరి. లచ్చయ్య తయారుచేసిన వస్త్రాలకు మంచి గిరాకీ ఉండేది.

ఆ రోజుల్లో హైదరాబాద్ సంస్థానం నిజాం నవాబు పాలనలో ఉండేది. జమీందారులు, జాగీర్దారులు, దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేల ఆధీనంలో గ్రామాలు ఉండేవి. వీరు ప్రజలను పన్నుల పేరుతో పీడించేవారు. గ్రామాలలో ప్రజలతో వెట్టిచాకిరి చేయించుకునేవారు. దండనలు వేసేవారు ప్రజలను దోపిడీ చేయడమే వీరి వృత్తి. కడివెండికి ఐదు మైళ్ళ దూరంలో విసునూరులో దేశ్‌ముఖ్ రేపాక వెంకట రామచంద్రారెడ్డి ఉండేవాడు. ఇతడు 60 ఎకరాల భూస్వామి. దోపిడీదారుడు, దుర్మార్గుడు, ప్రజాకంటకుడు. ఇతని తల్లి జానమ్మ కడవెండిలో నివాసం ఉండేది. ఈమె బలవంతంగా ప్రజల దగ్గర నుండి పన్నులు వసూలు చేసేది. తనకున్న 20 ఎకరాల భూమిని రెండు వందల ఎకరాలు చేసిందంటే ఈమె దోపిడీ ఏ రకంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. నల్ల నరసింహులు కడివెండిలోనే ఏడో తరగతి వరకు చదువుకున్నాడు. ఆ రోజుల్లో ఏడవ తరగతి ఉత్తీర్ణత అయిన వారికి వెంటనే టీచర్ ఉద్యోగం వచ్చేది కానీ నరసింహులు ఉద్యోగ అర్హతకు ఒక సంవత్సరం వయస్సు తక్కువగా ఉంది. ఇంకొక సంవత్సరం గడిస్తే ఉద్యోగం వచ్చేది. సరిగ్గా అదే సమయంలో తండ్రి లచ్చయ్య అనారోగ్యంతో కన్నుమూశాడు. ఇంటికి పెద్దవాడు కావడం వలన కుటుంబ భారం మొత్తం నరసింహులుపైనే పడింది. బ్రతుకుతెరువు కోసం మగ్గం వేయడం నేర్చుకున్నా. తండ్రి చేసిన అప్పులు తీర్చడం కోసం పరాయి ఊరిలో ప్రైవేట్ టీచర్‌గా పనిచేసి అప్పులు తీర్చాడు. పరాయి ఊరికి వచ్చి పోయే దారిలో పిట్టల నరసయ్య అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం విప్లవాత్మకమైన మార్పుకు దారితీసింది. వారి సహకారంతో ఆంధ్ర మహాసభతో పరిచయం ఏర్పడింది. నరసింహులు సాహిత్యం అధ్యయనం చేశాడు. పోరాట చరిత్రలు చదివాడు. చైతన్యం పొందాడు. చిన్నతనంలోనే అదే గ్రామానికి చెందిన వజ్రమ్మతో అతనికి వివాహం జరిగింది. చిన్నతనం నుండి అన్యాయాలను సహించలేని మనస్తత్వం కలిగిన నల్ల నరసింహులు 1944లో రావి నారాయణరెడ్డి అధ్యక్షతన భువనగిరిలో నిర్వహించిన ఆంధ్ర మహాసభతో ఉత్తేజితుడై తన భార్య నల్ల వజ్రమ్మతో పాటు కడివెండి గ్రామానికి చెందిన మిత్రులు దావీద్ రెడ్డి, మచ్చ రామయ్య, మాచర్ల కొండయ్య, దొడ్డి మల్లయ్య, దొడ్డి కొమరయ్య తదితరులను సమీకరించి ఆంధ్ర మహాసభ గ్రామ శాఖ ఏర్పాటు చేశాడు. దానికి కార్యదర్శిగా పనిచేస్తూ విప్లవ ప్రస్థానాన్ని ఆరంభించాడు.

ప్రజలపై అమానవీయ చర్యలకు పాల్పడుతూ కడివెండి ప్రజల రక్త మాంసాలను పీల్చి పిప్పి చేస్తున్న జానమ్మ దొరసానికి నల్ల నర్సింహులు ముచ్చెమట పట్టించాడు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో లెవీ ధాన్యం పేరుతో పేద రైతుల నుండి జరుగుతున్న బలవంతపు ధాన్య సేకరణను అడ్డుకొని జానమ్మ దొరసాని అక్రమంగా నిల్వ చేసుకున్న 100పుట్ల ధాన్యాన్ని ప్రజలకు పంచి తొలి విజయాన్ని నమోదు చేశాడు. జీతగాళ్లతో సమ్మె చేయించాడు. సెలవులతో పాటు వారి జీతాలు భారీ స్థాయిలో పెంపుదల చేయించాడు. వెట్టి బంద్ అయింది. దండగలు లేకుండా పోయాయి. ప్రజలు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. ఉద్యమ ప్రస్థానంలో భాగంగా నల్ల నర్సింహులు హైదరాబాదులో ఉన్నప్పుడు ప్రతీకారంతో ఉన్న దేశముఖ్ గుండాలు కడివెండిలో ఆంధ్ర మహాసభ కార్యకర్తలపై దాడి చేశారు. ఆ దాడిలో దొడ్డి కొమురయ్య నేలకొరిగి వీర మరణం చెందాడు. ఈ ఘటన వల్ల నరసింహులు అగ్నిశిఖలా ప్రజ్వరిల్లి 60 మందితో సాయిధ దళాన్ని నిర్మించి విప్లవ కెరటం సృష్టించాడు. నరసింహులు పిలుపు ఒక ప్రభంజనం. సాయుధ పోరాటంలో కీలకమైన నరసింహులు పై అనేక కేసులు బనాయించారు పోలీసులు. తీవ్ర గాలింపు చర్యలు చేపట్టారు కానీ నరసింహులు అనేక గ్రామాలు తిరుగుతూ తప్పించుకున్నాడు. చివరకు సూర్యాపేటలో పోలీసులకు దొరికాడు. అరెస్ట్ చేసి క్రూరంగా హింసించి మహబూబ్‌నగర్ జైల్లో పెట్టగా తప్పించుకున్నాడు. అక్కడనుండి విజయవాడ చేరుకొని కొన్నాళ్లు గెరిల్లా పోరాటంలో శిక్షణ తీసుకున్నాడు. తర్వాత జనగామ తాలూకా ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నాడు. 1947 ఆగస్టు 15 దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నిజాం నవాబు భారత్ యూనియన్ లో విలీనం కావడానికి ఒప్పుకోలేదు. కమ్యూనిస్టులు హైదరాబాద్ సంస్థానం విముక్తి కొరకు పోరాటం చేశారు. ఆ క్రమంలో రజాకార్ సైన్యం ఎంతోమంది వీరులను కాల్చి చంపింది. ఆ చర్యలను ప్రతిఘటిస్తూ నరసింహులు ప్రజా పోరాటాలు చేశాడు. ఈ క్రమంలో లక్ష్మక్కపల్లిలో పట్టుబడ్డాడు. కాల్చి చంపమని సైనిక అధికారులకు ఉత్తర్వులు ఉన్నప్పటికీ ప్రజాభిమానం, అతని భావజాలం, సిద్ధాంతం పట్ల విశ్వాసం, అవగాహన, వాదనా పటిమ, నిర్భీతి, నిజాయితీగల ప్రవర్తన చూసి చలించిపోయి పోలీసులకు అప్పగించారు. నరసింహులు పై ఆరోపించబడిన మూడు అక్రమ కేసుల్లో ముగ్గురు జడ్జిల ముందు తన కేసు తానే వాదించుకున్నాడు. న్యాయవాదులను నియమించుకునే అవకాశం ఉన్న ఉపయోగించుకోలేదు. వివిధ కేసుల్లో ఆయనకు మూడు ఉరిశిక్షల సైతం విధించారు. అయితే జైలు నుంచి తప్పించుకొని తిరిగి అజ్ఞాత జీవితం ప్రారంభించాడు. చివరిసారి 1955లో ఆయనను వడ్లకొండలో అరెస్టు చేసి ప్రభుత్వం ఉరిశిక్ష మళ్ళీ ఖాయం చేసింది. అయితే జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రజాందోళనల ఫలితంగా 1959లో ఆయన విడుదలయ్యాడు. అలా జైలు నుంచి విడుదలైన చిట్టచివరి తెలంగాణ సాయుధ పోరాటయోధుడు నల్ల నరసింహులు. ఆయన పోరాటాల ఫలితంగా తెలంగాణ టైగర్ పేరు ఆయనకు వచ్చింది. విప్లవ సింహంగా ప్రజలు పిలుచుకునేవారు.1993 నవంబర్ 5న ఆయన మరణించాడు.

**(నేడు విప్లవ వీరుడు నల్ల నరసింహులు జయంతి)**

ములక సురేష్
9441327666.

# మతోన్మాదానికి బలైన అహింసామూర్తి గాంధీజీ



మన్నవ హరిప్రసాద్
8247728296

మానవజాతిని ప్రభావితం చేసిన మహోన్నత వ్యక్తులలో గౌతమ బుద్ధుడు, ఏసుక్రీస్తు, మహ్మదు, వీరి ప్రబోధాలు మతాలుగా నేటికీ ప్రపంచంలో వర్ధిల్లుతున్నాయి. కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగిల్స్ మహాశయులు, శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతాన్ని, తత్వ శాస్త్రాన్ని అందించారు. లెనిన్, స్టాలిన్‌లు మార్క్స్ బోధనలను అనుసరించి రష్యాలో ప్రథమ సోషలిస్టు వ్యవస్థను నిర్మించారు, మావో జన చైనాను నిర్మించారు.

పై మహాశయులతో పాటు భారత జాతిపిత మహాత్మా గాంధీని చెప్పుకోవచ్చు. సత్యం, శాంతి, అహింస, సహాయ నిరాకరణ ఉద్యమం, స్వదేశీ ఉద్యమం మొదలగు పోరాట పద్ధతుల ద్వారా సత్యాగ్రహం అనే ఆయుధం తోటి బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా భారత ఉపఖండంలో మహోన్నత ఉద్యమాన్ని నిర్మించారు. గాంధీ మహాత్ముడు అనుసరించిన రాజకీ య విధానాలతోటి పూర్తి ఏకీభావం లేని వారు కూడా ప్రారంభంలో మహాత్మా గాంధీ ప్రభావంతో జాతీయోద్యమంలోకి, రాజకీయాల్లోకి వచ్చినవారే. కానీ తను రూపొందించినటువంటి సత్యాగ్రహం అనే సిద్ధాంత ఆయుధంతో రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాదులను భారత ఉపఖండమునుండి తరిమి కొట్టటానికి గొప్ప ఉద్యమాన్ని నిర్మించిన మహా నేత మహాత్మాగాంధీ.

1869 అక్టోబర్ 2వ తేదీన గుజరాత్ రాష్ట్రంలో పోర్‌బందర్‌లో కరంచంద్ గాంధీ, పుతిలి బాయిలకు జన్మించారు మోహన్‌దాస్. ప్రాథమిక విద్యను పోరు బందర్‌లో చదివిన గాంధీ, హైస్కూల్ విద్యను రాజ్ కోటలోనూ, కాలేజీ విద్యను భావనగరంలో సామల్ దాస్ కాలేజీలోనూ చదివి, న్యాయ శాస్త్రం అభ్యసించడానికి 1888 లో లండన్ వెళ్లి 1891లో భారతదేశానికి తిరిగి వచ్చారు. 1893 వ సంవత్సరంలో న్యాయవాద వృత్తిలో భాగంగా ఒక భారతీయ వ్యాపారవేత్త తరుపున దక్షిణాఫ్రికా వెళ్లారు.

దక్షిణాఫ్రికాలో భారతీయ సమాజం ఎదుర్కొంటున్న వర్ణ వివక్ష కు వ్యతిరేకంగా 1894లో నేషనల్ ఇండియన్ కాంగ్రెస్ ను స్థాపించి సత్యాగ్రహాన్ని ఆయుధంగా ఎంచుకొని పోరాడారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారతదేశంలో 1885 లో భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పడింది. మహాత్మాగాంధీ 1915 లో భారతదేశానికి తిరిగి వచ్చారు. నాటి నుండి ఈ దేశం నుండి బ్రిటిష్ వాడు వెళ్లిపోయేంతవరకు ఆ సేతు హిమాచలం భారత దేశం అంతా గాంధీ రోజుకి 18 కిలోమీటర్ల చొప్పున కాలినడకన 79 వేల కిలోమీటర్లు ప్రయాణం చేశారు. విభిన్న కుల, మతాలు, జాతులు, భాషలు, సంస్కృతులు కలిగినటువంటి ఈ దేశ ప్రజల జీవన పరిస్థితులను అధ్యయనం చేశారు. ప్రజలను సత్యాగ్రహం మార్గంలో జాతీయోద్యమం వైపు మళ్ళించారు. ఈ దేశంలో బ్రిటిష్ వాడు ఏ మాత్రం ఉండటానికి వీలులేదని శాంతియుత పద్ధతుల్లో ఆయన ప్రజలకు ప్రబోధించి ఉద్యమింపజేశారు. కుల వృత్తులను గౌరవిస్తూ అంటరానితనానికి వ్యతిరేకంగా కృషి చేశారు. దళితులకు దేవాలయ ప్రవేశం, రెండు బావుల నీటి సిద్ధాంతానికి వ్యతిరేకత, విదేశీ వస్తు బహిష్కరణ, సహాయ నిరాకరణ ఉద్యమం మొదలగు అనేక పోరాట పద్ధతులను అనుసరించాడు. భారత జాతీయ నాయకుల్లో ఎన్నో విభేధాలున్నాయి. వారినందరినీ ఐక్యంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా నిలబెట్టటానికి ఆయన ఎంతో కృషి చేశారు. లండన్‌లో మూడు రౌండ్ టేబుల్ సమావేశాల్లో ఆయన ఒక సమావేశంలోనే పాల్గొనారు.

భారతదేశంలో రెండు ప్రధాన మతాలు హిందూ, ఇస్లాం. సామ్రాజ్యవాదులు ఈ దేశాన్ని చీల్చటానికి అనేక కుయుక్తులు పన్నా రు. ప్రారంభంలో జాతీయ కాంగ్రెస్‌లో ముస్లిం నాయ



కులు కూడా కలిసి ఉన్నారు. కానీ బ్రిటిష్ వాడు విభజించి పాలించు అనే సూత్రం అనుసరించి భారత ప్రజల మధ్య హిందూ–ముస్లిం మత చిచ్చును రగిల్చాడు.

ఈ 'విభజించి పాలించు' విధానమే చివరకు దేశ విభజనకు పునాది వేసింది. స్వాతంత్ర్య ఉద్యమం అనేది బ్రిటిష్ వారిని దేశం నుండి వెళ్లగొట్టడానికి జరిగిన పోరాటం. కానీ విభజన అనేది దేశం లోపల ఉన్న రాజకీయ, మతపరమైన భయాల వల్ల (హిందూ ఆధిక్య దేశంలో ముస్లింల హక్కులకు రక్షణ ఉండదనే భయంతో) ముస్లిం లీగ్ తెచ్చిన ఒత్తిడి వల్ల జరిగింది.

మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ వంటి దేశనాయకులు అఖండ భారతదేశ స్వాతంత్ర్యం కోసమే పోరాడారు. వారు దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించారు, కానీ చివరకు దేశంలో అల్లర్లు, హింసను ఆపడానికి వేరే మార్గం లేక విభజనకు అంగీకరించాల్సి వచ్చింది. 1947 ఆగస్టు 15 ఇండియా, పాకిస్తాన్ గా భారత ఉపఖండం చీలికకు గురి అయింది. ఢిల్లీ ఎర్రకోట పైన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయగా జాతిపిత మహాత్మా గాంధీ మాత్రం ఇండియా విభజనలో జరిగినటువంటి అల్లర్లనూ, హింసనూ వ్యతిరేకిస్తూ కలకత్తాలో ఎంతో వేదనతో సత్యాగ్రహంలో కూర్చున్నారు.

1925లో సెప్టెంబర్ 27వ తేదీన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం హెగ్డేవార్ మొదటి సంచాలకుడుగా ఏర్పడింది. ఆయన ఎవరు హిందువు? అనే గ్రంథాన్ని రచించాడు. హెగ్డే వార్ రాజకీయ గురువు బి.ఎస్.మూంజే. 1931 లండన్‌లో జరిగిన రెండు రౌండ్ టేబుల్ సమావేశాల్లో బిఎస్ మూంజే పాల్గొని అచట నుండి ఇటలీ వెళ్లి నియంత ముస్సోలిని కలిసి ఫాసిస్టు తరహా పద్ధతులను అధ్యయనం చేసి వచ్చాడు. 1935లో బోన్సాల్లోనూ, నాసిక్‌లోను ఫాసిస్ట్ తరహా మిలిటరీ స్కూల్ లను ఏర్పాటు చేశాడు. హిందూ మహాసభ నాయకుడు గోల్వాల్కర్ బంచ్ హాఫ్ థాట్స్ అనే గ్రంథాన్ని రచించాడు. ఈనాడు ఆర్‌ఎస్‌ఎస్‌కి ప్రపంచంలోని 150 దేశాల్లో శాఖలు ఉన్నాయి. జాతీయ ఉద్యమంలో ఎటువంటి పాత్ర లేనటువంటి, బ్రిటీష్ సామ్రాజవాదులకు లొంగుబాటు ఉత్తరాలు రాసినటువంటి ఆర్‌ఎస్‌ఎస్ నేతలు మహాత్మా గాంధీని చంపటానికి కుట్రపన్నారు. అంబేద్కర్ కూర్చిన భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకించిన వారిలో ముఖ్యుడు వినాయక దామోదర సావర్కర్. 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని ఆమోదించిన దినం. మరుసటి దినమే ఆర్‌ఎస్‌ఎస్ నేతలు భారత రాజ్యాంగంగా మనుస్మృతి ఉండాలన్నారు. వాజ్ పేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు వినాయక దామోదర సావర్కార్ చిత్రపటాన్ని పార్లమెంటులో పెట్టారు. భారత రాజ్యాంగ ప్రవేశికలో చెప్పినట్లుగా భారతదేశం సార్వభౌమ, లౌకిక, సామ్యవాద, గణతంత్ర, ప్రజాతంత్ర స్ఫూర్తికి ఆర్‌ఎస్‌ఎస్/బిజెపి వ్యతిరేకం. గాంధీజీ కలలు కన్న మతసామరస్యానికి ఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేకం. ఎన్పీఆర్, ఎన్ఆర్‌సి, సి.ఎ.ఎ., సర్., చట్టాలు కానీ, కాశ్మీర్ కు స్వయంప్రతిపత్తి ని ఇచ్చిన ఆర్టికల్స్ 370, 35 రద్దు కానీ ఫాసిస్టు తరహా క్రోనీ క్యాపిటలిస్ట్ పాలనలో భాగమే. 1948 జనవరి 30వ తేదీన బిర్లా మందిరములో ప్రార్థనకు బయలుదేరిన మహాత్మా గాంధీని హిందూ మతోన్మాద ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త నాథూరామ్ గాడ్సే రివాల్వర్ తో కాల్చి చంపాడు. హే రామ్ అంటూ జాతిపిత నేల కొరిగాడు.

గాంధీని మొట్టమొదటసారిగా విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ మహాత్మా అని సంబోధించాడు. జాతిపిత మహాత్మా గాంధీ గురించి ఆల్బర్ట్ ఐన్ స్టీన్ వంటి ప్రపంచ ప్రముఖులు ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా అభివర్ణించారు. ఈ భూమండల మీద రక్త మాంసాలతో ఇలాంటి వ్యక్తి మనుగడ సాగించాడంటే ముందు తరాలు నమ్మలేకపోవచ్చు అనిఅన్నారు. మహాత్ముడు కలలుగన్న లౌకిక తత్వం, శాంతి, సౌఖ్యం ప్రేమ, అహింసల భారతదేశం కోసం మనమంతా ఈ గాంధీ జయంతి సందర్భంగా దీక్ష పూనాల్సిన అవసరం ఉన్నది. అది మహాత్మునికి మనం అర్పించే నివాళి.

# గాడి తప్పిన కార్యనిర్వాహక వర్గం

పెట్టుబడిదారి సమాజంలో చట్టసభ సభ్యులు అవినీతికి అలవాటుపడిన తర్వాత కార్యనిర్వాహక వర్గం అవినీతిమయమవుతుంది. ఆ తర్వాత పెట్టుబడిదారి సమాజం కొత్త రూపు సంతరించుకుంటుందని మార్క్స్ చెప్పినట్లుగా ఇప్పుడు దేశంలో రాజకీయ అవినీతి తర్వాత కార్యనిర్వాహకవర్గ అవినీతి తారాస్థాయికి చేరింది. ఏ అధికారి ఇంట్లో అవినీతి నిరోధక శాఖాధికారులు దాడులు చేసినా వందల కోట్ల రూపాయల ఆస్తులు బహిర్గతమవుతున్నాయి. ఇది ఒక స్థాయి అధికారులకు పరిమితమైతే ఇక అత్యున్నత స్థాయి అధికారులు అధికార పక్షానికి జీ హుజూర్ అంటూ రాజ్యాంగ వ్యవస్థలకే పెనుముప్పు తెచ్చిపెడుతున్నారు. కార్యనిర్వాహక వర్గం చట్టాలకు, నిబంధనలకు తూట్లు పొడిచి తప్పును ఒప్పు చేసే పని తలకెత్తుకున్నది. అందుకే న్యాయవ్యవస్థ, ఎన్నికల కమిషనర్లు, ఐఏఎస్, ఐపిఎస్, ఐఎఫ్‌ఎస్ సర్వీసుల్లో ఉన్న వారిలో జీ హుజూర్ అన్న వారు ప్రజల ముందు దోషులుగా నిలబడాల్సి వస్తుంది. అత్యున్నత స్థాయి అధికారులు అధికార పక్షానికి సాగిలపడి ఏమి చెబితే అది చేయడంతో ప్రజాస్వామ్య మనుగడే ప్రశ్నార్థకమైంది. రెండు దశాబ్దాలుగా అధికార యంత్రాంగంలో వచ్చిన ఈ మార్పు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడమే గాక పలు సందర్భాలలో పాలకులను ప్రజలకు దూరం చేస్తున్నది. వీరి వ్యవహారంతో సామాజిక అవగాహన లేకుండా బాహ్య ప్రపంచంతో సంబంధం లేని ఆలోచనల నడుమ సాగుతున్న ఓ తరం రోడ్డెక్కి పాలకులను నిలదీసే పరిస్థితి వచ్చింది. ఓ అధికారి అది సరికాదు అలా చేయలేము అని ఓ మాట అని ఉంటే ఈరోజు దేశంలో ప్రస్తుత పరిస్థితి ఉండేది కాదు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ చేసిన నిర్వాకం తనతో పాటు మోడీ ప్రభుత్వాన్ని ప్రజల ముందు దోషిగా నిలబెట్టింది. ఏమి జరిగిందో కానీ బిజెపి గెలుపుకు కళంకం తెచ్చిపెట్టింది. గతంలో నిబంధనలను పక్కనపెట్టి అధికారానికి అనుకూలంగా వ్యవహరించాలన్న ప్రశ్న తలెత్తినప్పుడు నిజాయితీ గల అధికారులు బాధ్యతల నుంచి తప్పుకున్నారు తప్ప ప్రజల అభిప్రాయానికి భిన్నంగా లేదా ప్రజాభిప్రాయాన్ని వక్రీకరించేవిధంగా నిర్ణయాలు చేయలేదు. ఇప్పుడు అటువంటి అధికారులు మచ్చుకు కూడా కానరావడం లేదు లేదా ఎక్కడైనా ఒకరిద్దరు ఉండి ఉండవచ్చు. ఎవరు అధికారంలో ఉంటే వారితో అంటగాగడం వారు చెప్పిందే చేయడం అధికార మార్పిడి తర్వాత కేసులను ఎదుర్కోవడం, ఊసలు లెక్కపెట్టడం అలవాటుగా మారుతుంది. సీనియర్ ఐఏఎస్‌లు, ఐపిఎస్‌లు ఇటువంటి కోవలో ఉండటం శోచనీయం. అప్పటి ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి మొదలు పలువురు పరిపాలన దక్షులైన అధికారులు అధికార పార్టీ నేతల ముందు తలవంచి అబాసుపాలవుతున్నారు. గ్రామాధికారి తప్పు చేస్తే గ్రామానికే పరిమితమవుతుంది. కానీ కమిషనర్ల స్థాయి అధికార యంత్రాంగం తప్పు చేస్తే మొత్తం వ్యవస్థకే ముప్పు ఏర్పడుతుంది. ఇప్పుడు జ్ఞానేష్ కుమార్ మొత్తం ఎన్నికల వ్యవస్థను తప్పుదారి పట్టించారని ఆయన రాజీనామా చేయాలని దేశ వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయి. అవి క్రమేపి ఊపందుకుంటున్నాయి. కేవలం విపక్ష పార్టీలే కాకుండా ఇప్పుడు జన్ జీ డిమాండ్ సైతం పరిగణనలోకి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలలో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులు సైతం మంత్రులు చెప్పింది తప్ప ప్రజల దృష్టి నుంచి ఆలోచనలు చేయడం లేదు. మంత్రి లేదా అధికార పార్టీ శాసన సభ్యుడు ఒక పనిని నిలిపివేయాలని ఆదేశిస్తే లేదా కోరితే ఆ పని అంగుళం కూడా కదలడం లేదు. ప్రజలు నిస్సహాయులుగా చూస్తుండి పోవాల్సి వస్తుంది. ఇద్దరు లేదా ముగ్గురు మంత్రులు ఉన్న చోట ఏకాభిప్రాయం లేని ఏ పని కూడా ముందుకు సాగడం లేదు. కొన్ని సార్లు ఏ మంత్రి పలుకుబడి ఎక్కువగా ఉంటే మిగిలిన మంత్రులను తోసిరాజని ఆ మంత్రి చెప్పిందే చేస్తున్నారు. ఇక ఐపిఎస్ అధికారుల తీరు ఇందుకు భిన్నంగా లేదు. దోషులను వదిలి బాధితులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఎవరిని అరెస్టు చేయమని ఆదేశిస్తే సహేతుకమైన కారణాలు లేకుండానే హద్దులు దాటి తమ జులుం ప్రదర్శిస్తున్నారు. మంగళవారం నాటి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పు ఇందుకు ఉదాహరణ. వీటన్నింటిని గుర్తు పెట్టుకున్న విపక్షాలు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి ఆంధ్రప్రదేశ్‌లో మాదిరి అధికారులను అరెస్టు చేసి జైళ్లకు పంపడం తప్పడం లేదు. ప్రజాస్వామ్యంలో ఏ రాజకీయ పార్టీకి అధికారం శాశ్వతం కాదు. అధికార మార్పిడి ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా జరుగుతుంది. కానీ అధికారులు ఒక సారి సర్వీసులోకి వచ్చిన తర్వాత పదవి విరమణ వరకు ఆ బాధ్యతల్లో కొనసాగాల్సి ఉంటుంది. దానిని మరిచిపోయి ఐదేండ్ల అధికారానికి దాసోహం అంటున్నారు. ఒక ప్రభుత్వంలో ఒప్పు అని చెప్పిన అధికారి అధికారం మారగానే అప్పటిది తప్పు ఇప్పటిది ఒప్పు అంటున్నారు. ఉదాహరణకు తెలంగాణలో అప్పటి ధరణిని ఇప్పటి భూ భారతి చట్టాన్ని సీనియర్ అధికారులు రూపొందించారు. కానీ అధికారం మారిన తర్వాత ధరణి తప్పు అయింది. భూ భారతి ఒప్పు అయింది. రేపు మళ్లీ అధికారం మారితే భూ భారతి తప్పు అవుతుందా అన్న ప్రశ్న సామాన్యుడి మదిలో సైతం మెదులుతుంది. ప్రజాస్వామ్య దేశంలో రాజకీయ పార్టీలతోనే ప్రభుత్వాలు ఏర్పాడతాయి కాబట్టి మరల ఎన్నికల్లో గెలుపు కోసం తమ అనుచరులను సహచరులను లేదా తమ పార్టీ కార్యకర్తలను రక్షించుకునే ప్రయత్నంలో ప్రజాప్రతినిధులు ఉంటారు. ఇదే సమయంలో తమ ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టడమో ఇరకాటంలోకి నెట్టడమో చేస్తుంటారు. దీనికి అధికార యంత్రాంగం వంత పాడితే ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. దేశ వ్యాప్తంగా కార్యనిర్వహక వర్గం, అవినీతి మరక అంటని అధికారుల సంఖ్య మరింత సన్నబడుతుంది. ప్రజా చైతన్యంలో ప్రశ్నించే తత్వం బలపడడం ద్వారా మాత్రమే దీనిని నిలువరించగలం. ఇప్పుడిప్పుడే రోడ్డెక్కి ప్రశ్నిస్తున్న పరిస్థితులు మరింత బలపడాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పు చేస్తే దిగిపోక తప్పదన్న ఓ బలమైన హెచ్చరిక వారి దరి చేరితే తప్ప ఈ స్థితికి ముగింపు లేదు.

ఏనుగు వెంకటేశ్వరరావు, ఖమ్మం

# సిద్ధాంత నిబద్ధతకు ప్రతీక ఏటుకూరి



## సంతాపసభలో కొనియాడిన పలువురు వక్తలు

ప్రజాపక్షం/హైదరాబాద్: స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని, తుది శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాల కోసం, ప్రజా ఉద్యమాల కోసం పనిచేసిన ఏటుకూరి కృష్ణమూర్తి జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. ఏటుకూరి కృష్ణమూర్తి సంతాప సభ సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో గురువారం మగ్దూంభవన్‌లో జరిగింది. సభకు సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ అధ్యక్షత వహించారు. తొలుత కృష్ణమూర్తి చిత్రపటానికి నాయకులు, పార్టీ కార్యకర్తలు, పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కృష్ణమూర్తి గొప్ప సిద్ధాంతవేత్త, చరిత్రకారుడని కొనియాడారు. ఆంధ్రుల చరిత్ర, అంతర్జాతీయ చరిత్ర, సోవియట్ తీరు చరిత వంటి అంశాలపై ఆయన రచనలు చేశారని గుర్తు చేశారు. ప్రజానాట్యమండలి, కమ్యూనిస్టు పార్టీ పట్ల చివరి వరకు ఆయనకు ప్రత్యేక అభిమానం ఉండేదన్నారు.

సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ కృష్ణమూర్తి 103 ఏళ్ల జీవితాన్ని పూర్తిగా ప్రజాసేవకు, విశ్వసించిన సిద్ధాంతానికి అంకితం చేసిన ధన్యజీవి అన్నారు. 1946 నాటి నావికా తిరుగుబాటులో పాల్గొన్నారని గుర్తుచేశారు.

డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ కృష్ణమూర్తి అత్యంత నిరాడంబరంగా జీవించారని, తాను స్వాతంత్ర్య సమరయోధుడినని, బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడానని ఎప్పుడూ గొప్పగా చెప్పుకోలేదన్నారు.

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఏటుకూరి కృష్ణమూర్తి కమ్యూనిజం పట్ల అచంచల విశ్వాసంతో, నిబద్ధత, క్రమశిక్షణ, నిరాడంబరతతో జీవితాంతం కొనసాగారన్నారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ యువజన, విద్యార్థి ఉద్యమాలకు చెందిన అనేక మంది కార్యకర్తలకు కృష్ణమూర్తి మార్గదర్శకుడిగా నిలిచారని అన్నారు. మాజీ ఎంపి అజీజ్‌పాషా మాట్లాడుతూ ఏటుకూరి కృష్ణమూర్తితో తనకు సుమారు 40 ఏళ్ల సుదీర్ఘ అనుబంధం ఉందని అన్నారు. పార్టీ సమావేశాల్లో ఆయనతో ఎన్నో విషయాలు, అనుభవాలు చర్చించేవాడినని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కృష్ణమూర్తి భౌతికంగా మన మధ్య లేకపోయినా చిరస్మరణీయులని పేర్కొన్నారు.



ఏటుకూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, ఎం.బాలనరసింహ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం.

## కార్మిక హక్కుల పరిరక్షణ కోసం

# ఐక్య పోరాటాలకు సిద్ధం

### ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షుడు ఎండి.యూసుఫ్



ప్రజాపక్షం/హైదరాబాద్: కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరించేలా కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టల్లో మార్పులు చేయడం అన్యాయమని ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షుడు ఎండి.యూసుఫ్ విమర్శించారు. కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో గురువారం రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకటేశం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా యూసుఫ్ మాట్లాడుతూ ఎఐటియుసి 43వ జాతీయ మహాసభలు నవంబర్ 22 నుంచి 26 వరకు బెంగళూరులో జరుగుతాయని తెలిపారు. దేశవ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో చర్చించి, కార్మిక హక్కుల పరిరక్షణ, కనీస వేతనాల పెంపు కోసం భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ తెలంగాణలో కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు, ఆశా, అంగన్వాడీ కార్మికులకు ఉద్యోగులుగా గుర్తింపు వంటి హామీలను నెరవేర్చలేదన్నారు. ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎఐటియుసి ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించామని తెలిపారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్‌తో కార్మికులు పోరాడుతున్నారని, రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ తరపున కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఎఐటియుసి సీనియర్ నాయకుడు వివిఎస్.బోస్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆర్‌టిసి, సింగరేణి వంటి సంస్థల్లో కాంట్రాక్టు ఉద్యోగులతో కాలం వెళ్లదీయడం సరికాదని విమర్శించారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి సీతారామయ్య, ఉప ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎస్.విలాస్, పి.ప్రేమ్‌పావని, ఎంఎస్.మూర్తి, టి.రామాంజనేయులు, వనంపల్లి జైపాల్‌రెడ్డి, మారగోని ప్రవీణ్‌కుమార్, కార్యదర్శులు టి.సమ్మయ్య, నారాటి ప్రసాద్, వై.ఓమయ్య, మేకల శ్రీనివాస్, ఎండి.ఇమ్రాన్, కె.రాజ్‌కుమార్, పానుగంటి పర్వతాలు, మేకల దాసు, హసీనా బేగం, రావి శివరామకృష్ణ, కోశాధికారి కమతం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## 7 నుంచి 'ప్రత్యేక టెట్'కు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్: ఉపాధ్యాయుల కోసం నిర్వహించనున్న రెండవ 'ప్రత్యేక టెట్' పరీక్షకు అక్టోబర్ 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. నవంబర్ 16 నుంచి 21వ తేదీ మధ్య ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు రెండు సెషన్స్‌ల లో పరీక్షను నిర్వహించనున్నారు. ఫలితాలను డిసెంబర్ 9 నుంచి 11వ తేదీ మధ్యన ప్రకటిస్తారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, టిజి టెట్ చైర్‌పర్సన్ డాక్టర్ నవీన్ నికోలస్ గురువారం నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. సమాచార బులెటిన్ ను ఈ నెల 7 నుంచి డౌన్ లోడ్ చేసుకోవాలి.అదే రోజు నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు ఆన్‌లైన్ లో ఫీజుల చెల్లింపు, దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. టెట్ హెల్ప్ డెస్క్ సర్వీసులు డిసెంబర్ 11 వరకు అన్ని పని దినాల్లో అందుబాటులో ఉంటుంది. నవంబర్ 9 నుంచి హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్సైట్: https://schooledu.telangana.gov.in ను సందర్శించాలని నవీన్ నికోలస్ సూచించారు. ప్రస్తుతం సర్వీసుల్లో ఉన్న ఉపాధ్యాయులు కూడా తప్పనిసరిగా టెట్ అర్హత సాధించాలన్న సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వం ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా ఏడాదికి రెండు సార్లు టెట్ నిర్వహిస్తోంది. రాష్ట్రంలో తొలిసారి నిర్వహించిన ఇన్‌సర్వీస్ టీచర్ల టెట్ 1 ఫలితాలు గత నెలలో విడుదలయ్యాయి. ఇందులో 70.07 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. సెప్టెంబరు 8, 9 తేదీల్లో నిర్వహించిన ఈ ప్రత్యేక టెట్‌కు పేపర్ 1, పేపర్ 2లకు కలిపి 24,986 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 22,477 మంది పరీక్షకు హాజరుకాగా 15,749 మంది అర్హత సాధించారు.





## జ్ఞానేశ్ కుమార్ వైదొలగాలని

# హైకోర్టు న్యాయవాదుల నిరసన

ప్రజాపక్షం/హైదరాబాద్ : భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యతిరేక, అక్రమ చర్యలకు వ్యతిరేకంగా తెలంగాణ హైకోర్టు వద్ద న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్), టిపిసిసి లీగల్ సెల్, ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) తదితర సంస్థల ఆధ్వర్యంలో బార్ కౌన్సిల్ ద్వారా ఎదుట గురువారం ఈ నిరసన కార్యక్రమం జరిగింది. టిపిసిసి లీగల్ సెల్ చైర్మన్, బార్ కౌన్సిల్ సభ్యులు పొన్నం అశోక్‌గౌడ్ మాట్లాడుతూ మాట్లాడుతూ దేశంలో ఓట్ చోరీ ద్వారా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రాజకీయ లబ్ధి పొందుతోందని విమర్శించారు. దీనికి బాధ్యత వహిస్తూ సిఇసి జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవి నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. ఐఎఎల్ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓట్టు హక్కు పునాధి అని, దానిని మొదలుకే కొట్టేయడం ద్వారా భారత ప్రజాస్వామానికి ముప్పు ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకు దోహదపడిన సిఇసి తక్షణమే రాజీనామా చేయాలన్నారు. ప్రవేశపెట్టడం ద్వారా దేశంలో ఉన్న ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోలేకుండా చేయడం ప్రజాస్వామ్యానికే విఘాతమన్నారు. ఐలూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్థసారధి మాట్లాడుతూ నీతిబాహ్యమైన పద్ధతల్లో వ్యవహరించిన జ్ఞానేశ్‌కుమార్ తక్షణమే తప్పుకోవాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదులు భగత్ సేన్, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.2 కోట్ల విరాళం

ప్రజాపక్షం/హైదరాబాద్ : పోలీసు కుటుంబాల పిల్లలతో పాటు సామాన్యులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో చేపట్టిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపిఎస్) నిర్మాణానికి కార్పొరేట్ సంస్థలు చేయూతనందించడం అభినందనీయమని డిజిపి సి.వి. ఆనంద్ అన్నారు. విద్య కోసం చేసే పెట్టుబడి సమాజంపై చెరగని ముద్ర వేస్తుందని, దాని ప్రయోజనాలు తరతరాలకు అందుతాయని ఆయన పేర్కొన్నారు. మంచిరేవులలో నిర్మిస్తున్న ప్రతిష్ఠాత్మక యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అకడమిక్ బ్లాక్ నిర్మాణానికి ఎంవైకే లాటిక్రీట్ (ఎంవైకే ఫౌండేషన్) రూ.2 కోట్ల సీఎస్ఆర్ విరాళాన్ని అందించింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్ మురళీ యాదమ గురువారం హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయంలో సి.వి. ఆనంద్‌కు రూ.2 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ విద్యారంగానికి అందించే సహకారం సమాజానికి శాశ్వతమైన ప్రయోజనాన్ని అందిస్తుందని అన్నారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ద్వారా పోలీసు సిబ్బంది పిల్లలతో పాటు సాధారణ ప్రజల పిల్లలకు నాణ్యమైన విద్య, మెరుగైన అవకాశాలు కల్పించాలన్నది లక్ష్యమని తెలిపారు. విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు, దాతలు, ఇతర భాగస్వామ్య సంస్థలు ముందుకు రావడం ప్రాజెక్టుకు మరింత బలం చేకూరుస్తుందని డిజిపి సి.వి. ఆనంద్ పేర్కొన్నారు. ఇలాంటి సిఎస్ఆర్ భాగస్వామ్యాలు స్థిరమైన విద్యా మౌలిక వసతుల నిర్మాణానికి దోహదపడతాయని తెలిపారు.

## ఉపసర్పంచ్‌లు చెక్కులపై సంతకాలు చేయడంలో

# అనవసరంగా జాప్యం చేస్తే చర్యలు

ప్రజాపక్షం/హైదరాబాద్: పంచాయతీల్లో అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా వంటి అత్యవసర సేవలకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు నిలిచిపోకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. చెక్కులపై సంతకాలు చేయడం లేదా వ్యయాన్ని డిజిటల్ సిగ్నేచర్ కీ ద్వారా ఆమోదించడంలో ఉపసర్పంచ్‌లు అనవసరంగా జాప్యం చేస్తే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు పంచాయతీ రాజ్ శాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఉప సర్పంచ్‌లకు సమర్పించిన తేదీ నుంచి ఏడు పని దినాల్లోపు సరైన కారణం లేకుండా సంతకం చేయకపోతే దీనిపై జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టాలని ఆ శాఖ స్పష్టం చేసింది. రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయత సీతక్క ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ గురువారం మెమో జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు ఈ ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని సూచించారు. పంచాయతీల్లో కొంతమంది ఉప సర్పంచ్‌లు ఎటువంటి సరైన కారణం లేకుండానే చెక్కులపై సంతకాలు చేయకపోవడం, వ్యయాన్ని డిజిటల్ సిగ్నేచర్ ద్వారా ఆమోదించకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి పనుల అమలు, అత్యవసర సేవలపై ప్రభావం పడుతుంది. సంతకం చేయకపోవడానికి లేదా వ్యయాన్ని ఆమోదించకపోవడానికి నిజమైన కారణం ఉందా? లేదా? అనే అంశాన్ని విచారణలో పరిశీలించనున్నారు. ఈ విచారణలో ఉప సర్పంచ్ సరైన కారణం లేకుండా ఉద్దేశపూర్వకంగా చెక్కులపై సంతకం చేయకుండా లేదా డిజిటల్ సిగ్నేచర్ ద్వారా వ్యయాన్ని ఆమోదించకుండా జాప్యం చేసినట్టు తేలితే తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీరాజ్ చట్టంలోని సంబంధిత నిబంధనల ప్రకారం ఉప సర్పంచ్‌కు అప్పగించిన అధికారాలను దుర్వినియోగం చేసినట్లయితే చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఆమోదించడంలో జాప్యం చేసినట్లు విచారణలో తేలితే, ఆ చెక్కులను డ్రా చేసే అధికారాన్ని మరో చట్టబద్ధమైన అధికారికి అప్పగించేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ అధికారాన్ని పంచాయతీ కార్యదర్శి, ఎంపిఒ, ఎంపిడిఒ తదితర చట్టబద్ధ అధికారుల్లో తగిన వారికి అప్పగించే అవకాశాన్ని కల్పించారు. చెల్లింపులు ఆలస్యం కావడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి రాకుండా నిర్ణయం తీసుకున్నట్టు పంచాయతీరాజ్ ,గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది. చట్టబద్ధమైన అభ్యంతరాలు ఉంటే వాటిని పరిశీలించేందుకు అవకాశాన్ని కల్పించారు. కానీ సరైన కారణం లేకుండా చెల్లింపులను నిలిపివేయడం మాత్రం అనుమతించబోమని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులు ఈ ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ సూచించింది.

కొన్ని గ్రామాల్లో సర్పంచులు ఉప సర్పంచ్‌ల మధ్య ఆధిపత్య రాజకీయం, ఇతర కారణాల వల్లనే బిల్లుల చెల్లింపు ఆలస్యమైతోంది. సర్పంచ్ చెక్ పై సంతకాలు చేసినా, ఉప సర్పంచ్‌లు సంతకాలు చేయడం లేదని చాలామంది సర్పంచులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. సర్పంచ్ సంఘాలు మంత్రి సీతక్కను పలుసార్లు కలిసి, ఉప సర్పంచ్‌ల వల్ల గ్రామ అభివృద్ధి కుంటుపడుతోందని, జాయింట్ చెక్ పవర్ ను రద్దుచేయాలని విజ్ఞప్తి చేశారు.దీనిపైన స్పందించిన పంచాయతీరాజ్‌శాఖ ఉప సర్పంచులు సంతకం చేసేందుకు ఏడు రోజుల గడువు విధిస్తూ మెమోను జారీ చేసింది.

## జెన్‌జీకి సిఎం ప్రాధాన్యం : మల్లు రవి



ప్రజాపక్షం /హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యువతకు, ముఖ్యంగా జెన్‌జీకి ప్రాధాన్యం ఇస్తున్నారని కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపి మల్లు రవి అన్నారు. గురువారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సిఎం అయిన తర్వాత ఎమ్మెల్యే కోటాలో వచ్చిన ఎమ్మెల్సీ స్థానాల్లో మహేష్‌కుమార్ గౌడ్, బల్మూర్ వెంకట్‌కు అవకాశం కల్పించారని, తదుపరి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల్లో ఎస్సీ వర్గానికి అద్దంకి దయాకర్, ఎస్‌టి వర్గానికి శంకర్‌నాయక్, బిసి వర్గానికి విజయశాంతికి అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. గవర్నర్ కోటాలో మైనారిటీ నేత అజారుద్దీన్‌కు, తెలంగాణ ఉద్యమ నేత కోదండరామ్‌కు ఇచ్చారని తెలిపారు. అనిల్‌కుమార్ యాదవ్‌కు రాజ్యసభ అవకాశం కల్పించడంతో పాటు, ఇప్పుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా సామ రామ్మోహన్‌రెడ్డికి అవకాశం ఇవ్వడం ద్వారా యువతకు ప్రాధాన్యం స్పష్టమవుతోందన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను కష్టపడి గెలుచుకోవాల్సి ఉంటుందని, బిసిలకు ఎమ్మెల్యే కోటాలో ఎలాంటి పోటీ లేకుండా ఎమ్మెల్సీ అవకాశాలు కల్పించిన ఘనత రేవంత్‌రెడ్డిదేనని మల్లు రవి పేర్కొన్నారు.

# వృద్ధుల గౌరవం, భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం



### 33 జిల్లాల్లో దశలవారీగా వృద్ధాశ్రమాలు
### 15.60 లక్షల మందికి చేయూత పెన్షన్లు
### మంత్రులు అడ్లూరి, పొన్నం

ప్రజాపక్షం/హైదరాబాద్ : వృద్ధుల గౌరవం, భద్రత, ఆరోగ్యం, ఆర్థిక భరోసాకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పొన్నం ప్రభాకర్‌లు అన్నారు. ప్రతి జిల్లాలో వృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారిని నియమించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. 33 జిల్లాల్లో దశలవారీగా వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేస్తామని, ప్రస్తుతం 10 వృద్ధాశ్రమాలు పనిచేస్తున్నాయని వెల్లడించారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 15.60 లక్షల మంది వృద్ధులకు నెలకు రూ.2,016 చొప్పున చేయూత పింఛన్ అందిస్తున్నామని, ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల వరకు నగదు రహిత వైద్యం అందిస్తున్నామని తెలిపారు.వృద్ధుల కోసం రాష్ట్రవ్యాప్తంగా 30 డే కేర్ కేంద్రాల్లో ఉచిత వైద్య, పౌష్టికాహారం, వినోద సేవలు అందిస్తున్నామని, 1,700 మందికి జెరియాట్రిక్ కేర్‌గివింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. నిర్వహణ ట్రిబ్యునళ్లలో గత ఏడాది దాఖలైన 2,505 భరణం కేసుల్లో 1,346 పరిష్కరించామని తెలిపారు.వృద్ధులకు అత్యవసర సహాయం కోసం 14567 టోల్‌ఫ్రీ ఎల్డర్ లైన్ అందుబాటులో ఉందని మంత్రి పేర్కొన్నారు. తల్లిదండ్రుల సంరక్షణ, హక్కుల పరిరక్షణకు చట్టాలను సమర్థంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వయోవృద్ధులు సమాజానికి భారం కాదని, నవ సమాజ నిర్మాతలని వారి అనుభవం, ఆలోచనలు కుటుంబ, సమాజ అభివృద్ధికి ఎంతో కీలకమని అన్నారు. వయోవృద్ధులను సమాజానికి మార్గదర్శకులుగా, బ్రాండ్ అంబాసిడర్లుగా గౌరవించాలని సూచించారు. తల్లిదండ్రులకు సేవ చేసుకోవడం పూర్వజన్మ సుకృతమని పేర్కొన్న మంత్రి, గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధ తల్లిదండ్రులను పిల్లలు పట్టించుకోవడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. వయోవృద్ధుల రక్షణ, గౌరవం, సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, అవసరమైతే చట్టాల్లో మార్పులు చేసి అయినా వారికి రక్షణ కల్పిస్తామని స్పష్టం చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం సంక్షేమం, సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వయోవృద్ధులకు సీనియర్ సిటిజన్ బస్ పాస్‌లు ఇవ్వాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా వృద్ధుల సంక్షేమం, సేవా కార్యక్రమాలకు కృషి చేసిన పలువురిని మంత్రులు సన్మానించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజేంద్ర బోయి, దివ్యాంగుల సంక్షేమ శాఖ సంచాలకులు సర్వేశ్వర్‌రెడ్డి, అధికారులు, వృద్ధుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, వృద్ధులు పాల్గొన్నారు.

## ఎట్టిపరిస్థితుల్లోనూ బిఆర్‌ఎస్‌తో పొత్తు ఉండదు : కిషన్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాబోయే తెలంగాణ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పార్టీతో బిజెపికి ఎట్టిపరిస్థితుల్లోనూ పొత్తు ఉండదని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బిఆర్‌ఎస్‌తో పొత్తు ఉంటుందని ఎవరు చెప్పారు?, అసలు పొత్తును ఎవరూ కోరుకోవడం లేదన్నారు. ముందుగా కెటిఆర్‌ను ఆయన చెల్లెలు కవితను కలవమనండి, ఆ తర్వాత ఇతర పొత్తుల గురించి ఆలోచించవచ్చు అని ఎద్దేవా చేశారు. ఎన్నికలు ఏవైనా సరే బిజెపి ఒంటరిగానే పోటీ చేస్తుందని పునరుద్ఘాటించారు. మరో వైపు, ఢిల్లీ పర్యటనలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దేవుళ్లు, మతాల విషయంలో రేవంత్ రెడ్డి బాధ్యతారాహిత్యంగా మాట్లాడారని విమర్శించారు. రాముడు వేరు, శివుడు వేరు అంటూ దేవుళ్ల మధ్య విబేధాలు సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల దృష్టిని మళ్లించడానికే రేవంత్ రెడ్డి ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కెసిఆర్ తరహాలోనే రేవంత్ రెడ్డి కూడా రాజకీయ నాటకాలు ఆడుతున్నారని, సోనియా గాంధీ కుటుంబం మెప్పు కోసమే సనాతన ధర్మాన్ని కించపరుస్తున్నారన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అక్టోబర్ 3న తెలంగాణకు రానున్నారని కిషన్ రెడ్డి చెప్పారు. ఈనెల 4న కోఆపరేటివ్ సొసైటీ పరిశ్రమకు శంకుస్థాపన చేసిన అనంతరం కరీంనగర్‌లో జరిగే కార్యక్రమంలో ఆయన పాల్గొంటారన్నారు. అలాగే ఈనెల 2న గాంధీ జయంతి నుంచి అక్టోబర్ 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వరకు కేంద్ర ప్రభుత్వం 'స్వచ్ఛతా సంకల్ప్' కార్యక్రమాన్ని నిర్వహించనుందన్నారు. ఎన్నికల కమిషన్ చేపట్టిన సర్ ప్రక్రియ ద్వారా దొంగ ఓటర్లను తొలగిస్తుంటే కాంగ్రెస్ పార్టీ ఎందుకు భయపడుతోందో సమాధానం చెప్పాలన్నారు.

**MMC మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**
డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, వెటెరినరి సెక్షన్, ఎంఎంసి.
మెయిల్: ddveterinary.mmc@gmail.com సెల్ నెం. 9989930-397
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
Lr.No. /EE/VET/MMC/2026 తేది: 01.10.2026

| Sl. No. | పని పేరు | అంచనా విలువ (రూ.లలో) |
|---|---|---|
| 1 | కీసర సర్కిల్ పరిధిలోని చికెన్ షాపుల నుండి వెలువడే కోడి వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించడం, రవాణా చేయడం మరియు పారవేయడం - కోడి వ్యర్థాల పారవేత కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లను పిలవడం. | రూ. 3,08,430.00 |

| ఈవెంట్స్ | క్ర.సం.1 కొరకు |
|---|---|
| డౌన్‌లోడ్ ప్రారంభ తేది | 03/10/2026 మ.3.00గం.లకు |
| డౌన్‌లోడ్ ముగింపు తేది | 09/10/2026 మ.3.00గం.ల వరకు |
| ప్రైస్ బిడ్ ప్రారంభ తేది | 09/10/2026 సా.4.00గం.లకు |

మరిన్ని వివరాలకు www.tender.telangana.gov.inలో చూడవచ్చు
సం/- డిప్యూటీ డైరెక్టర్, వెటెరినరి సెక్షన్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్
DIPR R.O. No. : 11023-PP/CL/ADVT/2026-27, Date: 01-10-2026

**శ్రీ పోచమ్మ, విజయదుర్గా దేవస్థానము, ఎల్లారెడ్డిగుడ.**
(తెలంగాణ ప్రభుత్వము, దేవదాయ ధర్మదాయ శాఖ)
బహిరంగ వేలము ప్రకటన తేది: 01.10.2026
ఇందుమూలముగా సమస్త భక్తజనులకు తెలియజేయునది ఏమనగా ఎల్లారెడ్డిగూడ శ్రీ పోచమ్మ విజయదుర్గ దేవస్థానము హక్కు భుక్తములో గల మూడు షటర్లు (దుకాణాలు) మరియు ఒక రెసిడెన్షియల్ పోర్షన్ తేది: 22.10.2026 గురువారము రోజున ఉదయం 10.00 గం.లకు బహిరంగ వేళము నిర్ణయించనైనది.

| క్ర. సం. | దుకాణము నెం. | దుకాణము విస్తీర్ణము | ధరవత్తు సొమ్ము | కాల పరిమితి | షరా |
|---|---|---|---|---|---|
| 1. | 03 | 176 చ.అ. | 70,000/- | 3 సం.లు | యదాస్థితి |
| 2. | 04 | 176 చ.అ. | 70,000/- | 3 సం.లు | యదాస్థితి |
| 3. | 05 | 176 చ.అ. | 70,000/- | 3 సం.లు | యదాస్థితి |
| 4. | దేవస్థానములో గల రెసిడెన్షియల్ పోర్షన్ | 380 చ.అ. | 70,000/- | 3 సం.లు | యదాస్థితి వ్యాపారము గురించి గోదాము / టైలర్ |

పై దుకాణముల వేళం పాటలో పాల్గొను అభ్యర్థులు ధరవాత్తు (డిపాజిట్) డి.డి. రూపంలో గాని, నగదు రూపంలో గాని చెల్లించి వేళం పాటలో పాల్గొనవలయును. పాట షరతులు వేళంపాట సమయంలో చదివి వినిపించబడును. పై వివరములకు దేవస్థానము కార్యాలయము నందు సంప్రదించగలరు.
చైర్మెన్ సం/- కార్యనిర్వాహణ అధికారి
DIPR R.O. No. : 11030-PP/CL/ADVT/2026-27, Date: 01-10-2026

**పురపాలక సంఘం కార్యాలయము, వికారాబాద్**
వికారాబాద్ జిల్లా
No. MCV/E/1422/2026-27 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు తేది: 01-10-2026
వికారాబాద్ మునిసిపాలిటీ యందు వివిధ పనులు చేపట్టుటకు e-Procurement ద్వారా టెండర్లు పిలువడమైనది.
1. పనుల సంఖ్య : (03)
2. పనుల విలువ : రూ.40.00 లక్షలు
3. బిడ్స్ డౌన్ లోడింగ్ ప్రారంభ తేది : 05-10-2026 ఉ.11.00 గంటలకు
4. బిడ్స్ డౌన్ లోడింగ్ సమర్పించుటకు చివరి తేది : 12-10-2026 మ.3.30 గంటలకు
5. ప్రైస్ బిడ్ తెరుచు తేది : 12-10-2026 సా.4.00 గంటలకు

కొటేషన్ ప్రకటన
వికారాబాద్ మున్సిపాలిటీలో క్రింది వస్తువుల కోసం వాటి వివరణలు / స్పెసిఫికేషన్లతో కూడిన ధరలను పొందడం కొరకు, స్థానిక అధీకృత ఏజెన్సీలు/ సరఫరాదారులు/ తయారీదారులు/ కాంట్రాక్టర్ల నుండి 05.10.2026 తేదీ నుండి 12.10.2026 వరకు కార్యాలయ పనివేళల్లో సీల్డ్ కొటేషన్లను ఆహ్వానిస్తున్నాము.
1. ఎల్ఈడీ వీధి దీపాలు (Street lights) మరియు ఎస్ఈడీ లైట్ల విడి భాగాలు
2. మొక్కల సరఫరా & మొక్కల పెంపకం
3. మున్సిపల్ వాహనాల మరమ్మతులు
4. టెంట్ హౌస్ పనులు, పండుగలకు లైటింగ్ పనులు, బారికేడింగ్
5. నీటి సరఫరా సామాగ్రి & వినియోగ వస్తువులు
6. పారిశుధ్య వస్తువులు & సంరక్షణా వస్తువులు
7. బోర్‌వెల్‌ల తవ్వకం.
8. వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికల తయారీ (DPRs)

మిగితా వివరములకు https://tender.telangana.gov.in చూడగలరు. లేదా కార్యాలయపు పని వేళల యందు ఫోన్ నెం. 9849907661 నందు సంప్రదించగలరు.
దీని ప్రతి నోటిసు బోర్డుపై సమాచార నిమిత్తము ఉంచనైనది.
సం/- మునిసిపల్ కమిషనరు పురపాలక సంఘం వికారాబాద్
DIPR R.O. No. : 11009-PP/CL/ADVT/2026-27, Date: 01-10-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, ఆల్విన్ కాలనీ సర్కిల్-51**
లేఖ సంఖ్య: 14/CMC/ALC-51/EE/2026-27; తేదీ: 01.10.2026

| క్ర.సం. | వివరణ |
|---|---|
| 1) | 800x800x660mm పరిమాణంగల ఇన్‌ఫిల్ట్రేషన్ మాడ్యూల్స్ మరియు 800 x 360 x 25mm పరిమాణంగల ఇన్‌ఫిల్ట్రేషన్ మాడ్యూల్స్‌తో కూడిన సైడ్ వాల్ ను ఉపయోగించి 4.32 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం గల మాడ్యులర్ రకం RWII నిర్మాణం : ఇందులో తారు / కాంక్రీట్ రోడ్ల ఉపరితలంపై 1200x1200x3000mm పరిమాణం వరకు తవ్వకం మరియు బేస్‌ప్లేట్, జియో-టెక్స్‌టైల్ 400 mm-200 మైక్రాన్ అందించడం కూడా ఇందులో చేరిఉంది. 200 మైక్రాన్ మి.మీ.12 మి.మీ. మందంగల సన్నటి ఫిల్టర్ మీడియా, 20mm మందం కలిగిన లావుపాటి ఫిల్టర్ మీడియా, 700x700 మీటర్ల (FRP 600x600mm స్పష్టమైన ఓపెనింగ్) (20 మెట్రిక్ టన్నుల హెవీ డ్యూటీ ఫ్రేమ్‌తో గ్రేటింగ్ కవర్) అన్ని లేబర్ చార్జీలు మరియు సామాను తరలించడం మరియు 125mm వ్యాసంగల బ్లాస్లాటెడ్ పివిసి పైపుతో 3మీటర్ల లోతు వరకు 150mm వ్యాసం గల బోర్‌వెల్ డ్రిల్లింగ్ చేయడం సహా పూర్తి. |
| 2) | జియో టెక్స్‌టైల్ - 400Gsm, 200మైక్రాన్లు, ఆస్ట్రేలియన్ /ఇండియన్ ప్రమాణాలకు (IS 16391 : 2015 లేదా దానికి సమానమైనది)అనుగుణంగా ఉండే తెలుపు / గ్రే కలర్. |
| 3) | BBA/IS ప్రమాణాలకు అనుగుణంగా, 52mm ఎత్తుగల రోడ్ సెల్స్ ప్రతీ చదరపు మీటర్ PE/PP మెటీరియల్‌కు 60టన్నుల కంటే ఎక్కువ గరిష్ఠ లోడ్ రేటుతో ఉంటాయి. |

Note :
i) సీల్ చేసిన కొటేషన్లను కోట్ చేసిన వస్తువు యొక్క పూర్తి వివరాలతో, సంస్థ / ఏజెన్సీ లెటర్ హెడ్ మీద తేదీ 06.10.2026 తేదీన మధ్యాహ్నం 3.00గంటల లోపు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ , ఆల్విన్ కాలనీ సర్కిల్-51 CMC వారి కార్యాలయంలో సమర్పించాలి.
ii) వర్తించే విధంగా పేర్కొన్న రేటుపై GST అదనంగా ఉంటుంది.
iii) లెటర్ ప్యాడ్‌పై GST నెంబర్‌ను పేర్కొనాలి.
iv) పై అంశాలకు పూర్తి వివరాలతో రేటును తెలియజేయవలసిందిగా ఏజెన్సీని కోరడమైనది.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఆల్విన్ కాలనీ సర్కిల్ 51, CMC.
DIPR R.O. No. : 11044-PP/CL/ADVT/2026-27, Date: 01-10-2026

# అభివృద్ధి, సంక్షేమ పథకాలు పటిష్టంగా అమలు

దిశ కమిటీ సమావేశంలో వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య

ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కెఆర్.నాగరాజు, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**ప్రజాపక్షం/హనుమకొండ :** అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అధికారులు అమలు చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ ) సమావేశం జరిగింది.ఈ సందర్భంగా వ్యవసాయ, వైద్య ఆరోగ్య, విద్య, మహిళా శిశు సంక్షేమం, రహదారులు, తదితర శాఖల అధికారులతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు తీరు, వాటి పురోగతి, చేపట్టాల్సిన చర్యలపై ఎంపీ, ఎమ్మెల్యేలు సమీక్ష చేశారు. ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వివిధ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేందుకు సంబంధిత శాఖల జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎల్ నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుతో కలిగే ప్రయోజనాలను రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన నాణ్యమైన వైద్య సేవలను అందించాలని పేర్కొన్నారు. గర్భిణీల వివరాలను వంద శాతం నమోదు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డయాబెటిస్ ఉన్నవారికి ఇన్సులిన్ అందుబాటులో ఉందా లేదా అనేది పరిశీలించాలని డిఎంహెచ్వోను ఆదేశించారు. ఓపి విధానంలో కొనసాగుతున్న క్యాన్సర్ వైద్య సేవలు మరింత మెరుగు కావాలన్నారు. వ్యాక్సిన్ కార్యక్రమాలను వైద్యారోగ్య శాఖ సిబ్బంది పటిష్టంగా అమలు చేయాలన్నారు.వరంగల్ మ్యూజియం అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలను అందజేయాలని పురావస్తు శాఖ అధికారులను ఆదేశించారు. అధికారులు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సందర్శించి వాటి పురోగతికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఇప్పుడున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటలే మేలు అని , ఈ విషయాన్ని మరింతగా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ధర్మసాగర్ సర్వీస్ రోడ్డు వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ధర్మసాగర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిస్థితులు మెరుగుప డాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు సాయంత్రం పూట ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని డిఈఓ కు సూచించారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు మాట్లాడుతూ ఎల్ నినో పరిస్థితులు ఉన్న దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటలు సాగు పై వ్యవసాయ ఉద్యాన శాఖల అధికారులు తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు.హసన్ పర్తి, ఓఆర్ఆర్ దేవన్నపేట, టేవన్నపేట, వంగ పహాడ్, తదితర ప్రాంతాలలో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, అదేవిధంగా మడికొండ వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల నివారణకు ఆర్ అండ్ బి, నేషనల్ హైవే అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. విడతల వారీగా అంగన్వాడీ కేంద్రాలు, వినో భవనాల నిర్మాణాలను చేపడతామని పేర్కొన్నారు.ప్రభుత్వ ఆదేశాలను తూచా తప్పకుండా సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి గడప కి అందేలా అన్ని శాఖల అధికారులు క్షేత్ర స్థాయి లో పని చేయాలన్నారు.ఈ సమావేశంలో ఇన్చార్జి అడిషనల్ కలెక్టర్ శేషాద్రి, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి.గిరిరాజు గౌడ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల అనుభవాలను భావితరాలకు అందించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/వరంగల్:** వయోవృద్ధులు గతాన్ని తలుచుకుని బాధపడకుండా, ఏలాంటి ఒత్తిడులకు లోనుకాకుండా ప్రశాంతంగా వర్తమానాన్ని ఆనందంగా గడపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. కుటుంబంలో, సమాజంలో ఒక్కరిలో సద్గుణాలు అవుతూ తమ విలువైన అనుభవాలను భావితరాలకు అందించాలని కోరారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వయోవృద్ధుల అనుభవాలను పిల్లలతో పంచుకోవడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరిగి, భయం లేకుండా వేదికపై మాట్లాడే సామర్థ్యం, ఆసక్తి పెరుగుతున్నాయన్నారు. వయోవృద్ధులు కృంగిపోకుండా ప్రశాంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని, గతాన్ని గుర్తు చేసుకుని బాధపడకుండా ప్రస్తుతాన్ని సంతోషంగా ఆస్వాదించాలని సూచించారు. వయోవృద్ధులకు ఏవైనా సమస్యలు ఎదురైతే 14567 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి అవసరమైన సహాయం పొందాలని సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు ఆర్డీవో, జిల్లా కలెక్టర్, జిల్లా సంక్షేమ శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్, గణేష్, ఉమారాణి, డీఏ ఫణికుమార్, రాజారెడ్డి, నాగపద్మజ, మల్లారెడ్డి, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది, వయోవృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల సంరక్షణ పిల్లల బాధ్యత: కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



**ప్రజాపక్షం/జనగామ:** వృద్ధులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. తల్లిదండ్రులను సంరక్షించడం పిల్లల బాధ్యత అని, వృద్ధుల హక్కుల పరిరక్షణకు చట్టపరమైన రక్షణ కల్పిస్తామన్నారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మేయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 1న ప్రపంచ వ్యాప్తంగా వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. వృద్ధుల పట్ల సమాజంలో గౌరవం, బాధ్యత, అప్యాయత పెంపొందించుకోవడంతో పాటు వారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం వైద్య, ఆరోగ్య రంగాల్లో వచ్చిన అభివృద్ధి కారణంగా ప్రజల సగటు ఆయుష్షు పెరుగుతోందని, సుమారు 60 సంవత్సరాల వయసులో ఉదోయగ విరమణ చేసిన అనంతరం కూడా మరో రెండు దశాబ్దాల పాటు జీవించే అవకాశం ఉందన్నారు. అదనపు కలెక్టర్ బెన్షాలోం మాట్లాడుతూ వృద్ధుల పట్ల సమాజ బాధ్యతను గుర్తు చేసే విధంగా దీర్ఘ ఆయువు యుగం అనే సందేశంతో వృద్ధుల పట్ల గౌరవం, వారి ఆరోగ్య భద్రత సంక్షేమం, సామాజిక భాగస్వామ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ భాస్కర్, డిఎంహెచ్ఓ వాణిశ్రీ, కన్సల్టెంట్ మైత్రేయి, ఆర్‌టిసి డిఎం ఉషా, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మమత, ఏపిడి నూరుద్దీన్, డిపిఎం నళిని, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## 9న భూపాలపల్లిలో 'జాబ్ మేళా'

5 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఈనెల 9న జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జాబ్ మేళ నిర్వహించనున్నట్లు,ఈ భారీ జాబ్‌మేళాకు కనీసం 5 వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి జాబ్‌మేళా ఏర్పాట్లపై జిల్లా అధికారులు, పోలీసు, సింగరేణి, ఇతర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత జాబ్ మేళాలో 13,300 మంది నమోదు చేసుకోగా 2,770 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈసారి 300కు పైగా కంపెనీలను రప్పించి భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల వారీగా నిరుద్యోగ యువతను గుర్తించి, వారి వివరాలను అక్టోబర్ 6లోగా సేకరించాలని సూచించారు. గ్రామ, మండల, జిల్లాస్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి నిరుద్యోగులను జాబ్‌మేళాకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, గత అనుభవంతో ఈసారి జాబ్‌మేళాను మరింత సమర్థంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. జాబ్‌మేళాకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంపీ కడియం కావ్య తదితరులు హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి , అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, కొమురయ్య, కమిషనర్ ఉదయ్ కుమార్, డీఎస్పీ సంపత్ రావు, జిల్లా అధికారులు, అన్ని మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## ఎంపి సమక్షంలో కాంగ్రెస్‌లోకి చేరికలు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** స్టేషన్ ఘనపూర్ మండలం అక్కపల్లి గూడెం నుండి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు యార కొమురెల్లి ఆధ్వర్యంలో సుమారు 20మంది బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం హన్మకొండ కనకదుర్గ కాలనిలోని నివాసంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరడానికి అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులు అవుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ పథకం పేద ప్రజలకు ఉపయోగపడుతుందని అనడానికి కాంగ్రెస్ పార్టీలోకి జరుగుతున్న చేరికలే నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బొమ్మగాళ్ల పెత్రు, యార్ల మహిపాల్, చిన్నోజు జీవన్, కూసరాజు, అనుముల అనిల్, అనుముల అశోక్, బొమ్మగాళ్ల అఖిల్, బొమ్మగాళ్ల సురేష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి




**ప్రజాపక్షం/ములుగు:** సిఈసి జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని, ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని, తొలగించిన ఓట్లను పునరుద్దరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు ములుగు జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టారు. జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి గాంధీ సెంటర్‌లో బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, సిపిఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, ఎంసిపిఐ జిల్లా కార్యదర్శి చంద్రయ్య, సిపిఐ నాయకులు బండి నర్సయ్య, ముత్యాల రాజు, జక్కుల ఐలయ్య, వడి సారయ్య, బోడ రమేష్, ఇంజం కొమురయ్య, మామిడి నటరాజ్, గుంజె శ్రీనివాస్, బుడిమె సదయ్య, మాతంగి శ్యామ్‌సుందర్, తదితరులు పాల్గొన్నారు.

## సిపి రోడ్డు పనులు పరిశీలించిన సిపిఐ బృందం

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాద్ మున్సిపాలిటీ 25వ వార్డులో యుఐడిఎఫ్ అర్బన్ స్ట్రక్చర్ డెవలప్మెంట్ ఫండ్ నిధులతో 50 లక్షల వ్యయంతో గతంలో మహబూబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్ శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా గురువారం ధర్మన్న కాలనీలో రూపాయలు 10 లక్షలతో ధర్మన్న కాలనీ ఆర్చి నుండి చిర్ర లక్ష్మి నరసింహ ఇంటి వరకు నిర్మించనున్న సిసి రోడ్లను రోడ్డు పనులను ప్రారంభించారు. స్థానిక 25వ వార్డు సిపిఐ కౌన్సిలర్ సంధ్య శ్రావణ్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి రెడ్డి, మున్సిపల్ సిపిఐ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి, 18 వ వార్డు కౌన్సిలర్ రేషపల్లి నవీన్, వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, మంద శంకర్, శ్రీనాథ్ , మాధవి, శ్రీనివాస్, ఓరుగంటి పవన్, రవి, రాములు, బొమ్మరి రమ, లక్ష్మి , శశి, తండ వినోద, ఎండి పాషా ,నరేష్, హర్షం పద్మ, సునీత, కల్పన, ఉమా, విజయ, శ్రీనివాస్, విమల, మహేష్, సతీష్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఐఎస్‌ఎఫ్‌కు 90 ఏళ్ళ సుదీర్ఘ చరిత్ర

సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్:** నూతనంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా ఎన్నికైన రెహమాన్‌కు, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ కు, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి ప్రణీత్ గౌడ్ లను సిపిఐ నాయకులు సత్కరించారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల సందర్భంగా నిన్న జరిగిన ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో నూతనంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా ఎన్నికైన రెహమాన్ కు, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ కు, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి ప్రణీత్ గౌడ్‌లకు సిపిఐ నాయకులు శాలువాలు కప్పి పూల బొకే ఇచ్చి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భం గా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్)1936 ఆగస్టు 12న ఆవిర్భావించి దేశ స్వా తంత్రోద్యమంలో అసమాన పోరాటాలు నిర్వహిం చి, ఎంతో మంది విద్యార్థులను త్యాగం చేసిందని కొనియాడారు. విద్య వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న పాలకులపై అలుపెరుగని సమరశీల పోరాటాలు చేసి దేశంలో ఎన్నో విజయాలు సాధించిందని తెలిపారు. ఇంతటి చరిత్ర కలిగిన సంఘంలో పని చేయడం అంటే ఎంతో గౌరవమని అన్నారు. నూతనంగా ఎన్నికైన రెహమాన్, సంతోష్, ప్రణీత్ గౌడ్ లు రానున్న రోజుల్లో విద్యా రంగ సమస్యల పరిష్కారంకై విస్తృతంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్ ఎ స్టాలిన్, మునిగాల బిక్షపతి, కొట్టే పాక రవి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

కలెక్టరేట్ ముందు వామపక్ష పార్టీల ధర్నా




**ప్రజాపక్షం/జనగామ:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష పార్టీల ఓట్లను తొలగిస్తూ ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న భారత ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామ చేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటి పిలుపు మేరకు గురువారం జనగామ జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిపిఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, సిపిఐ పట్టణ కార్యదర్శి చొప్పరి సోమయ్య అధ్యక్షత వహించగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, లిబరేషన్ జిల్లా కార్యదర్శి గుమ్మడి రాజుల సాంబయ్య మాట్లాడారు. కేంద్ర ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్‌కుమార్ బిజెపికి తొత్తుగా మారాడన్నారు. సర్ పేరుతో ప్రతి పక్షాల ఓట్లను తొలగిస్తూ ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్నాడని మండిపడ్డారు. భారత రాజ్యాంగ విలువల్ని పాటించడకుండా ఉన్నతమైన పదవిలో ఉండి నిష్పక్షపాతంగా ఉండాల్సిన వ్యక్తి ఒక పార్టీకి తొత్తుగా మారడం సరియైంది కాదన్నారు. ప్రజాస్వామ్య విలువల్ని పాటించని ఎన్నికల కమీషనర్ వెంటనే తన పదవి రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు. ఓట్లు తొలగించకుండా ప్రతి ఒక్కరి ఓటు నమోదు అయ్యే విధంగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంతో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆహల్య, రాపర్తి రాజు, బొట్ల శేఖర్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ నాయకులు మోటే శ్రీశైలం, తూర్పాటి సోమయ్య, పెద్ది రాహుల్ పాల్గొన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఎఓకు అందజేశారు.

## కార్మిక హక్కులపై పోరాడేది ఎఐటియుసియే

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్




**ప్రజాపక్షం/భూపాలపల్లి:** సింగరేణిలో 24 మెరుగైన అగ్రిమెంట్లను సాధించిన ఘనత ఏఐటీయూసీ గుర్తింపు సంఘం దేనని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లు తెలిపారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో ఎఐటియుసి బ్రాంచ్ కారదర్శి మోటపలుకుల రమేష్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన జనరల్ బాడీ సమావేశంలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, గత తొమ్మిది సంవత్సరాలుగా టీబీజీకేఎస్ సంఘం చేయని అనేక కార్మిక సమస్యలను పెండింగ్లో ఉంచిందని, గుర్తింపు సంఘంగా మేము 24 అగ్రిమెంట్లను సాధించిన ఘనత ఎఐటియుసిదేనని వారు వివరించారు. అందులో ముఖ్యంగా మెడికల్ బోర్డు, పెరిక్స్ పై ఇన్కమ్ టాక్స్ రద్దు, కార్మికుల సొంతింటి కల, మారుపేరు సమస్యలు ఇట్లా 24 అగ్రిమెంట్లపై యాజమాన్యంతో మాట్లాడి అమలయ్యే దిశగా ఎఐటియుసి పోరాడిందన్నారు. స్వలాభం కోసం పనిచేసే సంఘాలను నమ్మరాదని ఏఐటీయూసీ గుర్తింపు సంఘం గా ఉండి చేసింది ఏమీ లేదని ఇతర సంఘాలు దుష్ప్రచారం చేస్తున్నాయని వాటిని కార్మికులంతా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఇంకా భూపాలపల్లి ప్రాంతంలో పివిఎన్ఆర్ ఓసి రాబోతుందని, పది సంవత్సరాలు టీబీజీకేఎస్ లో ఒక్క నూతన గని రావడం కోసం ప్రయత్నం చేశారా అని సూటిగా ప్రశ్నించారు. అలాంటివారు ఎఐటియుసి మీద దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. కార్మికులు లాభాల వాటా, దీపావళి బోనస్ పై ఎలాంటి అపోహలు నమ్మరాదని, త్వరలోనే కార్మికులకు ఈ రెండు లాభాలను అందించే విధంగా గుర్తింపు సంఘంగా యాజమాన్యాన్ని, ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయడం కోరడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, ఎఐటియుసి వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామ్ చందర్, జి.సుధాకర్ రెడ్డి, జి.శ్రీనివాస్, రామచందర్, సుమారు 500 మంది కార్మికులు పాల్గొన్నారు.

## వ్యక్తిత్వ వికాసమే అన్ని రంగాల అభివృద్ధికి మూలం: సిపి ఎన్. శ్వేత




**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలు, సానుకూల ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవడం ద్వారా మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవచ్చని, వ్యక్తిత్వ వికాసమే విద్య, ఉద్యోగం, సామాజిక సేవతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధికి పునాది అని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ తెలిపారు.గురువారం పింగిలి ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) దిశానిర్దేశక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవాభావం, నాయకత్వ లక్షణాలు, సమాజం పట్ల బాధ్యతాయుతమైన దృక్పథం పెంపొందుతాయని అన్నారు.విద్యార్థులు తమ ప్రతిభను సద్వినియోగం చేసుకుంటూ, సమాజానికి ఉపయోగపడే ఎన్ఎస్ఎస్ వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈసం నారాయణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని భర్త హత్య

ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం..

భార్య, ప్రియుడు సహా ముగ్గురి అరెస్టు



**ప్రజాపక్షం/గణపురం:** వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కక్షతో భర్తను హత్త చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన ఘటన గణపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుద్దారంలో వెలుగుచూసింది. కేసులో నిందితులైన భార్య, ఆమె ప్రియుడు సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజుల జ్యూడీషియల్ రిమాండ్ విధించినట్లు భూపాలపల్లి డిఎస్‌పి సంపత్‌రావు తెలిపారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిఐ కరుణాకర్‌రావు, ఎస్ఐ బొరగల అశోక్‌తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. గణపురం మండలం గొల్లపల్లికి చెందిన పెండెల సంపత్(32) ప్లంబర్‌గా పనిచేస్తూ బుద్దారంలోని అత్తగారింట్లో భార్య సుమలతతో కలిసి నివసించేవాడు. పదేళ్ల క్రితం వీరికి వివాహమైంది. కొంతకాలంగా బుద్దారానికి చెందిన ఉమ్మల శ్రీకాంత్(36)తో సుమలతకు వివాహేతర సంబంధం కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయమై దంపతుల మధ్య తరచూ గొడవలు జరగేవని, శ్రీకాంత్‌ను సంపత్ పలుమార్లు హెచ్చరించాడని పేర్కొన్నారు. సంపత్‌ను హతమార్చేందుకు సుమలత, శ్రీకాంత్ పథకం చేశారని పోలీసులు తెలిపారు. ఇందుకు అదే గ్రామానికి చెందిన పోలుదాసరి తరుణ్(23)ను సంప్రదించి రూ.లక్ష ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారని పేర్కొన్నారు. పథకం ప్రకారం సెప్టెంబర్ 17 రాత్రి శ్రీకాంత్, తరుణ్‌లు మద్యం తాగుదామని చెప్పి సంపత్‌ను బుద్దారం జడ్పిహెచ్ఎస్ పాఠశాల మైదానానికి తీసుకెళ్ళారు. అక్కడ మద్యంలో పురుగుల మందు కలిపి అతడికి తాగించగా తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు తెలిపారు. సంపత్ మృతిచెందిన అనంతరం అతడి మృతదేహాన్ని పల్సర్ బైక్‌పై ఇంటికి తీసుకొచ్చారు. అతడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నమ్మించేందుకు మృతదేహం నోటిపై, దుస్తులపై, ఇంటి నేలపై పురుగుల మందు పోసి అక్కడి నుండి వెళ్ళిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో తొలుత అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, సాక్షుల విచారణ ద్వారా హత్యగా నిర్ధారించినట్లు తెలిపారు. పోలీసుల దర్యాప్తుల ముమ్మరం కావడంతో నిందితులు గ్రామ పెద్ద సమక్షంలో పోలీసుల ఎదుట లొంగిపోయారని పేర్కొన్నారు. నిందితుల నుండి పల్సర్ బైక్, మూడు సెల్‌ఫోన్లు, రూ.500 నగదు, పురుగుల మందు కలిపిన మద్యం బాటిల్, పురుగుల మందు సీసాను స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి తెలిపారు. సమావేశంలో రేగొండ రెండవ ఎస్ఐ హేమ, పాల్గొన్నారు.


SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS26T 4840 | Vikram Polsani | TATA LPTK 2518 FBT-T | 2019 |
| 2 | TS03UC 1303 | Vasantha Rao Jalagam | TATA LPK 2523 FBT | 2017 |
| 3 | TS06UC 4558 | Vikram Polsani | TATA LPK 2518 FBT | 2018 |
| 4 | TS03UC 0617 | Suvarna Mines | MAN CLA 25.250 FBT-T | 2017 |
| 5 | TG03T 2595 | Pulla Sony | MAHINDRA BOLERO CAMPER BS6 | 2025 |
| 6 | TS03UD 4153 | Eera Raju | MAHINDRA 475 DI | 2020 |

AUCTION DATE : 03-10-2026

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED

H.No :31-3-2086/1, 1st Floor, Above City Union Bank, Near Shyamala Garden, Waddepalli, Hanamkonda. Cell : 9849955900 & 9573787776

## విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు: కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థుల భద్రత, ఆరోగ్య విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజతో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ గురుకుల పాఠశాలలు, హాస్టళ్ల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టళ్లలో వార్డెన్లు స్థానికంగా అందుబాటులో ఉంటే 90 శాతం సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. వచ్చే వారం నుంచి రాత్రి, తెల్లవారు జాము సమయాల్లో ఆకస్మిక తనిఖీలు చేపడతామని, విధుల్లో లేని వార్డెన్లను తక్షణమే సస్పెండ్ చేస్తామని తెలిపారు. విద్యార్థులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పారిశుద్ధ్య పనులు చేయించవద్దని అలా చేయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. హాస్టళ్లలో నాణ్యమైన ముడిసరుకులను వినియోగించి ఫుడ్ పాయిజనింగ్ ఘటనలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. పాము, ఎలుక కాట్లు జరగకుండా స్థానిక సంస్థల సమన్వయంతో నెలకు ఒకసారి పరిసరాల్లోని పిచ్చి మొక్కలను, పొదలను తొలగించి ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. కాంపౌండ్ వాల్ లేని హాస్టళ్ల వివరాలను సంబంధిత శాఖాధిపతులకు తెలియజేయాలని సూచించారు. శాఖల నుంచి ప్రతిపాదనలు సమర్పిస్తే ఉపాధి హామీ పనుల క్రింద కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులతో అధికారులు, వార్డెన్లు క్రమం తప్పకుండా మాట్లాడాలని వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. హాస్టళ్లలో స్పష్టమైన విజిలెన్స్ వ్యవస్థ ఉండాలని తెలిపారు. డైట్, కాస్మోటిక్, సిబ్బంది వేతనాల పెండింగ్ వివరాలు సమర్పిస్తే నిధుల విడుదలకు ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామన్నారు. అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ మంజూరైన మరుగుదొడ్లు, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారులు జి. జ్యోతి, ముజాహీద్, ఫిరంగి, ఆర్‌సివోలు, హాస్టల్ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## పిఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కార్యక్రమం



**ప్రజాపక్షం/వైరా:** విద్యుత్ వినియోగదారులు సౌర విద్యుత్ వైపు మళ్లేలా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన(సోలార్) పై అవగాహన కల్పించేందుకు వైరా మున్సిపల్ ప్రాంగణంలో గురువారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో సేవా సేతు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ పాల్గొని సేవా సేతు కర పత్రాలను ఆవిష్కరించారు. సౌర విద్యుత్ వినియోగం పథకం ద్వారా అందుబాటులో ఉన్న ప్రయోజనాలు, ప్రజలు పొందాల్సిన సేవలపై కార్యక్రమంలో అవగాహన కల్పించారు. వైరా డిఇ/ఒపి/టిజిఎన్‌పిడిసిఎల్ వై.రమేష్‌కుమార్, ఎడిఎ/ఒపి/టిజిఎన్‌పిడిసిఎల్ పి.కిరణ్‌కుమార్‌తో పాటు వైరా టౌన్, వైరా రూరల్, కొణిజర్ల, పెద్దగోపతి ప్రాంతాలకు చెందిన ఎఇలు, ఎఎఒ/ఇఆర్ఒ అధికారులు, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఎస్‌బిఐ, ఎన్‌జిబి బ్యాంకుల మేనేజర్లు హాజరయ్యారు. మున్సిపాలిటీకి చెందిన వార్డు కౌన్సిలర్లు పాల్గొనగా, వారికి కూడా పథకానికి సంబంధించిన వివరాలు, వినియోగదారులకు అవగాహన కల్పించే విధానంపై విద్యుత్ అధికారులు వివరించారు. మూడు రోజులపాటు కార్యక్రమం సేవా సేతు కార్యక్రమం వైరా మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం, శనివారం కూడా కొనసాగుతుందని డిఈ వై.రమేష్‌కుమార్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని పిఎం సూర్యఘర్ పథకానికి సంబంధించిన వివరాలు, సందేహాలను విద్యుత్ శాఖ అధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు.

## స్వచ్ఛతను ప్రజల జీవన శైలిలో భాగంగా చేసుకోవాలి

### అదనపు కలెక్టర్ విద్యాచందన



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** స్వచ్ఛతను ప్రజలు జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని అదనపు కలెక్టర్ డిఆర్‌డిఎ పిడి విద్యాచందన అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని రామచంద్ర డిగ్రీ కాలేజీ ఒక గంటపాటు శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చెత్తను మూలంలోనే వేరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుమారు 580 మంది పాల్గొని నాలుగు రకాల చెత్తను వేరు చేశారు. జిల్లా, మండల స్థాయి అధికారులతో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలు రామచంద్ర డిగ్రీ కాలేజీ విద్యార్థులు, ట్రైబల్ వెల్ఫేర్ పాల్వంచ బాలికలు, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ ఎన్‌సిసి ఎన్ఎస్ఎస్ క్రీడాకారులు కోచ్‌లు స్వచ్ఛ కార్యక్రమంలో పాల్గొంచుకున్నారు. జెడ్పి సిఇఓ నాగలక్ష్మి , డిపిఓ అనూష, డివై ఎస్ఓ పరంధామరెడ్డి, డిఇఓ శంభుప్రసాద్, సిపిఓరామిరెడ్డి, ఎల్‌డిఎం శ్రీనివాస్, రమేష్ , సివిల్ సప్లై డిఎం త్రినాధ్‌తో పాటు ఎస్‌సి అభివృద్ధి అధికారి విజయలక్ష్మి మధుసూధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 2న మద్యం, మాంసం విక్రయిస్తే కఠినచర్యలు: మున్సిపల్ కమిషనర్

ప్రజాపక్షం/మధిర: మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్2న మధిర మున్సిపాలిటీ పరిధిలో అన్ని రకాల మద్యం, మాంసం విక్రయాలు పూర్తిగా నిషేధించబడినవి అని మధిర మున్సిపల్ కమిషనర్ కొంపల్లి శామ్యూల్, బి.ఐ.పాల్ తెలియజేశారు. మద్యం దుకాణాలు, బార్లు, మాసం విక్రయ కేంద్రాలు, ఇతర సంబంధిత వ్యాపారులు ఈ నిషేధాన్ని తప్పనిసరిగా పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి మద్యం, మాంసం విక్రయాలు జరిపినట్లు గుర్తించిన పక్షంలో ఎలాంటి మినహాయింపు లేకుండా వర్తించే చట్టాలు, నిబంధనల ప్రకారం కఠినచర్యలు తీసుకోబడతాయని అన్నారు. ప్రజలు, వ్యాపారులు ఈ నిషేధానికి పూర్తిగా సహకరించి, అక్టోబర్2న మద్యం, మాంసం విక్రయాలు జరగకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ తెలియజేశారు.

# పాలేరులో రూ.40.19 కోట్ల సబ్సిడీ వర్తింపు

### రూ.200కోట్లతో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు
### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఫ్రీ కరెంట్‌కు పేటెంట్ హక్కు అయిన కాంగ్రెస్ పార్టీ అదే ఒరవడిని కొనసాగిస్తూ పాలేరునియోజకవర్గంలో గృహజ్యోతి పథకం ద్వారా రూ.40.19కోట్ల సబ్సిడీని లబ్ధిదారులకు వర్తింప చేసినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ 30వ వార్డులోని తరుణిహట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన టిజిఎన్‌పిడిసిఎల్ డివిజన్, విద్యుత్, రెవెన్యూ కార్యాలయ భవనాలను కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్‌దత్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా కొరకు 33కెవి ఇంటర్ లింకింగ్ లైన్ ఫీడర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత రెండేళ్లలో 632 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేపించామన్నారు. తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలాల్లో నాలుగు సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేయబోతున్నామని పేర్కొన్నారు. మోడల్ సోలార్ గ్రామం పథకంలో భాగంగా నేలకొండపల్లిలోని చెరువు మాదారంలో 1,350 మంది గృహ వినియోగదారులకు రూ.15.66 కోట్ల వ్యయంతో 2,709 కెడబ్ల్యు సామర్థ్యంతో సౌర విద్యుత్ పలకల పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. అలాగే రైతుల కోసం రూ.31.08 కోట్లతో సౌర విద్యుత్ సౌర్య పనులు చేపట్టినట్లు తెలిపారు. అత్యవసర విద్యుత్ పునరుద్ధరణ కోసం విద్యుత్ అంబులెన్స్(ఇఆర్‌టి వాహనం)ను అందుబాటులోకి తెచ్చామని వివరించారు. తొలుత కస్నాతండాలో కాంగ్రెస్ నాయకుడు అజ్మీర వెంకన్న తల్లి సుక్కమ్మ ఇటీవల మరణించగా వారి నివాసానికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబి స్వర్ణకుమారి, టిజిఎన్‌పిడిసిఎల్ డైరెక్టర్ మధుసూధన్‌రావు, విద్యుత్‌శాఖ ఎస్ఇ శ్రీనివాసాచారి, డిఇ నాగేశ్వరరావు, ఎడి కొక్యనాయక్, ఎఇ జిల్లా ప్రభాకర్ రావు, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు దండి శ్రీజ, బానోత్ దివ్య, దండి రంగారావు, సోము వెంకట్‌రెడ్డి, బానోత్ ప్రసాద్, పూలసింగ్, మున్సిపాలిటీ, ఖమ్మంరూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు బానోత్ కిషోర్, తోట వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

## రాంగ్ రూట్‌లో డ్రైవింగ్...ప్రాణాలకు రిస్క్

### వైరా ఎసిపి సారంగపాణి

**ప్రజాపక్షం/వైరా:** రాంగ్ రూట్‌లో వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని, కేవలం కొంత దూరం తగ్గుతుందనే ఉద్దేశ్యంతో ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని వైరా ఎసిపి సాదుల సారంగపాణి సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా సక్రమమైన మార్గంలోనే ప్రయాణించాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఎసిపి సారంగపాణి మాట్లాడుతూ ప్రయాణ దూరం కొంత ఎక్కువైనా పర్వాలేదని, రాంగ్ రూట్‌లో వెళ్లడం మాత్రం ఎట్టి పరిస్థితుల్లోను చేయవద్దని సూచించారు. ఎదురుగా వచ్చే వాహనాలను పట్టించకోకుండా రాంగ్ రూట్‌లో ప్రయాణించడం వలన క్షణాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొనడం ద్వారా ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కారు, ఆటో, క్యాబ్ తదితర వాహనాల్లో ప్రయాణించే సమయంలో కొంత దూరం తగ్గుతుందనే కారణంతో డ్రైవర్లు రాంగ్ రూట్‌లో వెళ్లేందుకు ప్రయత్నిస్తే ప్రయాణీకులు కూడా అడ్డుకోవాలని ఎసిపి సూచించారు. రాంగ్ రూట్‌లో వెళ్లేందుకు డ్రైవర్‌ను అనుమతించకుండా సక్రమమైన మార్గంలోనే ప్రయాణించేలా చూడాలని కోరారు. దూరం తగ్గించుకోవడానికి రాంగ్ రూట్‌ను ఎంచుకోవద్దు. కొన్ని నిమిషాలు ఆదా చేసుకోవాలనే ప్రయత్నం జీవితాంతం, కోల్పోయే నష్టానికి దారితీయవచ్చు. సక్రమమైన మార్గంలో ప్రయాణిస్తేనే సురక్షితమైన గమ్యాన్ని చేరుకోగలం అని ఎసిపి సారంగపాణి పేర్కొన్నారు. వాహనదారులు, ప్రయాణీకులు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ తమతో పాటు ఇతరుల ప్రాణాల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని ఆయన సూచించారు.

## ఎఐకెఎంఎస్ మహాసభలు విజయవంతం

### అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నిర్భయ్ సింగ్, చలపతిరావు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అఖిల భారత కిసాన్ మజ్దూర్ సభ (ఎఐకెఎంఎస్) నాల్గవ జాతీయ మహాసభలు ఖమ్మంలో విజయవంతంగా ముగిసినట్లు ఎఐకెఎంఎస్ నాయకులు తెలిపారు. గురువారం ఖమ్మం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఫాసిస్టు దాడులు, కార్పొరేట్ దోపిడీ, భూస్వామ్య అణచివేతకు వ్యతిరేకంగా రాజీలేని ప్రజా ఉద్యమాలను నిర్మించాలని మహాసభ పిలుపునిచ్చిందన్నారు. మహాసభలో నూతన జాతీయ కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. జాతీయ అధ్యక్షుడిగా నిర్భయ్ సింగ్ దుడికే, ప్రధాన కార్యదర్శిగా జెవి. చలపతిరావు, ఉపాధ్యక్షులుగా అశీష్ మిట్టల్, సుధాకర్, కార్యదర్శులుగా బాలచంద్ర, రవీందర్ సింగ్, కోశాధికారిగా పి. వెంకటేశ్వర్లు తో పాటు మరో 15 మందితో కేంద్ర కార్యనిర్వాహక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు, వ్యవసాయ కార్మికుల ఐక్య పోరాటాలకు ప్రతీకగా ఆకుపచ్చ పట్టీ, ఎరుపురంగు నేపథ్యంలో నాగలి, కొడవలి చిహ్నాలతో కూడిన నూతన జెండాను మహా సభ ఆమోదించిందన్నారు. అదేవిధంగా పెద్ద ఆనకట్టలు, కెన్ బెట్వా లింక్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ, ఉపా, ఎన్ఎస్ఏ వంటి నల్ల చట్టాలను రద్దు చేయాలని, భూ గరిష్ట పరిమితిని తగ్గించి పేదలకు భూ పంపిణీ చేపట్టాలని, సిఈసి జ్ఞానేష్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని తదితర మొత్తం 17 తీర్మానాలను ఆమోదించినట్లు వారు తెలిపారు. మహాసభల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## వీడిన బిఎస్‌సి నర్సింగ్ విద్యార్థిని హరిణి హత్య కేసు మిస్టరీ

### ప్రియుడు పవన్ హంతకుడిగా పోలీసులు నిర్ధారణ
### ప్రేమను నిరాకరించడంతో హరిణిని హత్యచేసినట్లు గుర్తింపు
### డిఎస్‌పి ఆదినారాయణ వెల్లడి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** గత తొమ్మిది రోజుల క్రితం నర్సింగ్ విద్యార్థిని హత్య కేసు ఎంతటి సంచలనంగా మారిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. విద్యార్థిని ఇంటి ఆవరణంలో బాత్ రూమ్ వెనకాల హరిణి అత్యంత పాశవికంగా హత్యకు గురైంది. సెలవులకు ఇంటికి వచ్చిన నర్సింగ్ విద్యార్థిని శవంగా బాత్ రూమ్ పక్కన పోలీసులకు కనిపించింది. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న జూలూరుపాడు పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. తొమ్మిది రోజులు గాలించి ప్రియుడు పవన్ ని అరెస్ట్ చేసి విచారించగా నమ్మలేని నిజాలు వెలుగు చూ శాయి. తానే తన ప్రియురాలిని హత్య చేసినట్లు పవన్ ఒప్పుకోవడం ఇంకా సంచలనంగా మారింది. ఈ ఘటన కు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. జూలూరుపాడు మండల పరిధిలోని వెంగన్న పాలెం గ్రామానికి చెందిన ఇంద్రపల్లి హరిణి హత్య కేసు మిస్టరీ వీడింది. ఆమె ప్రియుడు దేవరకొండ పవన్ కుమార్ హరిణిని హత్య చేసినట్టు పోలీసుల విచారంలో తేలింది.

### డిఎస్‌పి ఆదినారాయణ వివరణ..

జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో బిఎస్‌సి నర్సింగ్ విద్యార్థిని ఇంద్రపల్లి హరిణి హత్య కేసులో పరారీలో ఉన్న నిందితుడు దేవరకొండ పవన్ కుమార్‌ను జూలూరుపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. సెప్టెంబరు 22న వెంగన్నపాలెం గ్రామంలోని తన ఇంటి వద్ద ఇంద్రపల్లి హరిణి (18) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు మృతురాలి తల్లి రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొలుత. క్రైం నెం.155/2026 యూ/ఎస్ 194 బిఎన్ఎస్ఎస్ కింద కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించగా, మెడకు వైర్ వంటి వస్తువుతో బిగించి హత్య చేసినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. దీంతో కేసును యూ/ఎస్ 103(1) బిఎన్ఎస్ కింద హత్య కేసుగా మార్చారు. దర్యాప్తులో మృతురాలు హరిణి, నిందితుడు పవన్ కుమార్ (22), గత నాలుగు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్న ట్లు, వివాహం చేసుకోవాలని భావించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అయితే ఇరువురి కుటుంబాల మధ్య ఏర్పడిన వివాదాల నేపథ్యంలో హరిణి పవన్ కుమార్‌ను వివాహం చేసుకోవడానికి నిరాకరించినట్లు, ఈ కారణంతోనే నిందితుడు హరిణిని హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. హత్య అనంతరం నిందితుడు పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్నాడు. ఈ క్రమంలో నిందితుడు ఒంటిగుడిసె రోడ్‌లోని సీతారామ ప్రాజెక్టు కాలువ సమీపంలో దాచిపెట్టిన ద్విచక్ర వాహనాన్ని తీసుకుని దూర ప్రాంతానికి వెళ్లి ర్యాపిడోలో పని చేసుకుంటూ జీవించేందుకు ప్రయత్నిస్తున్నాడన్న సమాచారం మేరకు జూలూరుపాడు సిఐ, ఎస్ఐ, సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి నిందితుడు పవన్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి బైక్, రెండు మొబైల్ ఫోన్లు, బైక్ గేర్ వైర్, నిందితుడు దరించిన షర్ట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు కొత్తగూడెం డిఎస్‌పి ఆదినారాయణ తెలిపారు.

## అక్రమ మైనింగ్‌పై చర్యలేవీ?

### సిపిఐ నేత బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** జిల్లాలో విలువైన బెరైటీస్ ఖనిజాన్ని కొందరు అక్రమార్కులు అక్రమంగా తరలిస్తున్నారని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు ఆరోపించారు. ఎటువంటి అనుమతులు లేకుండానే తవ్వకాలు జరుపుతుంటే మైనింగ్ అధికారులు ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని వెలుగుమట్ల అర్బన్ పార్కు ప్రాంతంలో అక్రమ మైనింగ్ చేస్తున్న ప్రాంతాలను గురువారం సిపిఐ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ ఖనిజ తవ్వకాలకు సంబంధించి ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలని, ఖనిజ తరలింపునకు ప్రభుత్వానికి పన్ను చెల్లించాలని ఇవేవి లేకుండానే ఖనిజాన్ని తరలించి సొమ్ము చేసుకుంటున్నారని హేమంతరావు తెలిపారు. గతంలో కూడా సిపిఐ అక్రమ మైనింగ్‌కు వ్యతిరేకంగా పోరాడిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పట్టపగలు బెరైటీస్ ఖనిజాన్ని వెలికితీసి లారీలు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుంటే అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదని దీనితో అక్రమ మైనింగ్ మరింతగా పెరుగుతుందన్నారు. అక్రమ మైనింగ్‌కు రాజకీయ అండదండలు ఉన్నాయన్న ప్రచారం సాగుతుందన్నారు. అక్రమ మైనింగ్ ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఏర్పాటు చేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్‌ను నిలుపుదల చేయకపోతే సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యుడు యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, కూచిపూడి రవి, మేకల శ్రీనివాసరావు, జిల్లా నాయకులు తాటి నిర్మల, వరదా నర్సింహారావు, చింతల రమేష్, మునిగే కోటేశ్వరరావు, మడుపల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు

### ఎనిమిది నెలల సమస్యపై అధికారుల చర్యలు



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ సమీపంలో ఎనిమిది నెలలుగా కొనసాగుతున్న మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీపై 'ప్రజాపక్షం'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం యంత్రాలతో తవ్వకాలు చేపట్టి లీకేజీకి కారణమైన పైపులైన్‌ను గుర్తించి మరమ్మతులు ప్రారంభించారు. పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథా కావడంతో పాటు రహదారి పక్కన బురద, గుంతలు ఏర్పడి దుకాణదారులు, వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పనులు ప్రారంభం కావడంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చిన 'ప్రజాపక్షం' పత్రికకు, స్పందించి మరమ్మతులు చేపట్టిన మిషన్ భగీరథ అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## పేద కుటుంబాలకు అండగా ప్రజా ప్రభుత్వం

### ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/మణుగూరు:** పేద కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని పినపాక ఎమ్మెల్యే, రాష్ట్ర శాసనసభ షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మణుగూరు మండలంలోని 14 గ్రామ పంచాయతీలు , మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను, అలాగే 33 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరుగుతోందని, పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా అందేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అదే విధంగా ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా 33 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేయడం జరిగిందన్నారు. పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం వివాహ సమయంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పినపాక నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా తన వంతు కృషి కొనసాగిస్తానని పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి రామారావు, ఎంపిడిఒ, మున్సిపల్ కమిషనర్, సివిల్ సప్లై అధికారి, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో జోనల్ అధికారి తనిఖీ



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి శ్రీకవిత ఇంజనీరింగ్ కళాశాల భవనంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను భద్రాద్రి జోన్ జోనల్ అధికారి అపర్ణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి విద్య, వసతి, భోజనం, ఆరోగ్యం, మౌలిక వసతులపై వివరాలు తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నట్లు విద్యార్థినులు తెలిపారు. అనంతరం ఎస్ఎ 1 పరీక్షల నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డైనింగ్ హాల్, వంటశాలను తనిఖీ చేసి పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్యాంపస్‌లో పెరిగిన గడ్డిని తొలగించి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, విద్యార్థినులకు సురక్షిత, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

## సామాన్యుడికి వజ్రాయుధం.. సమాచార హక్కు చట్టం

### రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ పివి. శ్రీనివాసరావు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సమాచార హక్కు చట్టం సామాన్యుడికి వజ్రాయుధం లాంటిదని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ పివి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఎస్ఆర్అండ్ బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా॥ మహ్మద్ జాకీరుల్లా అధ్యక్షతన జరిగిన 'సమాచార హక్కు చట్టం – స్వరూప స్వభావాలు' అనే అంశంపై జరిగిన సమావేశంలో శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. చట్టాలు, చరిత్ర, గతం, వర్తమానం, భవిష్యత్తు గురించి విద్యార్థులు అధ్యయనం చేయాలని సూచించారు. జవాబుదారి తనం ఉండాలనే ఆలోచనతో ఈ చట్టం వచ్చిందని పౌర సమాజానికి పారదర్శకత ఉండాలనే ఆకాంక్షతో ఆర్‌టిఐ 2025లో సమాచార హక్కు చట్టాన్ని రూపొందించారని తెలిపారు. విద్యార్థులు సామాజిక అవగాహనతో పాటు పౌర బాధ్యతలను గుర్తెరిగి వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎఎల్ఎన్ శాస్త్రి, ఎగ్జామ్స్ కంట్రోలర్ డా॥ రమా సత్యవతి, పూర్వ విద్యార్థి వంజాకుల లక్ష్మినారాయణ, గెంటేల నారాయణ రావు మనవడు శ్రీనివాసరావు, అధ్యాపకులు బంగారా, డా॥ వై. రవి వర్ధన్, డా॥ లక్ష్మణ్‌రావు, పి. నర్సింహారావు, అజిత్, అప్పారావు, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణాలో కలపాలి

### సిపిఐ (ఎం) ఎపి కార్యదర్శి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/భద్రాచలం :** పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రజాభీష్టం మేరకు ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో వి లీనం చేయాలని సిపిఐ (ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ముం పు మండలాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీ సుకెళ్లేందుకు ఆ పార్టీ పోలవరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన మోటార్ సైకిల్ యాత్ర గు రువారం భద్రాచలం చేరుకోవడంతో స్థానిక రాజుపేట వద్ద ఘనం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కుంజా బొజ్జి స్మారక స్థూపానికి పూల మాలలు వేసి నివాళులర్పించా రు. ఈ సందర్భంగా గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పోలవరం ముంపు ప్రాంతాల ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. తె లుగు రాష్ట్రాలు కూడా తీవ్ర వివక్ష చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సరిహద్దు గ్రామాల మౌలిక సదుపాయాలు రహదార్ల విషయంలో ప్ర త్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నా రు.

# వేగవంతంగా అభివృద్ధి పనులు

కలెక్టర్ కోయ శ్రీహర్ష





ప్రజాపక్షం/అంతర్గాం/పెద్దపల్లి : అంతర్గాంజిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. గురువారం అంతర్గాం మండలంలో నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను, ఆకెనపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూరీసర్వే ప్రక్రియను, రామగుండం తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంతర్గాం మండలంలో నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచి, రానున్న 6 నెలల్లో నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఎఇని ఆదేశించారు. అనంతరం ఆకెనపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియను పరిశీలించారు. భూ రీసర్వే నిర్వహించే ముందు సంబంధిత రైతులకు ముందస్తుగా సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. భూ రీసర్వే ప్ర క్రియను నవంబర్ 10లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రామగుండం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఫారం6 ద్వారా వ చ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం వెరిఫికేషన్ పూర్తి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో ఎడి సర్వేయర్ సోమేశ్వర్, అంతర్గాం తహసీల్దారు పడాల ప్రసాద్‌రావు, రామగుండం తహసీల్దార్ రవీందర్‌రావు, అంతర్గాం మండల సర్వేయర్ లలిత, సర్పంచ్ , సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### సోలార్ విద్యుత్‌పై విస్తృత ప్రచారం

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సేవా సేతు అభియాన్ సదస్సులను విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.గురువారం పెద్దపల్లి పట్టణంలోని జండా చౌరస్తా సమీపంలోని విద్యుత్ కార్యాలయ ంలో నిర్వహించిన పిఎం సూర్య ఘర్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు రో జుల పాటు నిర్వహించే సేవా సేతు అభియాన్ క్యాం ప్‌లో ప్రతి విద్యుత్ వినియోగదారుడు తమ ఇంటిపై సో లార్ ప లకలు ఏర్పాటు చేసుకునేందుకు స్పాట్ రిజిస్ట్రేష న్ చేసుకోవాలని సూచించారు.సోలార్ విద్యుత్ వినియో గం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎన్ పిడి సిపిఎల్, టిజి రెడ్కో అధికారులు, బ్యాంకర్లు, సోలార్ వెం డర్లు ఒకే వేదికపై అందుబాటులో ఉండటం వల్ల ప్రజల కు అవసరమైన సమాచారం,సేవలు ఒకేచోట లభిస్తున్నాయని తెలిపారు.ఈ అవకాశాన్ని ప్రతి విద్యుత్ వినియోగదారుడు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు.ముఖ్యంగా పట్టణ ప్రాంతాలు,ఉద్యోగులు అధికంగా నివసించే కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి పిఎం సూర్య ఘర్ పథకం, సోలార్ విద్యుత్ వినియోగంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.ఎస్ఇగంగాధర్ , డిఇ, ఎడిఇ,లీడ్ బ్యాంక్ మేనేజర్ సోలార్‌వెండర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాదరణ పొందిన మహోన్నత వ్యక్తి 'బిరుదు రాజమల్లు'

పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ విజయ రమణారావు



ప్రజాపక్షం/సుల్తానాబాద్: పెద్దపల్లి నియోజకవర్గంలో అత్యంత ప్రజాదరణ కలిగిన మహోన్నత వ్యక్తి బిరుదు రాజమల్లు అని రాష్ట్ర ప్రభుత్వ వీప్ పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయ రమణారావు అన్నారు.పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిసినాయకుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి స్వర్గీయ బిరుదు రాజమల్లు 76 వ జయంతి ఉత్సవాలను బిరుదు రాజమల్లు తనయుడు సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రా ధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పెద్దప ల్లి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ విజయ రమణారావు పాల్గొని రాజమల్లు కాంస్య విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వర్గీయ బిరుదు రాజమల్లు సతీమణి బిరుదు సుశీల, తనయుడు మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, కోడలు మాజీ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బిరుదు సమత, కుమారులు శ్రీనివాస్, అనిల్, సంతోష్, కూతుర్లు స్వరూపారాణి, రత్నమాల, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కాంగ్రెస్ నాయకులు గోపగాని సారయ్య గౌడ్, సాయిరి మహేందర్, కందుల ప్రకాష్, వివిధ మండలాల సర్పంచులు, సుల్తానాబాద్ కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## చేర్యాల అభివృద్ధికి ఎంపి నిధులు కేటాయించాలి

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



ప్రజాపక్షం/చేర్యాల : చేర్యాల రేణుక గార్డెన్‌లో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు ధూల్మిట్ట మండలాల లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులతో పాటుగా, 56 కుట్టు మిషన్లను ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలసి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అందించారు. ఈసందర్భంగా పల్లా మాట్లాడుతూ, చేర్యాల పరిధిలోని 53 గ్రామలకు 5 లక్షల రూపాయల చొప్పున అభివృద్ధి పనులకు నిధులను కేటాయించాలని ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డిని, ఎమ్మెల్యే పల్లా కోరారు. అలాగే చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు ధూల్మిట్ట గ్రామాలలోని చెరువులను నిండే వరకు నీటిని విడుదల చేయాలని ఎంపి చామలకు పల్లా విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు జాప్యం లేకుండా అందించాలని సూచించారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. ఎమ్మెల్యే సూచిన మేరకు నిధులకోసం జిల్లాల కలెక్టర్లతో మాట్లాడతానని ఎంపి హామీ ఇచ్చారు. అనంతరం చేర్యాల 12వ వార్డులో 10 లక్షలతో కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపనచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒసదానందం, మన్సిపల్ చైర్మన్ అరుణ బాల నర్సయ్య, వైస్ చైర్మన్ మేడిశెట్టి ఉమా శ్రీదర్, కౌన్సిలర్లు సుప్రజా, గీతాంజలి, రాజేశ్వరి, ప్రసాద్, ఆయా గ్రామల సర్పంచ్‌లు, అధికారులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుల సంక్షేమం సమాజ బాధ్యత

సి. ప్రభాకర్ : గ్రంథాలయ ఆవరణలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం



ప్రజాపక్షం /కోరుట్ల : ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని వృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సి. ప్రభాకర్ గ్రంథాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వయోవృద్ధుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, సమాజంలో వారికి తగిన గౌరవం కల్పించాల్సిన అవసరంపై నిర్వాహకులు,పాల్గొన్న వారు మాట్లాడారు. సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం మాట్లాడుతూ వృద్ధులు తమ జీవిత అనుభవాలతో కుటుంబానికి, సమాజానికి అందించిన సేవలను గుర్తిస్తూ వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వయస్సు మీద పడిన వారికి ఆర్థిక, సామాజిక, ఆరోగ్యపరమైన భద్రత కల్పించేందుకు ప్రభుత్వాలు,స్వచ్ఛంద సంస్థలు, కుటుంబ సభ్యులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.కవి రచయిత రాస భూమ్మయ్య మాట్లాడుతూ వృద్ధులను ఒంటరితనానికి గురిచేయకుండా కుటుంబ సభ్యులు ఆప్యాయతతో చూసుకోవాలని, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.వృద్ధుల అనుభవం,జ్ఞానం యువతకు మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాచకొండ పెద్ద దేవ య్య, ముఖ్య అతిధులు కవి రచయిత రాస భూమయ్య,సిపిఐ జిల్లా కార్యదర్శి చిన్న విశ్వనాథం వృద్ధుల సంఘం నాయకులు రాడం అశోక్,చింతా భూమేశ్వర్,సిరిపురం గంగాధర్,ఎక్కల దేవి గంగాధర్,మహమ్మద్ మౌలానా, స్థానికులు,తదితరులు పాల్గొన్నారు.

## ఫీజురీయింబర్స్ రద్దు చేసేందుకు సిఎం కుట్ర

మాజీ మంత్రి హరీష్‌రావు



ప్రజాపక్షం/ సిద్దిపేట : సమైక్య పాలనలో కాంగ్రెస్ తెచ్చిన ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం తెస్తే.. తెలంగాణ వచ్చాక కెసిఆర్ ఆ పథకాన్ని కొనసాగించారని .. కాని రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ తీసేసే కుట్ర చేస్తుందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు మండి పడ్డారు. గురువారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నాయకులతో సమావేశం అయ్యారు... ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సమైక్య పాలనలో ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని ఎలాంటి మార్పు లేకుండా కెసిఆర్ అమలు చేసి గొప్ప మనసు చాటుకున్నారు.ఈ ప్రభుత్వం మూడు ఏళ్లలో కేవలం 400 కోట్లు మాత్రమే విడుదల చేసినట్లు తెలిపారు. ఈ ప్రభుత్వ ప్రాధాన్యాతల్లో విద్య అనేది మిథ్య అని స్పష్టమవుతున్నదన్నారు. యువ వికాసం పేరుతో ప్రతి విద్యార్థికి 5 లక్షల విద్య భరోసా కార్డు ఇస్తామని ఆరు గ్యారెంటీల్లో పెట్టారని, దానికి అతి గతి లేదని ఎద్దేవా చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఇంకా మెరుగైన రీతిలో కొనసాగిస్తామని మేనిఫెస్టోలో చెప్పి, పథకాన్ని మరుగున పడేలా చేశారన్నారు. రెండు నెలల్లో మొత్తం బకాయిలు క్లియర్ చేస్తామని, కళాశాల యాజమాన్యాలకు ఆర్థిక మంత్రి భట్టి గారు ఇచ్చిన హామీ నీటి మూటలే అయ్యాయన్నారు. మాటమీద నిలబడేది లేదు, ఇచ్చిన హామీలు నెరవేర్చేది లేదు. ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు అందరిదీ అదే దారని ఎద్దేవా చేశారు. జాబ్ క్యాలెండర్ అని చెప్పి, ఆటకెక్కించారని, మెగా డిఎస్సి అని, దగా చేసారని విమర్శించారు. ఈ ప్రభుత్వం రాగానే అగ్రికల్చర్ కళాశాలను రద్దు చేసారు. మల్లి వచ్చేది మన ప్రభుత్వమేనని ఎట్లా పోయిందో అట్లనే కాలేజ్ తెచ్చుకుందామని స్పష్టం చేశారు. గ్రామ గ్రామానికి బిఆర్ఎస్‌వి విద్యార్థులు వెళ్లి కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ఎండగట్టాలని మాజీ మంత్రి హరీష్‌రావు పిలుపునిచ్చారు.

## 4న కరీంనగర్‌కు అమిత్ షా రాక

పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన బండి సంజయ్, పోలీస్ కమిషనర్



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ ప్రతిమ మెడికల్ కళాశాలను ప్రారంభించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 4న నిర్వహించే సిల్వర్ జూబ్లీ వేడుకలకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ప్రతిమ డీమ్డ్ యూనివర్సిటీ భవన నిర్మాణ పనులకు అమిత్ షా చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో అమిత్ షా పర్యటన, కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గురువారం కరీంనగర్ ప్రతిమ మెడికల్ కళాశాలకు వెళ్లారు. నగర పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, ప్రతిమ కళాశాల యాజమాన్యం బోయినిపల్లి శ్రీనివాసరావు, చెన్నమనేని వికాస్ రావు, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావులతో కలిసి హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. పైలాన్ ఆవిష్కరణ, డీమ్డ్ వర్సిటీ పైలాన్ స్టోన్, ఫోటో ఎగ్జిబిషన్ పరిసరాలతోపాటు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించేందుకు ఏర్పాటు చేసిన సభా స్థలాన్ని కూడా బండి సంజయ్ పరిశీలించారు.

**అమిత్ షా పర్యటన షెడ్యూల్ వివరాలు...**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అమిత్ షా ఈనెల 3న రాత్రి 9 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుండి నేరుగా బేగంపేటలోని గ్రాండ్ కాకతీయ హోటల్‌లో బస చేస్తారు. మరుసటి రోజు ఉదయం 11 గంటలకు బేగంపేట నుండి హెలికాప్టర్‌లో మెదక్ జిల్లా తూప్రాన్ చేరుకుంటారు. అక్కడ సబర్ డెయిరీ ప్రొడక్ట్స్ మిల్క్ ప్లాంట్ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. స్థానిక ఊర్జా ఇండస్ట్రియల్ పార్క్ లో లంచ్ చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు తూప్రాన్ నుండి హెలికాప్టర్ లో బయలుదేరి కరీంనగర్ లోని ప్రతిమ మెడికల్ కళాశాల వద్దకు చేరుకుంటారు. మెడికల్ కాలేజీ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొంటారు. సాయంత్రం 4.30 గంటలకు తిరిగి హెలికాప్టర్‌లో హైదరాబాద్ బయలుదేరి వెళతారు.

## కోర్టుకు అదనపు స్థలం కోసం కృషి




ప్రజాపక్షం/మెట్‌పల్లి : మె ట్‌పల్లి కోర్టు కాంప్లెక్స్ కు అవసరమైన అదనపు స్థ లం కోసం తన శాయశక్తు లా కృషి చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్‌కుమార్ అన్నారు. బా ర్ అసోసియేషన్ సభ్యుల విజ్ఞప్తి మేర కు గురువారం కోర్టు సమీపంలోని ఖా ళీగా ఉన్న ఎస్సారెస్పీ భూమిని ఆ యన పరిశీలించారు.కోర్టు కాంప్లెక్స్‌కు భూ మి అనుకూలంగా ఉన్నందున ఇరిగేష న్ శాఖ నుంచి భూమిని బదిలీ చేయించే ందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి,సం బంధిత అధికారులతో మాట్లాడతాన ని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. న్యాయవాదు ల సంక్షేమానికి అవసరమైన ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తానన్నా రు.అనంతరం బార్ అసోసియేష న్ గది లో ఎమ్మెల్యేను అధ్యక్షులు,న్యాయవాదులు శాలువాతో సన్మానించారు.కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, ఉపాధ్యక్షురాలు ఎం. సుమలత, న్యాయవాదులు మగ్గిడి వెంకట నర్సయ్య, గంద్ర ప్రవీణ్ రావు, కట్టానర్సాగౌడ్, పుప్పాల లింబాద్రి, ఎలాముల రా ంబాబు,ఒజ్జెల శ్రీనివాస్,బక్కూరి రమేష్, కాజీపేట స్రవంతి,ఆకుల ప్రవీణ్, ఆకుల మానస, మోరపు చిరంజీవి, కడారి యుగందర్, లోకిని సుమిత్, సామ అనిరుద్,వంగ వేణు ,అంగడిపురుషోత్తం,రజిత పాల్గొన్నారు.

## హత్య కేసులో నలుగురు నిందితుల అరెస్టు



ప్రజాపక్షం/హుజురాబాద్ : హుజురాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దపాపయ్యపల్లి గ్రామ శివారులోని ఎస్.ఆర్.ఎస్‌పి కాలువ వద్ద గత ఆదివారం రాత్రి జరిగిన హత్య కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేయగా,మరో ఐదుగురు నిందితులు పరారీలో ఉన్నారని హుజురాబాద్ ఎసిపి మాదవి తెలిపారు. సోమవారం ఉదయం అందిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా మృతుడు కమలాపూర్ మండలం ఉప్పల్‌పల్లి గ్రామానికి చెందిన వడిగే రాకేష్‌గా గుర్తిచినట్లు పేర్కొన్నారు. మృతుడి తల్లి వడిగే దేవక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం మృతుడు రాకేష్ , ఎ1 అమరగొండ ప్రశాంత్ ఒకే గ్రామానికి చెందిన వారు కాగా, రాకేష్‌కు ఎ1 ప్రశాంత్ భార్యతో వివాహేతర సంబంధం ఉందనే విషయంపై గతంలో ఇరువురి మధ్య వివాదాలు చోటుచేసుకుని, గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా నిర్వహించబడిందని, అయినప్పటికీ పాత కక్షలు కొనసాగడంతో ఎ1 ప్రశాంత్ రాకేష్‌ను హత్య చేయాలని నిర్ణయించుకుని, ఈ క్రమంలో ఎ1 ప్రశాంత్ వద్ద గతంలో డ్రైవర్‌గా పనిచేసిన ఎ2 రాజ్‌కుమార్‌ను సంప్రదించి హత్యకు సహకరించాలని కోరగా, అతను అంగీకరించాడని తెలిపారు. అనంతరం ఎ3 అమరగుండ రిత్విక్, ఎ4 తుమ్మల అఖిల్, ఎ5 టి. అఖిల్, ఎ6 రాహుల్, ఎ7 బి. చందు, ఎ8 బి. అజయ్ ,ఎ9 గణేష్‌తో కలిసి ముందస్తుగా హత్యకు పథకం రూపొందించి ఎ2 నుండి ఎ4 వరకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున , ఎ5 నుండి ఎ9 వరకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున డబ్బు ఇస్తామని దర్యాప్తులో వెల్లడైందని ఎసిపి తెలిపారు. పథకం ప్రకారం ఎ2 రాజ్‌కుమార్, మృతుడు రాకేష్‌తో పరిచయం పెంచుకుని అతన్ని ఎల్కతుర్తికి రప్పించి, ఆదివారం నాడు మృతుడిని హుజురాబాద్‌కు తీసుకువచ్చి మద్యం సేవించిన అనంతరం పెద్దపాపయ్యపల్లి గ్రామ శివారులోని ఎస్.ఆర్.ఎస్‌పి కాలువ వద్దకు తీసుకెళ్లి అక్కడకు ఎ1తో పాటు ఇతర నిందితులు కూడా చేరుకుని, మృతుడు అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించగా కత్తులతో దాడి చేశారని, దాడిలో ప్రశాంత్ మృతుడి గొంతుపై కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలై మృతి చెందినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం మృతదేహాన్ని కాలువలో పడవేసి నిందితులు అక్కడి నుంచి వెళ్లిపోయారని తెలిపారు. ఎల్కతుర్తి గ్రామంలోని ఒక అద్దె ఇంటిలో గురువారం నిందితులు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు ఎ1అమరగొండ ప్రశాంత్, ఎ2 రాజ్ కుమార్, ఎ3 అమరగుండ రిత్విక్,ఎ4 తుమ్మల అఖిల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన కత్తులు, రెండు ద్విచక్ర వాహనాలు, మొబైల్ ఫోన్లు తదితర వస్తువులను స్వాధీనం చేసుకుని,దర్యాప్తు ప్రక్రియను ఈ–సాక్ష్య ద్వారా వీడియో రికార్డు చేశారు. ఎ5 టి.అఖిల్, ఎ6 రాహుల్, ఎ7 బి. చందు, ఎ8 బి. అజయ్ , ఎ9 గణేష్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## పోషకాహారంతో.. చదువుపై ఏకాగ్రత



ప్రజాపక్షం/గోదావరిఖని : గోదావరిఖనిలోని జిల్లా ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి అల్పాహారం పథకాన్ని రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ గురువారం ప్రారంభించారు. రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, అదనపు కలెక్టర్ జల్ల అరుణశ్రీ, విద్యార్థినులతో కలిసి ఎమ్మెల్యే అల్పాహారం భుజించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోషకాహారంతో విద్యార్థుల్లో మానసిక, శారీరక ఎదుగుదల, ఆరోగ్యంతోపాటు చదువుపై ఏకాగ్రత ఏర్పడుతుందన్నారు. ఈ పథకం ద్వారా పాఠశాలల్లో హాజరు శాతం పెరిగి విద్యాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎంఇఓ జింక మల్లేష్, పాఠశాల ఉపాధ్యాయులు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మెట్‌పల్లి సమస్యలపై బిజెపి మహాధర్నా



ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి పట్టణ సమస్యల పరిష్కారం కోసం బిజెపిఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట సమరభేరి మహాధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షుడు బొడ్ల నవీన్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులో సిసి రోడ్లు, భూగర్భ డ్రైనేజీలు నిర్మించాలని,పెండింగ్‌లో ఉన్న సమీకృత మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.హిందూ శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని,పాత బస్టాండ్,ఆర్‌టిసి డిపో, ఆర్యపేట ప్రాంతాల్లో బస్సు షెల్టర్లు నిర్మించాలని, జాతీయ రహదారి వెంట డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కోరారు. శుద్ధి చేసిన మిషన్ భగీరథ తాగునీటిని సరఫరా చేయాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని,దసరా సందర్భంగా పట్టణ సుందరీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని నవీన్ హెచ్చరించారు. అనంతరం ఆర్‌డిఓకు వినతిపత్రం సమర్పించారు.బిజెపిజిల్లా అధ్యక్షుడు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ,కౌన్సిలర్లు,నాయకులు,కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్యాలయమా? పార్కింగ్ స్థలమా?

ప్రజాపక్షం/ముత్తారం: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల పరిధిలోని కేషనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణ కాంపౌండ్ వాల్ లోపల ప్రస్తుతం ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారుతోంది. నిబంధనలను విరుద్ధంగా కార్యాలయ ప్రాంగణంలో కొందరు తమ ప్రైవేట్ వాహనాలను పార్కింగ్ చేస్తున్నప్పటికీ, గ్రామపంచాయతీ అధికారులు మాత్రం కనీసం పట్టించుకోవడం లేదు.రాత్రి వేళల్లోనూ యథేచ్ఛగా....ప్రజాసేవకు నిలయంగా ఉండాల్సిన గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణను ఇలా ప్రైవేట్ అవసరాలకు వాడుకోవడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.పగటి సమయాలలోనే కాకుండా,ముఖ్యంగా రాత్రి వేళల్లో కూడా ఇక్కడ వాహనాలను యథేచ్ఛగా నిలిపి ఉంచుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో జరుగుతున్న ఈ అనధికారిక పార్కింగ్‌ను పూర్తిగా అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## 'ఆల్ఫోర్స్'లో ఘనంగా దాండియా, బతుకమ్మ వేడుకలు



ప్రజాపక్షం/కొత్తపల్లి: సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం బతుకమ్మ, దాండియా అని బతుకమ్మను రాష్ట్ర పండుగగా తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిక ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, వివిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. సతీమణి నరేందర్ రెడ్డితో కలిసి కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్,ఇ–టెక్నో స్కూల్ మైదానంలో బతుకమ్మ, దాండియా వేడుకలకు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మను పూజించినట్లయితే ప్రకృతిని కొలిచినట్లే అన్నారు. పల్లెల్లో ఈ పండుగకు నేటికీ తరగని వైభవం ఉన్నదని ప్రధానంగా మహిళలు పాడే బతుకమ్మ పాటలు, కోలాట విధానం, తెలంగాణ ప్రజల జీవన ప్రతిబింబం అన్నారు.రంగురంగుల పూలతో బతుకమ్మను అందంగా పేర్చుతారని, మహిళలు సాంప్రదాయ దుస్తులను ధరించి బతుకమ్మను ఆడుకుంటారని భ చెప్పారు.ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులు ఆనందోత్సవాల నడుమ ఈ వేడుకలు నిర్వహించుకోవడం అభినందనీయం అన్నారు. తల్లిదండ్రులు సైతం చక్కటి కోలాటంతో వేడుకలకు వన్నె తెచ్చారు.వేదికలలో భాగంగా విద్యార్థుల ప్రదర్శించినటువంటి పలు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.వివిధ ఆల్ఫోర్స్ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## వైద్యులపై ఆరోపణల కలకలం!

మాదాపూర్ ఘటనపై సమగ్ర విచారణకు సిపిఐ డిమాండ్



ప్రజాపక్షం/చేర్యాల : మాదాపూర్ ఘటన నేపథ్యంలో చేర్యాలకు చెందిన కొందరువైద్యుల పేర్లు వెలుగులోకి రావడంపై సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఐ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ డిమాండ్ చేశారు. గురువారం బస్టాండ్ చౌరాస్తా ఎదుట సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి, డాక్టర్ తిరుపతి ద్వారా జిల్లా వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. అనుమతులపై తనిఖీలు చేపట్టి వాస్తవాలను గుర్తించాలని అధికారులను కోరారు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలా చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని సిపిఐ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు జంగిలి యాదగిరి, కుడిక్యాల బాల్ మోహన్, నంగి కనకయ్య, సత్తయ్య గౌడ్, మమత, ప్రేమ్ కుమార్, పోషయ్య, ఎల్లిషా, చరణ్, మల్లేశం, రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### 13 కోట్ల ఓటర్ల తొలగింపుపై

# తమిళనాడులో లెఫ్ట్ ఆందోళన ఉధృతం



**చెన్నై:** కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. దాదాపు 14 కోట్ల ఓటర్లను తొలగించారని మండిపడితూ ప్రతిపక్ష పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతున్నాయి. అందులో భాగంగా సిఇసి జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని లేదా పార్లమెంటరీ అభిశంసన చేపట్టాలని డిమాండ్ చేస్తూ, గురువారం తమిళనాడు వ్యాప్తంగా వామపక్ష పార్టీలు తమ ఆందోళనలను తీవ్రతరం చేశాయి. కెకె నగర్‌లో జరిగిన నిరసన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వీరపాండియన్ ప్రసంగిస్తూ సిఇసి చర్యలను ప్రజాస్వామ్య హత్యగా అభివర్ణించారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద పార్లమెంటరీ ప్రజాస్వామ్యమని, నేడు కేంద్ర ప్రభుత్వం దాని ప్రాణాన్ని హరించిందని వీరపాండియన్ మండిపడ్డారు. ప్రజాస్వామ్యానికి జరిగిన ఈ హత్యకు ప్రధానమంత్రి, హోంమంత్రి బాధ్యత వహించాలని, కుట్రల ద్వారా 13 కోట్లకుపైగా మంది ప్రజల ఓటు హక్కును హరించినందుకు సిఇసి రాజీనామా చేయాల్సిందేనన్నారు.వీరపాండియన్‌తో పాటు నిరసనలో పాల్గొన్న సిపిఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి ఎస్. జేమ్స్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘించి, అంతర్గత అభ్యంతరాలను సిఇసి పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించిందని ఆరోపించారు. సిఇసి ఒక్కరే ఏకపక్షంగా వ్యవహరించి 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించారని, ఇది తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి కూడా భాగస్వామిగా ఉండే పాత ఎంపిక విధానాన్ని తిరిగి తీసుకురావాలని జేమ్స్ డిమాండ్ చేశారు. ధరపురం, మదురాంతకం ఉప ఎన్నికల నేపథ్యంలో, వామపక్ష నాయకులు ఈ వేదికను ఉపయోగించుకుని ప్రధాన ప్రాంతీయ పార్టీలను తీవ్రంగా విమర్శించారు. డిఎంకె, ఎఐఎడిఎంకె, టివికె పార్టీలు రాజకీయ చర్చలను విడిచిపెట్టాయని వీరపాండియన్ ఆరోపించారు. ఎర్రజెండా పట్టుకున్న కామ్రేడ్లు ఇంటింటికీ వెళ్లి, పేదల ముఖాల్లోకి చూస్తూ రాజకీయాలు మాట్లాడుతున్నారన్నారు. మరోవైపు ఆ పార్టీలు సరిహద్దులను సర్వే చేస్తూ, ఒక ఇంట్లో ఎంతమంది ఉన్నారో, ఒక్కో ఓటుకు ఎంత డబ్బు ఇవ్వాలో లెక్కలు వేస్తున్నాయని, బ్యాలెట్ పత్రం అనేది సుదీర్ఘ పోరాటానికి రక్తపు రసీదు అని, దానికి ధర నిర్ణయించడం నేరమని డాక్టర్ అంబేద్కర్ అన్నారని ఆయన గుర్తు చేశారు. చెన్నైలోని వాషర్‌మన్‌పేట్ సమీపంలో జరిగిన ప్రదర్శనకు నాయకత్వం వహించిన సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి. షణ్ముగం, లక్షిత ఓటర్లను ఓటర్ల జాబితా నుంచి పద్ధతి ప్రకారం తొలగించడానికి ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఒక ఆయుధంగా వాడుకుంటోందని ఆరోపించారు. 'ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా, అర్హులైన పౌరులందరికీ ఓటు హక్కు కల్పించడం, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేసేలా చూడటం, ఎన్నికలను నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం అనే ఎన్నికల సంఘం విధిని విస్మరించారు. ఆ విధిని నెరవేర్చడానికి బదులుగా, ప్రధాన ఎన్నికల కమిషనర్ ఓటు హక్కులను లాక్కుంటున్నారు, ఓటు వేసే హక్కును నిరాకరిస్తున్నారు, మోసపూరితంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. వారు భారత ప్రజలకు ఘోరమైన ద్రోహం చేశారు' అని ఆయన అన్నారు. అందువల్ల, ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు ఒక్క నిమిషం కూడా పదవిలో కొనసాగేందుకు కనీస నైతిక హక్కు లేదు, ఆయనను తక్షణమే తొలగించాలన్నారు. నుంగంబాక్కంలో జరిగిన నిరసనలో పాల్గొన్న సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు వాసుకి మాట్లాడుతూ సిఇసిని తొలగించడం, ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయడం, తొలగించిన పేర్లను పునరుద్ధరించడం, ఇసి ఎంపిక కమిటీని పునర్వ్యవస్థీకరించడం వంటి నాలుగు ప్రధాన డిమాండ్లను వెల్లడించారు.

# 45 లక్షల ఓటర్ల తొలగింపుకు కుట్ర

- పేర్లు తొలగించాలని కొందరు దరఖాస్తు చేస్తున్నారు
- కర్నాటక ముఖ్యమంత్రి డికె శివకుమార్



**బెంగళూరు :** ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) భారీ మోసం అని కర్నాటక ముఖ్యమంత్రి డికె శివకుమార్ అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న సర్‌లో భాగంగా, ఓటర్ల జాబితా నుండి పేర్లను తొలగించడానికి కొందరు వ్యక్తులు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు దాఖలు చేస్తూ కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గురువారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఓటర్ల జాబితా నుండి మైనారిటీలు, దళితులు, ఎస్‌టి ఓటర్ల పేర్లను తొలగించే కుట్రలో బిజెపి ప్రమేయం ఉందని ఆయన ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు తెలియకుండా ఈ అక్రమ ఓట్ల తొలగింపు జరగడం అసాధ్యమని ఆయన అన్నారు. బిజెపి, జనతాదళ్ నాయకులు భారీ కుట్రకు పాల్పడుతున్నారని శివకుమార్ అన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించడానికి పెద్ద సంఖ్యలో 'ఫారం–7' దరఖాస్తులు దాఖలు అవుతున్నాయని, ఓటర్ల జాబితాలోని 45 లక్షల మందికి పైగా ఓటర్ల వివరాలలో వ్యత్యాసాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. విజయపుర, భాల్కి, బెళగావి, మైసూరు, ముడిగెరె, బెంగళూరు వంటి అనేక నియోజకవర్గాల్లో ఓటర్ల పేర్లు, చిరునామాలు, ఇపిఐసి నంబర్లతో ముందే ముద్రించిన 'ఫారం–7' దరఖాస్తులను పెద్ద ఎత్తున సమర్పించారని ఆయన చెప్పారు. 70 శాతానికి పైగా పోలింగ్ కేంద్రాలలో, పలువురు బిజెపి నాయకులు, పార్టీ నేతలు ఫారం– దరఖాస్తులను సేకరిస్తున్నట్లు తాము ఇప్పటికే గుర్తించామన్నారు. కొందరు వ్యక్తులు డజన్ల కొద్దీ లేదా వందల కొద్దీ దరఖాస్తులను సమర్పించారని శివకుమార్ పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు 84, 92, 241, 423 ఫారమ్‌లను దాఖలు చేశారని ఆయన ఉదహరించారు. 'మైనారిటీలు, వెనుకబడిన తరగతులు, దళితులు, షెడ్యూల్డ్ కులాలు, గిరిజన వర్గాల ఓట్లను లక్ష్యంగా చేసుకోవడానికి ఈ దరఖాస్తులను ఉపయోగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఓటర్ల ఇపిఐసి నంబర్లు, చిరునామాల వంటి వివరాలు ఆ దరఖాస్తులు సమర్పించే వారికి ఎలా చేరాయని ఆయన ప్రశ్నించారు. ఈ డేటా ఎలా వచ్చింది? ఈ డేటాను ఎవరు ఇచ్చారు? ఎవరు ఇలా చేస్తున్నారు? ఇదొక పెద్ద ప్రశ్న అని ఆయన అన్నారు. విజయపుర జిల్లాలో, కేవలం విజయపుర నగరంలోనే 14,000కు పైగా దరఖాస్తులు సమర్పించబడ్డాయని శివకుమార్ పేర్కొన్నారు. అదే సమయంలో, బాబలేశ్వర్‌లో ఆరుగురు వ్యక్తులు సుమారు 1,634 దరఖాస్తులను దాఖలు చేసినప్పటికీ, చట్టపరమైన పరిణామాలు ఉంటాయని అధికారులు హెచ్చరించడంతో వాటిని వెనక్కి తీసుకున్నారని ఆయన తెలిపారు. విజయపుర నగర అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు రోజుల్లో సుమారు 13,000 దరఖాస్తులు సమర్పించబడ్డాయని, వీటిలో బిజెపి కార్యకర్తలు, ఒక బిజెపి ఎమ్మెల్యే కార్యాలయానికి సంబంధించిన సిబ్బంది కూడా ఉన్నారని ఆయన ఆరోపించారు. 'ఓట్ల దొంగతనం, ఎన్నికల నేరంగా అభివర్ణించిన ఆయన, దీనికి బాధ్యులైన వారిపై క్రిమినల్ విచారణ చేపట్టాలని, ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. 'వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల సంఘం బాధ్యత. తమ ప్రభుత్వం, పార్టీ సేకరించిన పత్రాలు, ఆధారాలను స్వయంగా ఎన్నికల సంఘానికి సమర్పిస్తానని శివకుమార్ చెప్పారు. 'నేను అక్కడికి వెళ్తున్నాను, అక్కడే కూర్చుంటాను. ఆ నేరపూరిత కుట్రపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ అయ్యేంత వరకు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయం నుండి తిరిగి రాను' అని ఆయన అన్నారు. అవసరమైతే సిఇఒ కార్యాలయంలోనే బస చేస్తానని, మంత్రివర్గ సమావేశానికి కూడా హాజరుకాకపోవచ్చని శివకుమార్ పేర్కొన్నారు. తాను ఎన్నికల సంఘంతో మాట్లాడానని, సంబంధిత డేటాను సేకరించాలని అధికారులను కోరానని, అలాగే సమాచారాన్ని సేకరించాల్సిందిగా ప్రధాన కార్యదర్శిని ఆదేశించానని ఆయన తెలిపారు.

## పైలెట్ మచ్చర్ కు ప్రశంసల వెల్లువ



**న్యూఢిల్లీ:** ఫ్లయ్ దుబాయ్ విమానాన్ని హైజాక్ కాకుండా అడ్డుకుని పెద్దప్రమాదాన్ని నివారించిన భారత పైలట్ స్మిత్ మచ్చర్ సాహసాన్ని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తదితర ప్రపంచ నాయకులు ప్రశంసించారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ కూడా మచ్చర్ ధైర్యసాహసాలను కొనియాడారు. మచ్చర్ ఇరుగుపొరుగువారు, గగనతల నిపుణులు ప్రశంసించారు. ఆయనకు భారతదేశ అత్యున్నత "అశోక చక్ర"అవార్డు ఇవ్వాలని గగనతల నిపుణుడు డాక్టర్ విపుల్ సక్సేనా సిఫార్సు చేశారు. ఇక ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ అయితే మచ్చర్‌ను ఆకాశానికి ఎత్తేశారు. ఆయనను రియల్ హీరోగాఅభివర్ణించారు. డోనాల్డ్ ట్రంప్ ఈ హైజాక్ ప్రయత్నం ఘటనపై స్పందిస్తూ బీబీ (నెతన్యాహూ) ద్వారా తాను ఈ పెను ప్రమాద నివారణ గురించి తెలుసుకున్నానన్నారు. ఆయన గొప్ప కథానాయకుడుగా ప్రాణాలకు తెగించి అందరినీ రక్షించారని మచ్చర్‌ను ప్రశంసించారు.ఇప్పటికీ ఆయన ఆరోగ్యం ఎంతమాత్రం బాగోలేదని,ఆయనకు చాలా మంచి చికిత్స చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఇది అద్భుతమైన,వీరోచిత సంఘటన అని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ పేర్కొన్నారు.

ఈ ఘటనపై భారత రాష్ట్రపతి ద్రౌపదీముర్ము స్పందిస్తూ, మచ్చర్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. స్మిత్ అపారమైన ధైర్యసాహసాలు ప్రదర్శించారని అన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా స్మిత్ మచ్చర్‌పై ప్రశంసలు కురిపించారు. ఆయన కుటుంబీకులతో మాట్లాడారు. ఆయనకు పూర్తిస్థాయిలో మంచి వైద్యం చేయిస్తున్నామని, తరచు ఈ విషయంపై సంప్రదిస్తున్నామని చెప్పారు. సౌదీఅరేబియా,దుబాయ్ దేశాలలో ఉన్న భారత రాయబార కార్యాలయాలు మచ్చర్ ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయి. అక్కడి విషయాలను,తాజా పరిణామాలను వారి కుటుంబానికి తెలియజేస్తూ అనుసంధాన చర్యలు చేపట్టాయి.

### మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌పార్టీని గెలిపిస్తే

# గిరిజనులకు విద్యా వైద్య సదుపాయాలు

- బాలాఘాట్ జిల్లా పర్యటనలో రాహుల్‌గాంధీ భరోసా
- గిరిజన ఆరోగ్య సంరక్షణలో బిజెపి ఘోర వైఫల్యం
- మరణించిన పిల్లల కుటుంబాలకు పరామర్శ



**బాలాఘాట్:** మధ్యప్రదేశ్ రాష్ట్రంబాలాఘాట్ జిల్లాలో గడచిన కొద్ది నెలలుగా అంటువ్యాధులు,పోషకాహారలోపంతో మరణించిన 32మంది పిల్లల కుటుంబాలను కాంగ్రెస్‌నాయకుడు,లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ గురువారం పరామర్శించారు.వారి బాధలను ఓపికగా విన్నారు.సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికలలో మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌పార్టీని అధికారంలోకి తీసుకువస్తే,గిరిజన కుటుంబాలకు ఆరోగ్య సంరక్షణ,విద్యా,ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.అర్హులైన గిరిజన కుటుంబాలకు భూమి హక్కులు,అటవీ హక్కులు కల్పించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బైహార్ బ్లాక్‌లోని బిర్సా ప్రాంతంలో ఉన్న బైగా గిరిజన ఆవాసాలకు చెందిన పిల్లలు ఎక్కువమంది అంటువ్యాధులకారణంగా మరణించారు.గిరిజన కుటుంబాలకు వైద్య సదుపాయాలు కల్పించడంలో తీవ్రమైన నిర్లక్ష్యంపై ఆ రాష్ట్ర హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.ఈ విషయంపై న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వాన్ని,సంబంధిత అధికారులను వివరణ కోరింది. ఈ కేసు విచారణలో ఉంది.కాంగ్రెస్–బిజెపి పార్టీల మధ్య మధ్యప్రదేశ్‌లో మాటలయుద్ధం కొనసాగుతున్న తరుణంలో రాహుల్‌గాంధీ బైగా గిరిజన కుటుంబాలలో మరణించిన పిల్లల బంధువులను పరామర్శించారు. వారిని ఓదార్చారు.గిరిజన కుటుంబాలకు ఆరోగ్య సదుపాయాలు కల్పించడంలో,మౌలిక సదుపాయాలు సమకూర్చడంలో బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

ఆదివాసీయులే ఈ దేశంలో నిజమైన మూలవాసులని,వారే ఈ భారత భూమికి మొదటి యజమానులని రాహుల్‌గాంధీ అన్నారు.గిరిజనులు అత్యధికంగా ఉండే ప్రాంతాలలో వారి సమస్యలు పరిష్కరించడంలో,వారి ఆరోగ్య సంరక్షణలో బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. సుమారు గంటసేపు ఆయన గిరిజన కుటుంబాలతో గడిపారు. ఈ సందర్భంగా ఆ చుట్టుపక్కల గ్రామాల నుండి సుమారు 1200 మంది గిరిజనులు రాహుల్‌గాంధీ చుట్టూ చేరారు. ఆయన మాటలు ఆలకించారు.జగ్లా గ్రామానికి చేరుకోవడానికి ముందుగా ఆయన మాటే గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. అక్కడ స్కూలు పిల్లలతో సంభాషించారు. వారికి వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతా ప్రమాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. జగ్లా గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాలలో పిల్లలు అంటువ్యాధుల కారణంగా మరణించారని బిజెపి ప్రభుత్వంపై రాహుల్‌గాంధీ విమర్శించారు.వారికి తగిన ఆరోగ్య సదుపాయాలు,విద్యా సదుపాయాలు,ఉపాధి,తగిన మద్దతు ఇవ్వలేదన్నారు.తక్షణం ఈ విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వం వారికి భరోసా ఇవ్వాలని కోరారు.మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద ఈ ప్రాంతంలో పనులు పునరుద్ధరించాలని,అటవీ హక్కులను,భూమి హక్కులను అర్హులైనవారికి పునరుద్ధరించాలని కోరారు.

# 'వానిష్ కుమార్'ను ప్రజలు క్షమించరు

సిఇసి జ్ఞానేశ్ కుమార్‌పై మమతా బెనర్జీ మండిపాటు



**న్యూఢిల్లీ :** ఓటు హక్కులను హరించిన వారిని ప్రజలు క్షమించబోరని తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. 2023 నాటి చట్టం కింద ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి), ఎన్నికల కమిషనర్లకు కల్పించిన రక్షణ (ఇమ్యూనిటీ) నిబంధనపై ఆమె ప్రశ్నలు లేవనెత్తారు. సిఇసి జ్ఞానేశ్ కుమార్ 'వానిష్ కుమార్' (అదృశ్యం చేసే వ్యక్తి) అని సంబోధిస్తూ, ఆయన ప్రజల హక్కులను అదృశ్యం చేశారని, తాను ఆయనను ఎలా క్షమించగలనన్నారు. గురువారం మమతా బెనర్జీ ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ ప్రక్రియను టిఎంసి మొదటి నుంచే వ్యతిరేకించిందని, ఎన్నికల కమిషన్ (ఇసి) ఈ ప్రక్రియను కేంద్రీకృత విధానంలో నిర్వహించిందని ఆరోపించారు. 'మేము కోర్టుకు వెళ్లాము, కానీ న్యాయం దక్కలేదు. బాధితులైన 100 మందితో కలిసి ఇసిని కలిసేందుకు వెళ్లాము, కానీ వారు మమ్మల్ని అవమానించారు' అని ఆమె అన్నారు. సిఇసిని కలవడానికి వెళ్ళిన టిఎంసి ఎంపిలను వెళ్ళిపోండి అని అన్నారని ఆమె ఆరోపించారు. అధికారిక విధుల నిర్వహణలో లేదా నిర్వహణగా భావించబడే పనుల విషయంలో సివిల్ లేదా క్రిమినల్ చర్యల నుండి రక్షణ కల్పించే ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకం, సేవా షరతులు, పదవీకాలం) చట్టం, 2023'లోని రక్షణ నిబంధనను పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి ప్రశ్నించారు. 'రాజ్యాంగం, ప్రజాస్వామ్య బాధ్యతల ప్రకారం ఎవరైనా ఎన్నికల ప్రక్రియను, ప్రజాస్వామ్యాన్ని పర్యవేక్షిస్తుంటే, అప్పుడు ఎటువంటి సమస్యా లేదు. మేము దాన్ని గౌరవిస్తాము. కానీ కేవలం రక్షణ (ఇమ్యూనిటీ) ఉందన్న కారణంతో ఎవరైనా ఆ పదవిలో కూర్చుంటే' అని ఆమె అన్నారు. సర్ ప్రక్రియలో ఓటర్ల పేర్లను తొలగించడంపై స్పందిస్తూ, ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టిఎంసి గెలిచిన నియోజకవర్గాలు, ప్రాంతాల పైనే ఈ ప్రక్రియ తీవ్ర ప్రభావం చూపిందని బెనర్జీ ఆరోపించారు. 'మేము ఎక్కడైతే గెలిచామో, అక్కడ నాలుగు రెట్లు ఎక్కువ మంది ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయి' అని ఆమె అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో సుమారు 4,000 ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను తగలబెట్టిన ఘటనల వెనుక బిజెపి హస్తం ఉందని టిఎంసి అధినేత్రి ఆరోపించారు. అంతేకాకుండా, పశ్చిమ బెంగాల్‌లో తమ పార్టీ కార్యకర్తలు ఆంక్షలు, వేధింపులను ఎదుర్కొంటున్నారని ఆమె పేర్కొన్నారు. 'కోర్టు ఆదేశం లేకుండా నేను ఇంటి నుంచి బయటకు వెళ్లే పరిస్థితి లేదు. మా పార్టీ సమావేశాలు నిర్వహించడానికి అనుమతి లేదు. మా కార్యకర్తలపై కేసులు నమోదు చేశారు. నా నివాసం వద్ద కనీస భద్రత కూడా లేదు. ప్రతిరోజూ 200–300 మంది దుండగులు నా ఇంటి ముందుకొచ్చి అల్లరి చేస్తున్నారు. రాత్రి 8 గంటల తర్వాత బయట రోడ్ల మీద ఎవరూ కనిపించడం లేదు' అని బెనర్జీ అన్నారు.

## మణిపూర్‌లో నలుగురు ఉగ్రవాదులు అరెస్టు

**ఇంఫాల్:** మణిపూర్‌లో రెండు వేర్వేరు సంస్థలకు చెందిన నలుగురు ఉగ్రవాదులను పోలీసులు అరెస్టు చేశారు. టెంగ్నౌపాల్ జిల్లాలోని భారత్–మయన్మార్ సరిహద్దు ప్రాంతమైన ఫైబోల్ దగ్గర నిషేధిత పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్ఎ)కు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మింథార్ క్యాంప్ నుంచి పారిపోయి చొరబాటుకు యత్నిస్తుండగా నిఘా వర్గాల సమాచారం మేరకు వీరిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం వారిని పోలీసులకు అప్పగించామని అన్నారు. ఇంఫాల్ ఈస్ట్ జిల్లాలో పిఎల్ఎకు చెందిన నెగ్రమ్ సింగ్ జిత్ అనే మరో సభ్యుడిని అరెస్టు చేశారు. నెగ్రమ్‌సింగ్ జిత్ కొత్త సభ్యులను చేర్చుకునేందుకు వచ్చినప్పుడు అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మరొక ఆపరేషన్‌లో నిషేధిత పీపుల్స్ రివల్యూషనరీ పార్టీ ఆఫ్ కంగ్లీపాక్‌కు చెందిన సభ్యుడిని భద్రతా దళాలు అరెస్టుచేశాయి. నిందితుడిని మొయిరాంగ్‌థెమ్ బొబోయ్ సింగ్‌గా గుర్తించామని, వాహనాల తనిఖీల సమయంలో అతడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

### ప్రజాసేవ పట్ల ఆసక్తి ఉన్న యువతను

# ప్రభుత్వ సేవల్లోకి తీసుకురావాలి

యుపిఎస్‌సి శతవార్షికోత్సవాల్లో ప్రధాని మోదీ పిలుపు



**న్యూఢిల్లీ :** ప్రభుత్వ పదవి లేదా అధికారం పట్ల ఆకర్షితులవ్వకుండా, ప్రజా సేవ పట్ల ఆసక్తి ఉన్న యువతను ప్రభుత్వ సేవల్లోకి తీసుకురావాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. నియామక పరీక్ష కేవలం అభ్యర్థికి ఎంత జ్ఞానం ఉందో పరీక్షించడమే కాకుండా, ఆ యువకుడు సివిల్ సర్వీసెస్‌లోకి ఎందుకు రావాలనుకుంటున్నాడో కూడా పరిశీలించడం చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు. గురువారం జరిగిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) శతవార్షిక ఉత్సవాలనుద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగించారు. అభ్యర్థుల సంక్లిష్ట సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని, వారి దూరదృష్టిని పరీక్షించేలా మన పరీక్షలు ఉండాలని ప్రధాని మోదీ అన్నారు. నేడు ప్రశ్న కేవలం సేవలను అందించడం గురించి మాత్రమే కాదు, ప్రస్తుత తక్షణ సేవల వేగానికి అనుగుణంగా ప్రభుత్వ సేవలు అందుకోగలవా లేదా అనేదేనని ఆయన అన్నారు.

ఒకప్పుడు ప్రభుత్వాన్ని 'మైబాప్' (సర్వస్వం/తల్లిదండ్రుల వంటివారు)గా భావించే రోజులు ఉండేవని, కానీ ఇప్పుడు మనం 'నాగరిక్ దేవో భవ' (పౌరుడే దేవుడు) అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని ప్రధాన మంత్రి చెప్పారు. 'మా మంత్రం 'పౌరుడే దేవుడు' అంటే దేశ పౌరుడు మాకు దేవుడితో సమానం. మాకు పౌరుడికి సేవ చేయడమే అత్యంత ముఖ్యం' అని ఆయన అన్నారు. తన ప్రసంగాన్ని ప్రారంభించే ముందు, ఇజ్రాయెల్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానాన్ని కూల్చివేసేందుకు తన సహపైలట్ చేసిన ప్రయత్నాన్ని అడ్డుకున్న భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్యసాహసాలను మోదీ ప్రశంసించారు. ఆయన చేసిన ఈ సాహసోపేతమైన పని ప్రతి భారతీయుడి హృదయాన్ని గర్వంతో నింపుతుందని అన్నారు. కెప్టెన్ మచ్చర్ గొప్ప సహనం, వివేకం మరియు ధైర్యాన్ని ప్రదర్శించారని ఆయన పేర్కొన్నారు. ఎల్లప్పుడూ రెండు ముఖ్యమైన సూత్రాలను గుర్తుంచుకోవాలని, ఒకటి దేశమే ప్రథమం. రెండు పౌరుడే ప్రథమం' అని ఆయన చెప్పుకొచ్చారు. 21వ శతాబ్దపు భారతదేశం కొత్త పని సంస్కృతితో ముందుకు సాగుతోందని, దాని ప్రాథమిక సూత్రం 'ప్రజలకు అనుకూలమైన, చురుకైన, ఉత్తమ పాలన' అని ఆయన పేర్కొన్నారు. నేడు ఉద్యోగాల్లోకి వస్తున్న యువత అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషిస్తారని ప్రధాని మోదీ అన్నారు. యుపిఎస్‌సి 100 ఏళ్ల వేడుక అనేది ఒక గొప్ప వారసత్వానికి సంబంధించిందన్నారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది యువత కలిగి ఉండే ఆకాంక్షకు ఈ వేడుక ప్రతీక అని ప్రధాని అన్నారు. ఈ సంస్థపై ప్రతి భారతీయుడికి ఉన్న విశ్వాసానికి ఈ వేడుక ఒక నిదర్శనమని పేర్కొన్నారు. కాగా, మోదీ ఒక స్మారక నాణెం, ఒక తపాలా బిళ్ళ, '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్: షేపింగ్ ది పాలసీస్ ఆఫ్ యుపిఎస్‌సి అండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్స్ ఇన్ ఇండియా' (భారతదేశంలో యుపిఎస్‌సి, పబ్లిక్ సర్వీస్ కమిషన్ల విధానాలను తీర్చిదిద్దిన 100 కీలక తీర్పులు) అనే పుస్తకాన్ని విడుదల చేశారు. 1926లో యుపిఎస్‌సి స్థాపన జరిగినప్పటి నుండి 100 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అక్టోబర్ 1, 2025న ప్రారంభమైన ఏడాది పొడవునా సాగిన ఉత్సవాల ముగింపు ఘట్టమే గురువారం నాటి ఈ కార్యక్రమం.

# సెప్టెంబరులో రూ.2లక్షల కోట్లకు పైగా జిఎస్‌టి వసూళ్లు

కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడి

**న్యూఢిల్లీ :** దేశంలో వస్తువులు, సేవల పన్ను (జిఎస్‌టి) వసూళ్ల వివరాలను గురవారం కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసింది. సెప్టెంబరు మాసంలో రూ.2.03 లక్షల కోట్లకు పైగా జిఎస్‌టి వసూలు అయినట్లు ఆ శాఖ వెల్లడించింది. భారత ప్రభుత్వం ప్రకారం, దేశీయ వినియోగం, దిగుమతుల ద్వారా వచ్చే ఆదాయంలో బలమైన వృద్ధి దీనికి తోడ్పడ్డాయి. గత సంవత్సరం ఇదే ఏడాదితో పోలిస్తే 14.7 శాతం వృద్ధి నమోదైందని తెలియజేసింది. దేశీయ లావాదేవీల నుంచి పన్ను వసూళ్లు 10.01శాతం పెరిగి రూ.1.38లక్షల కోట్లకు చేరాయి. దిగుమతుల నుంచి స్థూల ఆదాయం 26శాతం పెరిగి రూ.65,525 కోట్లకు చేరినట్లు గణాంకాలు వెల్లడించాయి. అయితే, వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) రీఫండ్‌లు సెప్టెంబరులో రూ.27,001 కోట్లకు తగ్గాయి. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 3 శాతం తగ్గుదలగా ఉంది. రీఫండ్‌లను సర్దుబాటు చేసిన తర్వాత, సెప్టెంబరులో నికర జిఎస్‌టి వసూళ్లు 18.1శాతం పెరిగి, రూ.1.76లక్షల కోట్లకు పైగా చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిఎస్‌టి వసూళ్లు రూ. 2లక్షల కోట్లు దాటడం ఇది మూడవ నెల. దీనికిముందు ఏప్రిల్. జులై నెలల్లో జిఎస్‌టి రాబడులు వరుసగా సుమారు 2.43లక్షల కోట్లు. రూ.2.11లక్షల కోట్లకు పైగా రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగం (ఏప్రిల్–సెప్టెంబరు)లో స్థూల జిఎస్‌టి వసూళ్లు 11.6శాతం వృద్ధితో రూ.12.46లక్షల కోట్లకు పైగా చేరాయి. నికర వసూళ్లు 10.4 శాతం పెరిగిరూ.10.66లక్షల కోట్లకు పైగా చేరాయి.ప్రపంచ ఒత్తిడి ఉన్నప్పటికీ దేశీయ డిమాండ్ బాగానే కొనసాగుతోందని, దాదాపు 15శాతం వృద్ధితో స్థూల జిఎస్‌టి వసూళ్లు రూ.2లక్షల కోట్ల మార్కును చేరడం చూపిస్తోందని ఇవై ఇండియా ట్యాక్స్ పార్ట్‌నర్ సౌరభ్ అగర్వాల్ చెప్పారు. పన్ను వసూళ్లలో ఈ వృద్ధి విస్తృత ప్రాతిపదికన ఉన్నది.ఉత్తరప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లో ఒక్కో రాష్ట్రంలో 16 నుంచి 18 శాతం వరకు వృద్ధి నమోదు అయ్యింది. అస్సాం, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ రాష్ట్రాలు గణనీయమైన వృద్ధిని సాధించాయని, ఇది దేశ వ్యాప్తంగా సంపూర్ణ అభివృద్ధిని సూచిస్తోందని అగర్వాల్ తెలిపారు. గ్రాంట్ థోరంటన్ భారత భాగస్వామి, ట్యాక్స్ కాంట్రావర్సీ మేనేజ్‌మెంట్ లీడర్ మనోజ్ మిశ్రా మాట్లాడుతూ, దేశీయ జిఎస్‌టిలో సుమారు 10శాతం వృద్ధితో పోలిస్తే, సెప్టెంబరులో దిగుమతులపై ఆధారపడిన జిఎస్‌టిలో 25.9 శాతం భారీ వృద్ధి నమోదు కావడమనేది కరెన్సీ వస్తువుల ధరలు, దిగుమతుల గతిశీలత వంటి అంశాల కలయికను ప్రతిబింబిస్తుందని అన్నారు. రూపాయి విలువ పెరగడం వల్ల డాలర్లలో దిగుమతి విలువ పెరిగిందని, అదే సమయంలో, పెరిగిన ముడి, నిత్యావసర వస్తువుల ధరలు మొత్తం దిగుమతుల బిల్లును, తత్ఫలితంగా జిఎస్‌టి పరిధిని పెంచాయని మిశ్రా చెప్పారు. జిఎస్‌టి 2.0 కింద రేట్ల హేతుబద్ధీకరణను 2025 సెప్టెంబరు 3న ప్రకటించినప్పటికీ, అది 2025 సెప్టెంబరు 22నుంచే అమలులోకి వచ్చింది, దీని ఫలితంగా, రేట్ల తగ్గింపు, తత్ఫలితంగా ధరలలో కోతలు అమల్లోకి వచ్చేవరకూ వినియోగదారులు కొనుగోళ్లను వాయిదా వేశారు. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక మంత్రులతో కూడిన జిఎస్‌టి కౌన్సిల్ అక్టోబరు 7న సమావేశం కానుంది. డెలాయిట్ ఇండియా భాగస్వామి, పరోక్ష పన్నుల నాయకుడు మహేష్ జైసిన్ మాట్లాడుతూ, ఐటిసి పరిమితులను హేతుబద్ధీకరించడం, చట్టబద్ధమైన క్రెడిట్‌లు నిలిచిపోవడానికి దారితీసే విధానపరమైన సమస్యలను పరిష్కరించడం, ఇన్వర్టెడ్ డ్యూటీ నిర్మాణాలను పరిష్కరించడం, వ్యాపార నగదు ప్రవాహాలను మెరుగుపర్చడానికి రీఫండ్ ప్రక్రియలను సరళీకృతం చేయడం, ప్రక్రియల హేతుబద్ధీకరణలతో వ్యాపారాలు, చట్టబద్ధమైన క్రెడిట్‌లను సులభంగా క్లెయిమ్ చేసుకునేలా చేయడం వంటివి జిఎస్‌టి కౌన్సిల్ నుంచి పరిశ్రమ కోరుతున్న కీలక అంశాలని వివరించారు.

### నాలుగు బ్యాంక్ ఖాతాల నిర్వహణకు అనుమతి కోరిన...

# మమత టిఎంసి పిటిషన్‌ను కొట్టివేసిన 'సుప్రీం'

**న్యూఢిల్లీ :** ప్రభుత్వరంగ బ్యాంకులలో డెబిట్ స్థంభింపజేసిన నాలుగు బ్యాంక్ ఖాతాలను తిరిగి నిర్వహించేందుకు అనుమతి కోరుతూ మమతాబెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) వర్గం దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం సుప్రీంకోర్టు కొట్టివేసింది. పిటిషన్‌ను అనుమతించడానికి నిరాకరించిన కలకత్తా హైకోర్టు ఉత్తర్వులో జోక్యం చేసుకోడానికి తాము సుముఖంగాలేమని జస్టిస్‌లు ఎంఎం.సుంద్రేష్, పిబి.వరాలేతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం (ఇసి) గుర్తును స్థంభింపజేసిందని, అందువల్ల, ఆ మొత్తానికి ఎవరు అర్హులనే పెద్ద సమస్య విచారణలో ఉందని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. 'మేము, కేసు యోగ్యతల వివరాల్లోకి వెళ్లడం లేదు. ఆర్టికల్ 136 కింద మా అధికార పరిధిని వినియోగించడానికి మేం సుముఖంగా లేము. విచారణను వేగవంతం చేయాలని హైకోర్టును కోరుతున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. విచారణ సందర్భంగా, బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ వర్గం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ, ఒక పార్టీని వ్యతిరేకిస్తున్నందున, దాని రాజకీయ కార్యకలాపాలను అడ్డుకోవాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర పోలీసులు బ్యాంక్ ఖాతాలను స్థంభింపజేశారని వాదించారు. పార్టీ కార్యకలాపాలను, ఖర్చులను కొనసాగించడానికి నెలకు కనీసం రూ.12.15 కోట్లు అవసరమని సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ అన్నారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సింఘ్వీ అభ్యర్థనను వ్యతిరేకిస్తూ, ఒక వర్గం తామే నిజమైన తృణమూల్ కాంగ్రెస్ అని చెప్పుకుంటున్న వర్గపోరు ఉందని వాదించారు. టిఎంసిలోని మమతా బెనర్జీ వర్గానికి చెందిన ఒక పిఏ ఆ ఖాతాల్లో రూ.35 కోట్లు నగదు రూపంలో జమ చేశారని ఒక ఫిర్యాదు అందిందని ఆయన కోర్టుకు చెప్పారు. ఈ విషయమై దర్యాప్తు కొనసాగుతోందని తుషార్ మెహతా వివరించారు. మెహతా సమర్పించిన వాదనను సుప్రీంకోర్టు గమనించి, పిటిషన్‌ను కొట్టివేసింది. మమతా బెనర్జీ నేతృత్వంలోని టిఎంసి వర్గానికి , సుమారు రూ.804కోట్లు ఉన్న నాలుగు డెబిట్ స్థంభింపజేసిన బ్యాంక్ ఖాతాలను నిర్వహించుకోవడానికి అనుమతించే మధ్యంతర ఉత్తర్వులను జారీ చేయడానికి ఆగస్టు 27న కలకత్తా హైకోర్టు నిరాకరించింది.


SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS22B4834 | Thatla Sandeep | INDICA VISTA LS TDI BS3 DIESEL 5 SEATER | 2014 |
| 2 | TS03UC5160 | Page Raghavendra | TATA XENON PICK UP | 2019 |
| 3 | TS25G9244 | ASMA BEGUM | MARUTI DZIRE TOUR DIESEL-P | 2018 |
| 4 | TS28TA0277 | SHEKAR MARAPAKA | TATA SIGNA 4223.TK FBT | 2019 |
| 5 | TS10EA8787 | Dharamsothu Bhaskar | ETIOS D 4D GD DIESEL 5 SEATER | 2014 |
| 6 | TS08FV-4121 | SATHISH BODIKALA | ERTIGA VDI BS4 DIESEL 7 SEATER | 2018 |

**AUCTION DATE : 03-10-2026**

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

**SHRIRAM FINANCE LIMITED**

1st Floor, H No 6-159, Above DCC Bank. Reddy Colony, Jayashankar Bhupalpally. Cell : 9849981545, 9949340057

# హైజాక్ ఇరాన్ కుట్ర అని ఇప్పుడే చెప్పలేం

**• నెతన్యాహూ ప్రకటన • ఇండియన్ పైలట్ మచ్చర్‌కు సెల్యూట్**



**టెల్అవీవ్:**ఫ్లయ్ దుబాయ్ విమానాన్ని హైజాక్ చేసేందుకు ప్రయత్నం చేయడం వెనుక ఇరాన్ హస్తం ఉందని,ఈ కుట్రకు ఇరాన్ బాధ్యత వహించాలని అప్పుడే చెప్పలేమని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమన్ నెతన్యాహూ చెప్పారు.ఈ విధంగా విమానాన్ని హైజాక్ చేసేందుకు ప్రయత్నం చేయడం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో ఉన్న అబ్రహాం ఎకార్డ్‌పై దాడి చేయడమేనని విమర్శించారు. దుబాయ్ నుండి టెల్ అవీవ్ వెళుతున్న ఇజ్రాయెల్ విమానంలో ఒమన్ దేశానికి చెందిన కో–పైలట్ తోటి పైలట్‌ను కత్తితో పొడిచి విమానాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకుని హైజాక్ చేసే ప్రయత్నం చేసిన సమయంలో భారత పైలట్ స్మిత్ మచ్చర్ పది కత్తిపోట్లకు గురైనప్పటికీ సాహసంతో విమానంలో ఉన్న 180 మంది ప్రయాణికునలు కాపాడారు. విమానం కాక్‌పిట్ లోపల ఏం జరుగుతోందో తెలియని ప్రయాణికులకు సమాచారం తెలియడంకోసం పది కత్తిపోట్లు,నెత్తిమీద రక్తపు దెబ్బలు ఉన్నప్పటికీ చాకచక్యంగా బాధను ఓర్చుకుంటూ లోపలి నుండి కాక్‌పిట్ డోర్ తెరిచారు. దాంతో ప్రయాణికులు పరిస్థితి గమనించి స్పందించారు. అందులో ఉన్న డెంటిస్ట్ భారత పైలట్ మచ్చర్‌కు ప్రాథమిక చికిత్స చేశారు. దాడికి యత్నించిన పైలట్‌ను బంధించారు. ఈ ఘటన సమయంలో 34000 అడుగుల ఎత్తునుండి 17,500 అడుగుల ఎత్తికు దిగిపోయిన విమానాన్ని పైలట్ సురక్షితంగా దారిమళ్ళించి సౌదీ అరేబియా విమానాశ్రయంలో దించారని, విమానంలో ఉన్న 180 మంది ప్రయాణికులు,సిబ్బంది ప్రాణాలను మచ్చర్ కాపాడారని నెతన్యాహూ కొనియాడారు. ఆయనను "ట్రూ హీరో" అని పేర్కొంటూ శాల్యూట్ చేశారు. హైజాక్‌కు ప్రయత్నం చేసిన పైలట్‌ను అరెస్టు చేసి తిరిగి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు తరలించే అవకాశం ఉందని చెప్పారు. విమానం స్వాధీనం చేసుకుని హైజాక్ చేసే ప్రయత్నంలో ఇరాన్ ప్రమేయం ఉందా? అని ప్రశ్నించగా, ఆ విషయాన్ని ఇప్పుడే చెప్పడం తొందరపాటు అవుతుందని నెతన్యాహూ ఫాక్స్‌న్యూస్‌కు సమాధానం చెప్పారు. కత్తిపోట్లకు గురైనప్పటికీ భారత పైలట్ మచ్చర్ ఎదురు తిరిగి పోరాడాడు, కాక్‌పిట్ తలుపులు తెరచి లోపల ప్రయాణికులకు చెప్పగలిగాడు, పైలట్ ను ప్రయాణికులు బంధించగలిగేట్లు చేయగలిగాడు, పెద్ద ప్రమాదాన్ని నివారించాడు, అంద రి ప్రాణాలూ కాపాడాడు" అని నెతన్యాహూ చెప్పారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని చెప్పారు.

**ఇజ్రాయెల్ ఎన్నికలవేళ హైజాక్ యత్నం**

ఇజ్రాయెల్‌లో నెతన్యాహూకు వ్యతిరేకత పెరిగిన తరుణంలో ఈనెల 27న పార్లమెంటు ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ హైజాక్ ప్రయత్నం ఘటన చోటుచేసుకుంది.ఐతే ఈ ఘటనపై నెతన్యాహూ ప్రకటనలను ఇజ్రాయెల్ ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. పేరు తెలియని శత్రువులు దాడికి సిద్ధంగా ఉన్నారంటూ ప్రధానమంత్రి బెదిరించి భయాందోళన సృష్టిస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శించాయి.9/11 ఘటనలో రెండు విమానాలను హైజాక్ చేసి 3000 మందిని హతమార్చిన పద్ధతిలోనే పైలట్ ఏదైనా చేద్దామనుకున్నాడా? అనే విషయం ఇంకా దర్యాప్తులో వెల్లడి కావాల్సి ఉంది.ఇజ్రాయెల్–గాజా మధ్య శాంతి ఒప్పందం కుదిరిన తర్వాత కూడా ఇజ్రాయెలీ సైన్యాలు గాజాలో మారణహోమం కొనసాగిస్తున్నాయి. ఈ విషయంలో ఇరాన్ తీవ్ర ఆగ్రహంతో ఉంది. అనేక దేశాలు ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో నెతన్యాహూ ప్రసంగించినప్పుడు కూడా చాలా దేశాల నాయకులు ఆయన ప్రసంగాన్ని బహిష్కరించారు.అనేక ప్రపంచదేశాలు పాలస్తీనాకే మద్దతుగా ఉన్నాయి. ఈనెల 27వ తేదీ నెతన్యాహూకు అగ్నిపరీక్ష వంటి పార్లమెంటు ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ సంఘటన జరిగింది. కాక్‌పిట్‌లో దాడికి యత్నించిన పైలట్‌ను ఎలా ప్రయాణికులు బంధించారో,అతడి గొంతు ఎలా పిసికి నిర్వీర్యుణ్ణిచేశారో,ఏ విధంగా విమానం ల్యాండ్ అయిందో ఆ భయంకర అనుభవాలను తోటి ప్రయాణికుడు యానివ్ హయూన్ టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్‌కు వివరించారు.సౌదీ అరేబియా నుండి సైనిక విమానంలో ప్రయాణికులు తిరిగి ఇజ్రాయెల్ చేరుకున్నారు.

ఈ ఘర్షణకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియకముందు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ,ఆ దేశ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ అత్యవసర సమావేశం నిర్వహించారు. దేశ రక్షణకు సంబంధించి తీసుకోవాల్సిన తక్షణ చర్యల గురించి సంభాషించుకున్నారు.విమానం సౌదీ అరేబియాలో దిగిన తర్వాత అందులో ఉన్న ఒక ప్రయాణికుడు మీడియాతో మాట్లాడుతూ,ఘర్షణ సమయంలో కత్తిపోట్లకు గురైన మచ్చర్ తమ సహాయం కోరారని, దాంతో హైజాకర్‌గా అనుమానిస్తున్న పైలట్‌ను పట్టుకుని గట్టిగా బంధించారని చెప్పారు.పైలట్ విమానాన్ని సురక్షితంగా కిందకు దించారు.బుధవారం తెల్లవారుజామున ఫ్లయ్ దుబాయ్ విమానం తీసుకున్న రెండు గంటల సమయం తర్వాత కంట్రోల్ కేంద్రానికి ప్రమాదకర సంకేతాలు పంపించిందని ట్రాకింగ్ వెబ్‌సైట్ రాడార్ పేర్కొంది. ఆ తర్వాత ఈ ప్రమాదకర సంకేతాలు హైజాకింగ్ కోడ్‌లోకి మారిపోయాయి. కానీ మళ్ళీ ఈ సంకేతాలు సాధారణ ప్రయాణ సంకేతాలుగా మార్పు చెందాయి.ఈ విమానం హైజాకింగ్ కోసం ఎలాంటి ఘర్షణ జరగలేదని,ఇప్పుడు సురక్షింగా ల్యాండ్ అయ్యిందని,ప్రయాణికులు క్షేమంగా ఉన్నారని ఇజ్రాయెల్ ఉన్నతాధికారులు ప్రకటించారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1.20 గంటలకు విమానంలో హింసాత్మక ఘటన చోటుచేసుకుంది.

## లక్ష డాలర్ల ట్రంప్ వీసా ఫీజును తిరస్కరించిన కాలిఫోర్నియా కోర్టు

**శాక్రమెంటో:**హెచ్1బి వీసాలు కొత్తగా జారీ చేయడానికి లక్ష డాలర్లు ఫీజు చెల్లించాలని ట్రంప్ తీసుకువచ్చిన ఉత్తర్వులను కాలిఫోర్నియాలోని న్యాయస్థానం కూడా తిరస్కరించింది. దీంతో ఇప్పటివరకూ రెండు న్యాయస్థానాలు ట్రంప్ జారీ చేసిన ఈ ఉత్తర్వులను తిరస్కరించినట్లయింది. ప్రభుత్వ వలస విధాన అధికారులు ముందస్తు నోటీసులు ఇవ్వలేదని, ప్రజాభిప్రాయ సేకరణ చేయలేదని, ఎలాంటి చట్టపరమైన నియమ నిబంధనలు పాటించకుండానే ఈ ఉత్తర్వులను అమలు చేయాలని ప్రభుత్వం ప్రయత్నం చేసిందని న్యాయమూర్తి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈ ఉత్తర్వు అమలు కాకుండా స్టే మంజూరు చేశారు. అమెరికాలోకి అత్యున్నతస్థాయి విదేశీ నిపుణులను మాత్రమే అనుమతించాలని,తక్కువస్థాయి ఉద్యోగులు కూడా హెచ్–1 బి వీసా పేరుతో అమెరికాలోకి వచ్చి తిష్టవేసి నిజమైన అమెరికా వాసుల ఉద్యోగాలకు ఎసరుపెడుతున్నారని,ఈ భారీ ఫీజు వసూలు ద్వారా ఈ వలసలను అడ్డుకుంటామని ట్రంప్ ప్రకటించారు. ఆ మేరకు అమెరికాలో ఉద్యోగాలు చేసేందుకు కొత్తగా దరఖాస్తులు పెట్టుకున్న విదేశీయులకు హెచ్–1 బి వీసా మంజూరు చెయ్యాలంటే 1,00,000 డాలర్లు చెల్లించాలనే ఉత్తర్వు 2025 సెప్టెంబరులో జారీ చేశారు. కానీ ఈ ఉత్తర్వులకు అమెరికా వ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వచ్చింది.ఈ ఉత్తర్వు రద్దు కోరుతూ కార్మికసంఘాలు,అమెరికా వ్యాపార సంస్థలు అనేక న్యాయస్థానాలలో పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ కేసులు ఇంకా కొనసాగుతున్నాయి. అంతకుముందు ఈ ఏడాది జూన్‌లో కూడా బోస్టన్ న్యాయస్థానం కూడా ఈ ఫీజు వసూలును చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించింది. ఉత్తర్వు అమలును నిలిపివేసింది.ఈ వీసాలపై భారీ ఫీజు వసూళ్ళ వల్ల ఎక్కువగా నష్టపోయేది భారతీయులే. అందువల్లకోర్టు నిర్ణయం వల్ల భారతీయ దరఖాస్తుదారులకు పెద్ద ఊరట లభించింది.విదేశీ ఐటి నిపుణులను విధించడంవల్ల పెద్ద పెద్ద అమెరికన్ ఐటి కంపెనీలకు కూడా ఊరట కలిగింది.

## మరణశిక్ష జయించిన టెన్నెసీ మహిళ

**నాష్‌విల్:**అమెరికా టెన్నెసీరాష్ట్రంలో 200 సంవత్సరాల తర్వాత మొదటిసారి ఒక మహిళకు మరణశిక్ష అమలు చేసినప్పటికీ ఆమె మృత్యుంజయురాలుగా మారింది. విషపు ఇంజక్షన్ ఇచ్చి ఆమెను చట్టబద్ధంగా చంపేందుకు ప్రయత్నించారు. రెండుసార్లు ఆమెకు విషపు ఇంజక్షన్ ఇచ్చినాగానీ ఆమె మరణించలేదు. మరణశిక్ష అమలు చేసేందుకు విషపు ఇంజెక్షన్ ఇచ్చిన తర్వాత ఆమె స్పృహ కోల్పోయారు తప్ప మరణించలేదు. పైగా ఆమె గురకపెడుతున్నారు. గుండె ఆగిపోలేదు, గుండె కొట్టుకుంటూనే ఉంది.దీంతో మరణశిక్ష నిలిపివేయాలని ఆమె తరపు న్యాయవాదులు అత్యవసర పిటిషన్ న్యాయస్థాబునంలో దాఖలు చేశారు. ఆమెను ఆసుపత్రికి తరలించారు. పెంటోబార్బిటల్ అనే రసాయనం ఉన్న రెండు ఇంజెక్షన్లు ఇచ్చిన తర్వాత కూడా ఆమె మరణించలేదు.

## మణికంఠ రెడ్డి, లక్ష్మణ్ ఎన్నిక (మొదటి పేజీ తరువాయి)




పుట్ట లక్ష్మణ్ తెలిపారు. గురువారం హనుమకొండలోని బాలసముద్రంలో ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విలేఖరుల స మావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడిగా కసిరెడ్డి మణికంఠ రెడ్డి(కరీంనగర్), రాష్ట్ర కార్యదర్శిగా పుట్ట లక్ష్మణ్(మేడ్చల్)లు మరోసారి ఎన్నికైనట్లు అదే విధంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఇటిక్యాల రామకృష్ణ (ఖమ్మం), రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా రెహమాన్ (నల్గొండ), రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బానోత్ రఘురాం నాయక్ (నిజామాబాద్), లెనిన్ (ఉస్మానియా యూనివర్సిటీ), ముదిగొండ మురళికృష్ణ (నల్గొండ), బలుముల ప్రేమ్ కుమార్(నాగర్ కర్నూల్), రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా భాషబోయిన సంతోష్ (హనుమకొండ), నెల్లి సత్య (హైదరాబాద్), సా మిడి వంశీ వర్ధన్ రెడ్డి(రంగారెడ్డి), జేరిపోతుల జనార్ధన్(సిద్దిపేట)ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ తెలిపారు.ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి,పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయని, ఈ వార్షికోత్సవాల్లో విద్యారంగ సమస్యలపై చర్చించి , భవిష్యత్ కార్యచరణ రూపొందించుకున్నామని, దేశంలో రాష్ట్రంలో పాలకులు విద్యారంగాన్ని విస్మరిస్తున్నారని, బిజెపి ప్రభుత్వం విద్యా ప్రైవేటీకరణ, కాషాయీకరణకు కుట్ర చేస్తున్నదని, తెలంగాణ వి భజన హామీల ప్రకారం రాష్టానికి కేటాయించాల్సిన వి ద్యాసంస్థలను కేటాయించకుండా తెలంగాణ పట్ల చిన్న చూపు చూస్తున్నదని అన్నారు. ఈ విలేఖరుల సమావేశం లో రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు ఇటిక్యాల రామకృష్ణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెహమాన్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ రఘురాం నాయక్, బాషోబోయిన సంతోష్,లెనిన్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు ప్రణీత్ గౌడ్, వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదెళ్ల శరత్, నాయకులు భాను, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## అఫ్ఘానిస్థాన్‌పై పాక్ దాడులు:22 మంది మృతి

**కాబూల్:**అఫ్ఘానిస్థాన్‌పై పాకిస్థాన్ మరోసారి గగనతల దాడులు చేసింది. ఈసారి దాడుల్లో 22 మ ంది మరణించారు. అఫ్ఘానిస్థాన్ సరిహద్దుల్లో సా యుధ గ్రూపులు ఉపయోగించే రహస్యస్థావరా లు,శిబిరాలను లక్ష్యంగా చేసుకుని రెండు ప్రా ంతాలలో దాడులు చేసినట్లు గురువారం పాకిస్థా న్ ప్రభుత్వం ప్రకటించింది. కునార్,హెల్మండ్ రా ష్ట్రాలలో నివాసిత ప్రాంతాలపై చేసిన దాడుల్లో తొ మ్మిదిమంది మహిళలు,పిల్లలు మరణించారని అఫ్గానిస్థాన్ ప్రభుత్వం ప్రకటించిన తర్వాత పాకిస్థా న్ ప్రభుత్వ సమాచార మంత్రిత్వ శాఖ పైవిధంగా స్పందించింది.అఫ్గానిస్థాన్ ప్రతినిధి జబిహుల్లా ముజిహిద్ మాట్లాడుతూ, బుధవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ వైమానిక దాడులు జరిగాయని చెప్పారు.

## దక్షిణాఫ్రికాలో నిరసన ప్రదర్శనలు

**• స్త్రీల హత్యలపై పురుషులే అప్రమత్తంగా ఉండాలి: రామఫోసా పిలుపు**




**జోహన్నెస్‌బర్గ్:**దక్షిణాఫ్రికాలో జరుగుతున్న వరుస మహిళల హత్యలపై తీవ్ర నిరసన పెల్లుబికింది. అనేక నగరాలలో గురువారం దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. ప్రజలు వీధుల్లోకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగానినాదాలు చేశారు. దేశంలో శాంతి భద్రతలు కొరవడ్డాయని, హింస అనూహ్యంగా పెరిగిపోయిందని, మహిళలు బలైపోతున్నారని వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ముఖ్యంగా సెప్టెంబరు చివరివారంలో డర్బన్,జోహన్నెస్‌బర్గ్,కేప్‌టౌన్ సహా అనేక నగరాలలో మహిళలు అనేక మంది హత్యలకు గురయ్యారు.దక్షిణాఫ్రికాలో సాధారణంగా నేరాలు చాలా ఎక్కువగా జరుగుతూ ఉంటాయి. ఇటీవల హింసాత్మక చర్యలు పేట్రేగిపోయాయి. శాంతి భద్రతలు అదుపు చేయడంలో,రౌడీ గ్యాంగ్‌స్టర్‌లను అడ్డుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది."మార్చ్ అండ్ మార్చ్" వంటి అనేక సంస్థలు ఈ నిరసన ప్రదర్శనలకు నాయకత్వం వహించాయి. ఇదిలా ఉండగా,దేశంలో మహిళలపై నేరాలు అడ్డుకోవడానికి పురుషులే బాధ్యత వహించాలని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రామఫోసా పిలుపు ఇచ్చారు. జాతిని ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ,మహిళల సమస్యల పరిష్కారానికి తగినంత కృషి జరగలేదని ఆయన అంగీకరించారు. మహిళలపై నేరాల అదుపులో పురుషులే అగ్రభాగాన నిలబడాలని,గళమెత్తి నినదించాలని పిలుపు ఇచ్చారు. దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులనుపోలీసుల సమీక్షిస్తారని చెప్పా రు.కేసుల భారాన్ని తగ్గించడానికి ఒక ప్ర ణాళిక రూపొందిస్తామని హామీ ఇచ్చారు.

## రాజ్యాంగ విరుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

అవుతుందా లేదా, ఆ చట్టాన్ని కొట్టివేయాలా లేక సమర్థించాలా అనేది సుప్రీంకోర్టు నిర్ణయిస్తుంది. నా న్యాయవాద వృత్తిలో ఇలాంటి దాని గురించి నేనెప్పుడూ వినలేదు' అని స్వతంత్ర రాజ్యసభ ఎంపి అన్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని, అధికార విభజన సూత్రానికి వ్యతిరేకమని అని సిబల్ విలేకరుల సమావేశంలో అన్నారు. చట్టాలను ఆమోదించడం పార్లమెంటు హక్కు అని, ఒక చట్టం సరైనదా కాదా అని నిర్ణయించడం న్యాయస్థానం బాధ్యత అని ఆయన తెలిపారు. ఈనెల 6న సుప్రీంకోర్టుకు స్థానిక అధ్యయన పర్యటన కార్యక్రమం ఉంటుందని పి.పి. చౌదరి నేతృత్వంలోని కమిటీకి సంబంధించిన ఒక పత్రం పేర్కొంటోందని సిబల్ చెప్పారు.అంటే, తాము ఈ చట్టాన్ని ఆమోదించబోతున్నామని సుప్రీంకోర్టుకు చెబుతారు, ఆ చట్టం సరైనదా కాదా అని సుప్రీంకోర్టు తర్వాత నిర్ణయిస్తుంది అని ఆయన అన్నారు. 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అంశంపై భారత ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులతో అనధికారిక చర్చగా దీనిని షెడ్యూల్ చేశారని సిబల్ తెలిపారు.ఈ కార్యక్రమం గురించి విన్నప్పుడు తాను చాలా ఆందోళనకు గురయ్యానన్నారు. 'పార్లమెంటు ఒక చట్టాన్ని చేసినప్పుడు, ఆ చట్టంపై చర్చ జరుగుతుంది, అలాగే ప్రచారంలో ఉన్న బిల్లుపై కూడా చర్చ జరుగుతుంది. ఈ చర్చ సందర్భంగా, వార్తాపత్రికలు కూడా వివిధ వ్యక్తుల అభిప్రాయాలను ప్రచురిస్తాయి. కొందరు చట్టానికి అనుకూలంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తే, మరికొందరు వ్యతిరేకిస్తారు. సంపాదకీయాలు కూడా ప్రచురితమవుతాయి. దేశ భవిష్యత్తుపై ప్రభావం చూపగల ముఖ్యమైన చట్టం అయితే, సహజంగానే దానిపై ఎక్కువ చర్చ జరుగుతుంది' అని ఆయన అన్నారు.

**సుప్రీంకోర్టు సందర్శన వాయిదా వేసుకున్న కమిటీ**

అధికార విభజన అంశంపై ప్రతిపక్ష నాయకులు వ్యక్తం చేసిన ఆందోళనల నేపథ్యంలో, 'ఒకే దేశం –ఒకే ఎన్నిక' (ఒఎన్ఒఇ) బిల్లుల గురించి న్యాయమూర్తులతో చర్చించేందుకు అక్టోబరు 6న సుప్రీంకోర్టును సందర్శించాలన్న తన ప్రతిపాదనను పార్లమెంటరీ కమిటీ వాయిదా వేసిందని, గురువారం ఆ కమిటీ చైర్మన్ పిపి.చౌదరి తెలిపారు. కమిటీ సభ్యుల తేదీలు సరిపోలకపోవడంతో పర్యటన వాయిదా పడిందని చౌదరి 'పిటిఐ'కి చెప్పారు. 'నాకు చూసుకోవాల్సిన ఇతర బాధ్యతలు కూడా ఉన్నాయి' అని ఆయన తెలిపారు.ప్రతిపాదిత ప్రకటనపై ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయని, జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) లోని కనీసం ఒక సభ్యుడు దానిని రద్దు చేయాలని కోరుతూ చౌదరికి ఒక లేఖ రాసినట్లు తెలిసింది. ప్రతిపాదిత చట్టం రాజ్యాంగబద్ధత యోగ్యతపై భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) లేదా ఇతర సిట్టింగ్ న్యాయమూర్తులతో సంప్రదింపులు జరపడం వలన, అధికారాల విభజన, పార్లమెంట్, న్యాయవ్యవస్థల సంస్థాగత స్వాతంత్ర్యంపై ఆందోళనలు తలెత్తవచ్చని ఆ ఎంపీ వాదించినట్లు సమాచారం.చట్టాలను పరిశీలించి, రూపొందించడంలో శాసనసభ పాత్ర, వాటి చెల్లుబాటును నిర్ధారించడంలో న్యాయవ్యవస్థ పాత్రకు భిన్నంగా ఉండాలని, అలాగే, తదనంతరం న్యాయసమీక్ష కోసం సుప్రీం ముందుకు రాగల శాసనాలపై ప్రస్తుత న్యాయమూర్తుల అభిప్రాయాలు కోరడం వలన నివారించగల సంస్థాగత అతివ్యాప్తి ఏర్పడగలదని కూడా ఆ సభ్యుడు సూచించినట్లు తెలిసింది.

## సిజెపి ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

దీప్కే ఈ మేరకు వ్యాఖ్యానించారు. 'సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి. ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి. ఆయన పదవి నుంచి వైదొలిగే వరకు నిరసనలు కొనసాగుతాయి. గోవా, కర్ణాటక, బెంగాల్, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లో నిరసనలు చేపడతాం. వీటితో పాటు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కూడా నిరసన చేపడతాం. అలాగే సిఇసి నియామకం పారదర్శకంగా జరగాలి. ఇందులో పౌర సమాజం భాగస్వామ్యం ఉండాలి' అని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు.

## డిక్లరేషన్ ఇవ్వాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల ప్రధాన అధికారి వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఫారమ్6 కు డిక్లరేషన్ అనేది ఎస్ఐఆర్ పూర్తయిన రాష్ట్రాలకు మాత్రమే మినహాయింపు ఇచ్చారని, తెలంగాణలో ఎస్ఐఆర్ ఇంకా కొనసాగుతున్నందునా ఫారమ్6 కు డిక్లరేషన్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. నోటీసులు అందిన వారిలో ఎవరైనా వలస వెళ్లి ఉంటే అలాంటి వారిని పిలవాల్సిన అవసరం లేదని ఈఆర్ఓ ఆన్‌లైన్‌లోనే వారిని సంప్రదించి ప్రక్రియను పూర్తి చేస్తారన్నారు. ఒక చోట కూర్చుని ఓటర్లను పిలిపించుకోవడం కుదరదని ఓటర్ల ఇళ్ల వద్దకే వెళ్లి వివరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు బిఎల్ఓలకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామన్నారు. నోటీసులు అందిన కుటుంబ సభ్యులు అందరూ ఉండాల్సిన పని లేదని ఒక్కరే మిగిలిన కుటుంబ సభ్యుల వివరాలు ఇస్తే సరిపోతుందన్నారు. నోటీసులు జారీ అయిన ప్రతి ఓటరు ఇంటికి సంబంధిత బూత్ స్థాయి అధికారి (బిఎల్ఓ) స్వయంగా వెళ్లి అవసరమైన పత్రాలను సేకరించి, వాటిని ఈసిఐ నెట్‌లో అప్లోడ్ చేస్తారన్నారు. అనంతరం ఆ పత్రాల ఆధారంగా ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ) లేదా సహాయ ఎన్నికల నమోదు అధికారి (ఏఈఆర్ఓ) నిర్ణయం తీసుకుంటారన్నారు. ఇందుకోసం ఓటర్లు ఈఆర్ఓ లేదా ఏఈఆర్ఓ కార్యాలయాలకు విచారణకు రావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఈఆర్ఓ లేదా ఏఈఆర్ఓ నిర్ణయం మేరకు విచారణ నిర్వహిస్తారని, వీలైనంత వరకు ఆ విచారణను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించేలా సాఫ్ట్‌వేర్‌ను నవీకరించినట్లు తెలిపారు. అవసరమైతే ఓటరు తరపున కుటుంబంలోని ఏదైనా వయోజన సభ్యుడు విచారణకు హాజరయ్యే అవకాశం కల్పించినట్లు చెప్పారు. అవసరమైన పత్రాలు లేని నిజమైన, అమాయక ఓటర్ల విషయంలో ఈఆర్ఓ స్థానికంగా విచారణ జరిపి తగిన నిర్ణయం తీసుకుంటారన్నారు. రాత్రి ఆశ్రయ కేంద్రాల్లో నివసించే వారు, కార్మికులు, నిరుపేదలు, నిరాశ్రయుల వంటి వర్గాలకు సౌలభ్యం కల్పించేందుకు అవసరమైన సంఖ్యలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఫారం9, 10, 11, 11ఏ, 11బిలకు సంబంధించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల జాబితాలను ప్రతి పనిదినం నోటీసు బోర్డుపై ప్రదర్శిస్తామని తెలిపారు. ప్రజలు వాటిని పరిశీలించి, అవసరమైతే అభ్యంతరాలు తెలియజేసేందుకు వీలుగా అన్ని క్లెయిమ్‌లు, అభ్యంతరాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉంచనున్నట్లు సిఈఓ సుదర్శన్ రెడ్డి చెప్పారు.

**92 లక్షల మందికి నోటీసులు..**

ఎస్ఐఆర్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 92 లక్షల మందికి నోటీసులు ఇస్తే ఇప్పటి వరకు 65 లక్షల మంది ఓటర్లు నోటీసులకు సమాధానం ఇచ్చినట్లు సిఈఓ సుదర్శన్ రెడ్డి తెలిపారు. 54 లక్షల మందిని తుది ఓటరు జాబితాలోకి తీసుకువచ్చామన్నారు. నవబంర్ 5వ తేదీ వరకు ఈ ప్రక్రియ ఉంటుందని, ఆలోపు మిగతా ఓటర్లను కూడా తుది ఓటరు జాబితాలోకి తీసుకువచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అయితే ఇప్పటి వరకు హియరింగ్ అనే ప్రక్రియ ఉండేదని ఇకపై దాని స్థానంలో డాక్యుమెంట్ కలెక్ట్ చేసుకోవడమే ఉంటుందన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చామని, నోటీసులు అందుకున్న వారిలో 40 శాతం మందిని తుది ఓటరు జాబితాలోకి తీసుకువచ్చామన్నారు. అర్హత లేని ఓటర్లుగా గుర్తించిన సందర్భాల్లో మాత్రమే ఈఆర్ఓ లేదా ఏఈఆర్ఓ కారణాలతో కూడిన (స్పీకింగ్) ఉత్తర్వులు జారీ చేస్తారని చెప్పారు. పెద్ద సంఖ్యలో అందిన ఫారం7 దరఖాస్తుల పరిశీలనలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. నోటీసుల పరిష్కారానికి సంబంధించిన రోజువారీ వివరాలను ఈఆర్ఓ కార్యాలయాల నోటీసు బోర్డులపై ప్రదర్శించడంతో పాటు రాజకీయ పార్టీలకు, మీడియాకు కూడా అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు.

## నోటిఫికేషన్ ఇవ్వం

(మొదటి పేజీ తరువాయి)

వెలువడకముందే దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడింది. ఈ కారణంగా ఉప ఎ న్నిక నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసే అవకా శం ఉందని, అలా జరగకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ విజయారెడ్డి అత్యవసరంగా లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ వి. రామకృష్ణారెడ్డిలతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం విచారణ చేపట్టింది. ఎన్నికల పిటిషన్ పెండింగ్‌లో ఉన్నప్పుడు దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడినంత మాత్రాన ఖైరతాబాద్ నియోజకవర్గాన్ని ఖాళీ అయిన స్థానంగా పరిగణించరాదని పిటిషనర్ తరఫున వాదనలు వినిపించారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్లు 84, 98(సి), 101(బి) ప్రకారం ఎన్నికల పిటిషన్‌పై ఫలితం వెలువడే వరకు ఉప ఎన్నిక ప్రకటించే అధికారం కేంద్ర ఎన్నికల సంఘానికి లేదని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫున స్పందించిన న్యాయవాది.. దానం నాగేందర్ ఎన్నికకు సంబంధించిన పిటిషన్‌పై హైకోర్టు నిర్ణయం వెలువడే వరకు ఉప ఎన్నిక నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేయబోమని చెప్పారు. ఈసీ ఇచ్చిన ఈ వివరణను అఫిడవిట్ రూపంలో సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తదుపరి విచారణను అక్టోబర్ 6వ తేదీకి వాయిదా వేసింది

## ఆదేశించారు?

(మొదటి పేజీ తరువాయి)

ఫారం –6 మార్పులను ప్రవేశపెట్టిందని, ఈ చర్య ప్రధాని–హోంమంత్రి (నరేంద్ర మోదీ–అమిత్ షా) ద్వయం నడిపించిందని స్పష్టంగా అర్థమవుతోందన్నారు. ఎన్నికల వ్యవస్థను తమ గుప్పిట్లో పెట్టుకోవడాన్ని వ్యతిరేకిస్తున్న గళాలు మరింత బలపడుతున్నాయని, ఏ రూపంలోనైనా 'ఓటు దొంగతనాన్ని' పౌరులు ఇకపై సహించరన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి 'ఇండియా కూటమి' కట్టుబడి ఉందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ అన్నారు. 'ఒక ప్రముఖ జాతీయ దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో, మాజీ సిఇసి ఓ.పి. రావత్, సర్‌ను, ఇసిఐ చేసిన ఉల్లంఘనలను ప్రశ్నించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంత మంది అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోవడం ఇదే మొదటిసారి. సర్ వల్ల ఇప్పటికే దాదాపు 14 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయారు' అని గురువారం రమేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. 'భారత ఎన్నికల సంఘం ఒకప్పుడు 'బంగారు ప్రమాణం'గా ఉండేది, కానీ నేడు దాని విశ్వసనీయత దెబ్బతింది. ఆయన (రావత్) అభిప్రాయం ప్రకారం, సిఇసి తీసుకున్న చట్టవిరుద్ధమైన నిర్ణయాలను ఆపడానికి ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఇంకా ఎక్కువ కృషి చేసి ఉండాల్సింది' అని ఆ కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ప్రతిపక్ష ఇండియా కూటమి అన్ని జిల్లాల్లో సంయుక్త ప్రజాస్వామ్య పరిరక్షణ పాదయాత్రలు, ఐదు ప్రధాన ర్యాలీలను ప్రకటించి, భవిష్యత్ ఎన్నికలను బ్యాలెట్ పేపర్‌తో నిర్వహించాలని డిమాండ్ మరుసటి రోజు కాంగ్రెస్ నాయకులు ఈ వ్యాఖ్యలు చేశారు.

## సర్కార్‌ను ప్రశ్నించలేదు

(మొదటి పేజీ తరువాయి)

తొలిసారిగా 2012లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తామే లేవనెత్తామని ఎస్. బాబు పేర్కొన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. ఈ సందర్భంగా 'ప్రజాపక్షం'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలపై ఆయన మాట్లాడారు.

**ఆర్‌టిసి విలీన ప్రక్రియపై మీ కార్యాచరణ?**

ఆర్‌టిసిని ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో విలీనం చేయాలన్నది ఉద్యోగుల చిరకాల డిమాండ్. 2012లో తొలిసారిగా అప్పటి రవాణా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణతో సంప్రదింపులు జరిపి విలీన ప్రక్రియకు సంబంధించి చర్యలు ప్రారంభించేలా చేశాం. అయితే తదనంతర పరిణామాలు, ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరితో ఈ అంశం ఆలస్యమైంది. ఇటీవల ఎంప్లాయిస్ యూనియన్ వివిధ యూనియన్‌లతో కలిసి జెఎసిగా ఏర్పడి సమ్మెకు వెళ్లాం. సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి గుర్తింపు సంఘం ఎన్నికల అనంతరం విలీన ప్రక్రియ చేపడతామని హామీ ఇచ్చింది. ఇప్పుడు విలీన ప్రక్రియను స్పష్టమైన కార్యాచరణతో ముందుకు తీసుకెళ్లాలి. ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానమైన భద్రత, ప్రయోజనాలు కల్పించే వరకు మా యూనియన్ పోరాటం కొనసాగుతుంది.

**రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల పరిష్కారానికి ఏం చేస్తారు?**

ఆర్‌టిసి కోసం జీవితాంతం పనిచేసిన రిటైర్డ్ ఉద్యోగులు తమకు రావాల్సిన బకాయిల కోసం ఎదురుచూడటం బాధాకరం. పెండింగ్ బకాయిలపై పూర్తి వివరాలు సేకరించి, వాటి పరిష్కారానికి ప్రభుత్వం, యాజమాన్యంతో ప్రత్యేకంగా చర్చిస్తాం. అవసరమైతే ఉద్యమ కార్యాచరణ చేపడతాం.

**ఆర్‌టిసి ఆస్తుల పరిరక్షణపై మీ వైఖరి ఏమిటి?**

ఆర్‌టిసి ఆస్తులు సంస్థకు కీలకమైన వనరులు. వాటిని ఇతర అవసరాలకు కేటాయించే విషయంలో సంస్థ ప్రయోజనాలు, ఉద్యోగుల భవిష్యత్ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాలి. విలువైన స్థలాలు, ఆస్తులను పరిరక్షించేందుకు యూనియన్ తనవంతు కృషి చేస్తుంది. చివరి రక్తపు బొట్టు చిందించైనా ఆర్‌టిసి స్థిర, చర ఆస్తులను కాపాడుకుంటాం.

**పిఆర్‌సి, పెండింగ్ బకాయిల విషయంలో మీ హామీ ఏమిటి?**

ఉద్యోగులు ఎన్నో ఏళ్లుగా పిఆర్‌సి కోసం ఎదురు చూస్తున్నారు. పిఆర్‌సి అమలు విషయంలో ప్రభుత్వం, యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొచ్చి ఉద్యోగులకు న్యాయం జరిగేలా కృషి చేస్తాం. వేతన సవరణను మరింత ఆలస్యం చేయకుండా పరిష్కరించాల్సిన అవసరం ఉంది. దీంతోపాటు అలవెన్సులు, డిఎ ఎరియర్స్ బకాయిలు అందేలా కృషి చేస్తాం.

**కారుణ్య నియామకాలపై మీ కార్యాచరణ?**

విధి నిర్వహణలో మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలవడం యూనియన్ బాధ్యత. పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను గుర్తించి, అర్హత ఉన్న కుటుంబ సభ్యులకు త్వరితగతిన ఉద్యోగాలు లభించేలా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొస్తాం. గతంలో ఆర్‌టిసి ఉద్యోగి 25 సంవత్సరాల పదవీకాలం పూర్తి చేసుకున్నట్లయితే వారి కుటుంబంలో ఒకరికి రెగ్యులర్ ఉద్యోగం కల్పించే అవకాశం ఉండేది. ప్రస్తుతం అది అమల్లో లేదు. ఆ విధానాన్ని పునరుద్ధరించేందుకు కృషి చేస్తాం.

**ఎంప్లాయిస్ యూనియన్ గెలిస్తే తొలి మూడు కార్యక్రమాలు ఏమిటి?**

ముందుగా ఆర్‌టిసి విలీనం, ఉద్యోగ భద్రత, 2025 వేతన సవరణ మాస్టర్ స్కేల్ చేసి ఇవ్వాలని డిమాండ్ చేస్తాం. వీటితో పాటు ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై సమగ్ర నివేదిక రూపొందించి, అనంతరం డిపోల వారీగా ఉద్యోగులను కలిసి సమస్యలను తెలుసుకుని, ప్రాధాన్యత క్రమంలో వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తాం.

**ఈసారి ఉద్యోగులకు కొత్తగా ఏం సాధిస్తారు?**

ప్రస్తుతం ఆర్‌టిసి ఉద్యోగులకు అమలవుతున్న అనేక హక్కులు గతంలో ఎంప్లాయిస్ యూనియన్ సాధించిన విజయాలే. గతంలో సాధించిన హక్కులను కాపాడుకోవడంతోపాటు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కొత్త సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తాం. ఉద్యోగ భద్రత, మెరుగైన వేతనాలు, ప్రమోషన్లు, పని ఒత్తిడి తగ్గింపు, రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనాలపై ప్రత్యేకంగా దృష్టి పెడతాం.

**వేతనాలు, ప్రమోషన్లు, బదిలీలు, డ్యూటీ గంటల సమస్యలకు పరిష్కారం ఏమిటి?**

తాత్కాలిక పరిష్కారాలతో కాకుండా శాశ్వత విధానాలతో సమస్యలను పరిష్కరించాలి. సిబ్బంది కొరతను తగ్గించి పని ఒత్తిడిని నియంత్రించాలి. ప్రమోషన్లు, బదిలీల్లో పారదర్శకత ఉండాలి. డ్యూటీ గంటలు, విశ్రాంతి సమయాల విషయంలో కూడా ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడాలి. గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ విజయం సాధించిన తర్వాత ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసేలా కృషి చేయడంతో పాటు ఉద్యోగ నియామకాలు చేపట్టేలా ప్రభుత్వం, యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొస్తాం. కార్మిక హక్కుల సాధనకు అవసరమైన ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తాం.

**ఉద్యోగులకు మీ ప్రధాన భరోసా ఏమిటి?**

ఉద్యోగుల హక్కుల పరిరక్షణే మా ప్రధాన లక్ష్యం. వేతనాలు, ఉద్యోగ భద్రత, ప్రమోషన్లు, బదిలీలు, పని పరిస్థితులు వంటి ప్రతి అంశంలో ఉద్యోగులకు అండగా ఉంటాం. సమస్య ఏదైనా ఉద్యోగి ఒంటరిగా పోరాడాల్సిన పరిస్థితి రాకుండా యూనియన్ ముందుండి పరిష్కారం కోసం కృషి చేస్తుంది. చిన్నచిన్న తప్పిదాలకు ఉద్యోగులను సర్వీస్ నుంచి తొలగించే చర్యలను నిలువరించి, ఉద్యోగులకు పూర్తి భద్రత కల్పించడమే మా లక్ష్యం.

**మీ యూనియన్ గెలిస్తే ఆర్‌టిసిలో ఎలాంటి మార్పు తీసుకొస్తారు?**

ఉద్యోగుల సమస్యలకు వేగంగా పరిష్కారం లభించేలా బలమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. ఉద్యోగుల హక్కులతోపాటు సంస్థ బలోపేతానికి కూడా సమాన ప్రాధాన్యం ఇస్తాం. ఆర్‌టిసి బలోపేతమైతేనే ఉద్యోగుల భవిష్యత్ భద్రంగా ఉంటుంది. రిటైర్డ్ ఉద్యోగులకు ఆరోగ్యశ్రీ, తెల్ల రేషన్ కార్డులు అందేలా కృషి చేయడంతోపాటు ప్రస్తుత, రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలకు విద్య, వైద్యం సహా ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలు అందేలా చర్యలు చేపడతాం.

# 148 ఏళ్ల క్రికెట్ చరిత్రలోనే ఇదే తొలిసారి

క్రికెట్ చరిత్రలోనే కనీ వినీ ఎరుగని రికార్డును టీమిండియా సొంతం చేసుకుంది. తొలి 30 ఓవర్లలోనే 300 పరుగులు చేసిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించింది. మూడు వన్డేల సిరీస్‌లలో భాగంగా వెస్టిండీస్‌తో గౌహతి వేదికగా జరిగిన రెండో వన్డేలో టీమిండియా ఈ ఫీట్ సాధించింది. ఈ మ్యాచ్లో 406 పరుగుల భారీ లక్ష్యఛేదనకు దిగిన భారత్.. శుభ్మన్ గిల్(130 బంతుల్లో 25 ఫోర్లు, 8 సిక్సతో 217నాటౌట్), రోహిత్ శర్మ(75 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సతో 101) విధ్వంసకర బ్యాటింగ్‌తో 29.1 ఓవర్లలోనే 300 పరుగులు చేసింది. మరో 39 బంతులు మిగిలి ఉండగానే ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించి రికార్డ్ విజయాన్ని అందుకుంది. క్రికెట్ చరిత్రలోనే మరే జట్టు కూడా 30 ఓవర్లలోపు 300 పరుగులు చేయలేదు. రోహిత్ శర్మ, శుభ్మన్ గిల్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడటంతో ఈ రికార్డ్ సాధ్యమైంది. 10 ఓవర్లలోనే



92పరుగులు చేసిన ఈ జోడీ.. 21.1 ఓవర్లలో 200 పరుగుల మైలురాయిని అందుకుంది. వన్డే క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగంగా 200 పరుగులు చేసిన జట్టుగానూ భారత్ నిలిచింది. తొలి వికెట్‌కు 55 పరుగులు జోడించిన అనంతరం రోహిత్ శర్మ ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగినా.. క్రీజులోకి వచ్చిన కోహ్లీ దూకుడుగా ఆడాడు. శుభ్మన్ గిల్ కూడా బౌండరీల మోత మోగించడంతో భారత్ 29.1 ఓవర్లలోనే (175 బంతుల్లో) 300 పరుగులు చేసి క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. గతంలో సౌతాఫ్రికా మాత్రమే 32.2 ఓవర్లలో 300 పరుగులు చేసింది. 2006లో జోహన్నెస్బర్గ్లో ఆస్ట్రేలియాపై ఈఫీట్ సాధించింది. 2006లో శ్రీలంకపై ఇంగ్లండ్ 33.1 ఓవర్లలో, 2009లో శ్రీలంకపై భారత్ 34.1 ఓవర్లలో 300 పరుగులు చేశాయి. ఈపాత రికార్డులంటిని తాజాగా భారత్ బద్దలుకొట్టింది. 30 ఓవర్లలోపే 300 పరుగులు సాధించిన తొలి జట్టుగా చరిత్రకెక్కింది. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్ను భారత్ మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2–0తో సిరీస్ కైవసం చేసుకుంది. నామమాత్రపు ఆఖరి వన్డే శనివారం న్యూచండీఘడ్ వేదికగా జరగనుంది.



## హాకీ సెమీస్‌లో పాక్‌పై ఇండియా విక్టరీ

డిఫెండింగ్ చాంపియన్స్ ఇండియా .. ఏషియన్ గేమ్స్ పురుషుల హాకీ ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన సెమీఫైనల్లో ఇండియా 4–3 గోల్స్ తేడాతో ప్రత్యర్థి పాకిస్థాన్‌పై విజయం సాధించింది. భారత కెప్టెన్ హర్మన్ప్రీత్ 5, 13వ నిమిషాల్లో వచ్చిన రెండు పెనాల్టీ కార్నర్లను అద్భుతంగా గోల్స్‌గా మలిచాడు. ఆట 23వ నిమిషంలో సుఖ్జీత్ సింగ్ ఓ గోల్ చేశాడు. పాకిస్థాన్ జట్టు తరపున అబూ మహమూద్ 30వ నిమిషంలో, హనన్ షాహిద్ 45వ నిమిషంలో వాహిద్ రాణా 49వ నిమిషంలో గోల్స్ చేశారు. కెప్టెన్ హర్మన్ప్రీత్, సుఖ్జీత్లు ప్రారంభంలోనే గోల్స్ చేయడంతో పాక్ టెన్షన్లో పడింది. కానీ సెకండ్ ఆఫ్లో అనూహ్య రీతిలో పాకిస్థాన్ పుంజుకుని .. ఇండియాను కొంత ఆందోళనకు గురిచేసింది. అయితే చివరి నిమిషాల్లో అభిషేక్ ఇండియాను ఓటమి నుంచి తప్పించాడు. సెకండ్ హాఫ్‌లో పాక్ ఫార్వర్డ్ ఆటగాళ్లు దూకుడు గేమ్‌ను ప్రదర్శించారు.ఆట 5వ నిమిషంలోనే హర్మన్ప్రీత్ తన పవర్ఫుల్ డ్రాగ్ ఫ్లిక్తో గోల్ చేశాడు. ఇండియాకు ఫస్ట్ లీడ్ ఇచ్చాడు. ఆ తర్వాత 13వ నిమిషంలో మరో గోల్ చేసి ఇండియాను ఆధిక్యంలో నిలిపాడు 23వ నిమిషంలో సుఖ్జీత్ గోల్ కొట్టడంతో ఇండియాకు 30 లీడ్ వచ్చింది. రెండో హాఫ్‌లో3–1 తేడాతో వెనుకబడ్డ పాకిస్థాన్.. దూకుడు గేమ్ ఆడింది. 49వ నిమిషంలో హనన్ ఈక్వలైజర్ గోల్ చేసి 33తో ఆటపై ఆసక్తిని పెంచాడు. ఇక షూటౌట్ తప్పదు అనుకున్న సమయంలో.. ఆట ముగియడానికి 45 సెకండ్ల ముందు అభిషేక్ గోల్ చేసి పాకిస్థాన్ను స్టన్ చేశాడు. దక్షిణ కొరియా, మలేషియా మధ్య జరిగిన మ్యాచ్‌లో గెలిచిన జట్టుతో ఇండియా ఫైనల్లో గోల్ మెడల్ కోసం పోటీపడనున్నది.

## క్రికెట్ సెమీస్‌లో శ్రీలంకపై భారత్ ఘనవిజయం

ఏషియన్ గేమ్స్‌లో టి–20 సమరంలో దాయాదులు పాకిస్థాన్, భారత్ శనివారం తలపడనున్నాయి. గురువారం జరిగిన రెండో సెమీస్ మ్యాచ్‌లో భారత్ జట్టు 124 రన్స్ తేడాతో శ్రీలంకపై ఘనవిజయం సాధించింది. జపాన్‌లోని నిషిన్లో జరిగిన మ్యాచ్లో భారత్ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన భారత జట్టు 7 వికెట్ల నష్టానికి 169 రన్స్ చేసింది. అయితే చేజింగ్లో శ్రీలంక చితికిలపడింది. కేవలం 9.5 ఓవర్లలో 45 రన్స్కే ఆలౌటైంది. భారత బౌలర్లలో బుమ్రా, అక్షర్ పటేల్, అభిషేక్ శర్మ రెండేసి వికెట్లు తీసుకున్నారు. పరుగులు రాబట్టడం కష్టంగా ఉన్న ప్పి భారత బ్యాటర్లు తొలుత తడబడ్డారు. ఇషాన్ కిషన్ చాకచక్యంగా బ్యాటింగ్ చేశాడు. 46 బంతుల్లో 80 రన్స్ చేసి అతను నాటౌట్గా నిలిచాడు. ఇక ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. 21 బంతుల్లో సూర్యవంశీ 38 రన్స్ చేశాడు. అతని ఇన్నింగ్స్లో ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లు ఉన్నాయి. 170 టార్గెట్తో చేజింగ్కు దిగిన శ్రీలంక ఏ దశలోనూ భారత బౌలర్లను ఎదుర్కోలేకపోయింది. అయిదుగురు లంక బ్యాటర్లు డకౌట్ అయ్యారు. ఫెర్నాండో ఒక్కడే రెండు అంకెల స్కోరు చేశాడు. మరో వైపు బంగ్లాదేశ్తో జరిగిన తొలి సెమీ ఫైనల్లో పాకిస్థాన్ జట్టు ఆరు వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 13 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 111 రన్స్ చేసింది. ఆ తర్వాత పాకిస్థాన్ 11.3 ఓవర్లలో టార్గెట్ను అందుకున్నది. అబ్దుల్ సమద్ 30, నవాజ్ 27 రన్స్ చేసి పాక్ను గెలిపించారు. ఇక ఇండియా, పాకిస్థాన్ జట్లు శనివారం జరిగే గోల్ మెడల్ మ్యాచ్లో పోటీపడనున్నాయి.



## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

### పిఎం ఇ–బస్ సేవ పథకానికి ప్రధాన సామాజిక ప్రయోజనం ఏమిటి?

- 2026లో యూరప్లో అడవి మంటల తీవ్రతకు ప్రధాన పర్యావరణ కారణాల్లో ఒకటిగా ఏది గుర్తించారు?
  వాతావరణ మార్పులతో పెరిగిన అధిక ఉష్ణోగ్రతలు, ఎండ పరిస్థితులు.
- 2026 సెప్టెంబర్ 4న ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహం పేరు ఏమిటి?
  ఇఒఎస్05.
- ఇఒఎస్05ను ఏ ప్రయోగ వాహనంతో ప్రయోగించారు?
  జిఎస్ఎల్‌విఎఫ్ 17తో.
- ఇఒఎస్05 ఏ రకమైన ఉపగ్రహ మిషన్‌కు చెందింది?
  భూ పరిశీలన ఉపగ్రహ మిషన్.
- 2026లో ఇస్రో ప్రయోగించిన పిఎస్ఎల్ విసి62 మిషన్‌లోని ఉపగ్రహం పేరు ఏమిటి?
  ఇఒఎస్ఎన్1 లేదా అన్వేషా.
- పిఎస్ఎల్‌వి 62 మిషన్ విజయం సాధించిందా?
  లేదు. ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టలేకపోయింది.
- నిసార్ ఏ రెండు అంతరిక్ష సంస్థల సంయుక్త మిషన్?
  నాసా మరియు ఇస్రో సంయుక్త మిషన్.
- నిసార్ ప్రధానంగా ఏ సాంకేతికతను ఉపయోగిస్తుంది?
  సింథటిక్ అపర్చర్ రాడార్ ఆధారిత భూ పరిశీలన సాంకేతికతను.
- 2026లో నాన్సీ గ్రేస్ రోమన్ స్పేస్ టెలిస్కోప్ ఎందుకు వార్తల్లో నిలిచింది?
  అధునాతన అంతరిక్ష పరిశీలన సామర్థ్యాలతో ప్రయోగించబడినందుకు.
- నాన్సీ గ్రేస్ రోమన్ స్పేస్ టెలిస్కోప్‌లోని ప్రధాన శాస్త్రీయ పరికరాల్లో ఒకటి ఏమిటి?
  వైడ్ ఫీల్ ఇన్‌స్ట్రుమెంట్.
- రోమన్ స్పేస్ టెలిస్కోప్కు నాన్సీ గ్రేస్ రోమన్ పేరు ఎందుకు పెట్టారు?
  హబుల్ స్పేస్ టెలిస్కోప్ రూపకల్పన, అంతరిక్ష ఖగోళ పరిశోధన అభివృద్ధిలో ఆమె కీలక పాత్ర పోషించారు.
- 2026లో రొటేటింగ్ డిటొనేషన్ ఇంజిన్ ఏ రంగంలో వార్తల్లో నిలిచింది?
  రక్షణ, విమాన మరియు రాకెట్ ప్రొపల్షన్ సాంకేతికతలో.
- రొటేటింగ్ డిటొనేషన్ ఇంజిన్ సంప్రదాయ ఇంజిన్లతో ఎలా భిన్నంగా ఉంటుంది?
  సాధారణ దహనానికి బదులుగా సూపర్సోనిక్ డిటొనేషన్ తరంగాలను ఉపయోగిస్తుంది.
- రొటేటింగ్ డిటొనేషన్ ఇంజిన్కు ప్రధాన ప్రయోజనం ఏమిటి?
  తక్కువ ఇంధనంతో ఎక్కువ థ్రస్ట్ సాధించే అవకాశాన్ని కల్పిస్తుంది.
- 2026లో వాహనాల మధ్య సమాచార మార్పిడికి సంబంధించిన ఏ సాంకేతికత వార్తల్లో నిలిచింది?
  వి–టు–వి కమ్యూనికేషన్.



- వి–టు–వి కమ్యూనికేషన్ ప్రధాన ప్రయోజనం ఏమిటి?
  వాహనాలు పరస్పరం వేగం, స్థానం, ప్రమాద హెచ్చరికలు వంటి సమాచారాన్ని పంచుకోవడం ద్వారా రహదారి భద్రతను మెరుగుపరచడం.
- 2026లో ఐఎన్ఎస్ నిపుణ్ ఏ రకమైన నౌకగా వార్తల్లో నిలిచింది?
  డైవింగ్ సపోర్ట్ వెసల్.
- డైవింగ్ సపోర్ట్ వెసల్ ప్రధానంగా ఏ పనులకు ఉపయోగపడుతుంది?
  సముద్రగర్భ పరిశోధన, డైవింగ్ కార్యకలాపాలు, రక్షణ మరియు నీటి అడుగున నిర్వహణ పనులకు.
- 2026లో ఐసిజిఎస్ అజిత్ను ఏ సంస్థ నిర్మించింది?
  గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్.
- ఐసిజిఎస్ అజిత్ ఏ రకమైన నౌక?
  ఫాస్ట్ పెట్రోల్ వెసల్.
- ఐసిజిఎస్ అజిత్‌ను ఏ దళానికి అప్పగించారు?
  భారత కోస్ట్ గార్డ్స్.
- 2026లో కికుచిఫుజిమోటో వ్యాధి ఎందుకు వార్తల్లో నిలిచింది?
  అరుదైన లింఫ్ నోడ్ సంబంధిత వ్యాధిగా వైద్య రంగ చర్చల్లో నిలిచింది.
- కికుచిఫుజిమోటో వ్యాధి ప్రధానంగా శరీరంలోని ఏ భాగాన్ని ప్రభావితం చేస్తుంది?
  లింఫ్ నోడ్స్‌ను.
- 2026 బ్రిక్స్ సమావేశంలో ఆరోగ్యరంగానికి సంబంధించిన ఏ కొత్త సహకార ప్రతిపాదనకు ప్రాధాన్యం ఇచ్చారు?
  అంటువ్యాధులపై ముందస్తు హెచ్చరిక వ్యవస్థ ఏర్పాటుకు.
- అంటువ్యాధుల ముందస్తు హెచ్చరిక వ్యవస్థలో కృత్రిమ మేధస్సు ఎందుకు ఉపయోగపడుతుంది?
  వ్యాధి వ్యాప్తి నమూనాలను త్వరగా గుర్తించి, ప్రమాద ప్రాంతాలను ముందుగా అంచనా వేయడానికి.
- పిఎం ఇ–బస్ సేవ పథకానికి ప్రధాన సామాజిక ప్రయోజనం ఏమిటి?
  పట్టణ ప్రజలకు శుభ్రమైన, తక్కువ కాలుష్యంతో కూడిన ప్రజా రవాణాను అందించడం.
- పిఎం ఇ–బస్ సేవలో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం ఏ పర్యావరణ లక్ష్యానికి అనుసంధానమవుతుంది?
  పట్టణ వాయు కాలుష్యం, కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి.
- 2026లో యువత నిరుద్యోగంపై చర్చలో ప్రధానంగా ఏ అంశం వెలుగులోకి వచ్చింది?
  కేవలం నిరుద్యోగ రేటును చూడకుండా ఉద్యోగాల నాణ్యత, నైపుణ్యాలు, కార్మిక మార్కెట్లో యువత భాగస్వామ్యాన్ని పరిశీలించాల్సిన అవసరం.

# నిర్వీర్యమవుతున్న రాజ్యాంగ వ్యవస్థలు

## జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాల్సిందే... కలెక్టరేట్ ఎదుట సిపిఐ ఆందోళనలు

**జిల్లాల నుంచి ప్రజాపక్షం ప్రతినిధుల బృందం**

ఎన్నికల సంఘం కుట్రలు, కుతంత్రాల కారణంగానే 2024లో బిజెపి అధికారంలోకి వచ్చిందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు ఆరోపించారు. ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఆందోళనను ఉద్దేశించి హేమంతరావు మాట్లాడుతూ మోడీ పాలనలో రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికే సిబి, సిబిఐ, ఇడి లాంటి సంస్థలను రాజకీయ అవసరాలకు వినియోగించుకుంటున్న బిజెపి ఎన్నికల సంఘాన్ని సైతం వాడుకుంటుందన్నారు. అనంతర జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, నాయకులు యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, దొండపాటి రమేష్, తాటి వెంకటేశ్వరరావు, మిడికంటి వెంకట రెడ్డి, పగడాల మల్లేష్, రవి, మేకల శ్రీనివాసరావు, సాంబశివరెడ్డి, ఆనందరావు పాల్గొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని, ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఐ(ఎం),టీజేఎస్,సిపిఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నల్లజెండాలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రస్తుత ఎస్ఐఆర్ విధానాన్ని నిలిపివేసి పాత పద్ధతిలో ఓటర్ల జాబితా సవరణ చేపట్టాలని,అర్హులైన పౌరులందరి ఓటు హక్కును పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రావణ్



ఖమ్మం...

కుమార్, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు పొన్నాల గోపాల్ రెడ్డి, న్యూ డెమోక్రసీ ఇందూర్ సాగర్, రాయి కృష్ణ, సిపిఐ నాయకులు పబ్బు వీర స్వామి, బల్గూరి నరసింహ, నల్పరాజు రామలింగయ్య, టి.వెంకటేశ్వర్లు, కెఎస్.రెడ్డి, చాపల శ్రీను, సతీష్, బొడిగె సైదులు, సయ్యద్ హాశం, టీజేఎస్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, ఎండి సలీం, దండెంపల్లి సత్తయ్య, కొండా అనురాధ, నలప రాజు సైదులు, తుమ్మల పద్మ పాల్గొన్నారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా కేంద్రంలో వామపక్షాల ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ నుండి పాత బస్టాండ్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తుఇమామ్, నాయకులు రాళ్లబండి శశిధర్,కాముని గోపాల స్వామి,కిష్టపురం లక్ష్మణ్ , సందబోయిన ఎల్లయ్య, గోడ్డుబర్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. సిఇసి జ్ఞానేష్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, వామపక్ష నాయకులు స్వామి, కె.విశ్వనాథ్, అనంతలక్ష్మి, దాముక లక్ష్మణ్ కోడిపుంజుల రాజన్న, రాజేశం, కల్లేపల్లి అశోక్, కల్లేపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు. సిఇసి జ్ఞానేష్ కుమార్‌ను రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట సిపిఐ, సిపిఎంల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్, సిపిఎం జిల్లా కార్యదర్శి మహిపాల్, నాయకులు వెంకట్ రాములు, బీరు మొహమ్మద్, గంటి సురేష్ కుమార్, వెంకటేష్, రవీందర్, అబ్దుల్లా, ఖాదర్, మునీర్, ఇలియాస్, నర్సింలు, రవి, జమున తదితరులు పాల్గొన్నారు.

సిఇసి జ్ఞానేష్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు దూళిపాల ధనుంజయ నాయుడు, ఉస్తెల నారాయణరెడ్డి, బద్దం కృష్ణారెడ్డి, బూర వెంకటేశ్వర్లు, అనంతుల మల్లీశ్వరి, అమారారపు పున్నయ్య, ఖమ్మంపాటి రాము, రాజారాం, రెమిడాల రాజు, ఎడెల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ పార్టీలు సంయుక్తంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆందోళన నిర్వహించారు. సిపిఐ, జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి బోడ శ్యామ్యూల్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య, ముత్యాల యాదిరెడ్డి, కె.రామస్వామి, రామకృష్ణ, ప్యామిద, సిపిఎం నాయకులు కడిగళ్ల భాస్కర్, జగదీష్, జగన్, కిషన్, భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆయిలయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచిన జ్ఞానేశ్వర్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్, నాయకులు కేశవులుగౌడ్, తన్నీరు నరసింహ, ఈర్ల చంద్రమౌళి, ఆర్.ఇందిర, మారేడు శివశంకర్, బండి లక్ష్మీపతి, బిజ్జా శ్రీనివాసులు, కృష్ణాజీ, శంకర్‌గౌడ్, వి.రవీందర్, సయ్యద్ ఖాజా , మొయినుద్దీన్, ఎండీ ఖుతుబుద్దీన్, ఎం.లక్ష్మీ నారాయణ, రాధాకృష్ణ, పి.పరుశురాం, సంఘం కృష్ణ, కొత్త రామస్వామి, బి.కృష్ణయ్య, రమణ, మాదుగుల నరసింహ, విజయ్, జి.వెంకటస్వామి, రామకృష్ణారెడ్డి, విష్ను, బాలస్వామి, నరసింహ, యాదగిరి, మధు, పర్వతాలు, శివ, విష్ణు, ఖాజా మొయినుద్దీన్, కురుమయ్య, శివప్రసాద్, పూజారి శేఖర్, సురేష్, మిద్దె రామకృష్ణ, శంకర్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్లను తొలగించడాన్ని నిలిపివేయాలని కోరుతూ వామపక్ష పార్టీల నాయకులు మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పైళ్ళ ఆశయ్య, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి లాల్ కుమార్, నాయకులు జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, బొడెంకి చందు, గోమాస ప్రకాష్, టి.శ్రీనివాస్, మేకల రాములు, లింగం రవి, ఖలీందర్ అలీఖాన్, బ్రహ్మనందం అరుణ, మల్లన్న, దొండ ప్రభాకర్, దూంపల రంజిత్ కుమార్, మిట్టపల్లి పౌలు, వనం సత్యనారాయణ, మామిడి గోపి, అశోక్, కౌన్సిలర్ మద్దెల శంకర్, దేవి పోచన్న, ఎగుడ మొండి, కొత్తపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సర్ ప్రక్రియను నిలిపివేయాలని సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. వామపక్ష నేతలు బి.విజయసారథి, సమ్మెట రాజమౌళి, హెచ్ లింగ్య, చిన్న చంద్రన్న, బిఅజయ్ సారధి రెడ్డి, సీతారాం దేవేందర్, పెరుగు కుమార్, రేశ పల్లి నవీన్, రావుల రాజు, బానోత్ బాబు, బానోత్ వెంకన్న, భాష, మధు ,పాపయ్య, కోటేష్, చింత కుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, తండా సందీప్, నర్రా సంధ్య శ్రావణ్, వెలుగు శ్రావణ్, ఆబోతు అశోక్, బానోతు లింగ్య నాయక్, రజాక్, పులిగుజ్జు వెంకన్న, మోష, వంకాయలపాటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ...



రంగారెడ్డి...



మంచిర్యాల...



సూర్యాపేట...



వికారాబాద్...



పెద్దపల్లి...



మహబూబాబాద్...



సిద్దిపేట...



నాగర్కర్నూల్...

## 3న నల్లగొండకు మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి రాక

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఈ నెల 3న రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి జిల్లా కేంద్రానికి రానున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. ఆ రోజు నల్లగొండ డివిజన్ పరిధిలోని జర్నలిస్టులకు మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియాపై జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్న వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు కలెక్టర్ తెలిపారు.3వ తేదీ ఉదయం 7 గంటలకు మీడియా అకాడమీ చైర్మన్ హైదరాబాద్‌లో బయలుదేరి ఉదయం 9:30 గంటలకు నల్లగొండ చేరుకుంటారని, ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే వర్క్‌షాప్‌లో పాల్గొని తిరిగి సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ వెళ్తారని తెలిపారు.

## వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** వయో వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ స్పష్టం చేశారు. గురువారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమాజ నిర్మాణంలో, జిల్లా అభివృద్ధిలో సీనియర్ సిటిజన్ల పాత్ర ఎంతో ప్రాధాన్యమైందని కొనియాడారు. కుటుంబం అంటే కేవలం రక్తసంబంధీకులే కాకుండా స్నేహబంధాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయన్నారు. చిన్నతనం నుంచి చదువు, ఉద్యోగం, పెళ్లిళ్లు, పిల్లల పెంపకం వంటి బాధ్యతలన్నీ నెరవేర్చిన తరువాత, విశ్రాంతి సమయంలో మళ్లీ ఎలాంటి మానసిక ఒత్తిళ్లకు గురికాకూడదన్నారు. మీ సంతోషం ఎక్కడ ఉందో గ్రహించి అక్కడ సమయం గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి. రామారావు, అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్డిఓ సన్యాసయ్య, డిడబ్ల్యుఓ నరసింహ రావు, డిఎంహెచ్ఓ వెంకటరమణ పాల్గొన్నారు.

## శివగంగ ఎత్తిపోతల పథకాన్ని నిరంతరం కొనసాగించాలని వినతి



**ప్రజాపక్షం/చింతలపాలెం :** శివగంగ ఎత్తిపోతల పథకాన్ని నిరంతరం కొనసాగించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లోని రెవెన్యూ అధికారి ప్రేమ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివగంగ ఎత్తిపోతల పథకం కింద 11 గ్రామాల పరిధిలో 13వేల ఎకరాల ఆయకట్టు ఉందని సాగునీటిలో అంతరాయం ఏర్పడుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. లిఫ్టులో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మరమ్మత్తులు చేసి పంప్‌లు నడిచేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఉస్తెల నారాయణ రెడ్డి, అనంతుల మల్లేశ్వరి, ధనుంజయ నాయుడు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతి కోసం ఏకం కావాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రపంచ శాంతి కోసం ప్రజలంతా ఐక్యంగా కదలాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపిఎస్ఓ) నాయకులు చామల అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏఐపిఎస్ఓ నాలుగో మహాసభల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణం, హింస, ఆయుధ పోటీకి వ్యతిరేకంగా ప్రజల్లో శాంతి, సౌభ్రాతృత్వం, మానవతా విలువలపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. యుద్ధాల వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రపంచ శాంతి కోసం ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, విద్యార్థులు, యువత, మహిళలు పెద్దఎత్తున సంఘటితం కావాలని కోరారు. శాంతి, సౌభ్రాతృత్వం, మానవత్వం కోసం జరిగే ఈ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు బొమ్మగాని శ్రీనివాస్, అధ్యక్షులు తొగటి మురళీ, ప్రధాన కార్యదర్శులు బూర వెంకటేశ్వర్లు, గుగులోతు రాజారాం, ఖమ్మంపాటి రాము పాల్గొన్నారు.

## పట్టణ అభివృద్ధి ప్రాధాన్యం

దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండ పట్టణంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం పట్టణ అభివృద్ధిలో భాగంగా రోడ్లు, డ్రైనేజి తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పట్టణంలోని 8వ వార్డులో రూ. 80.17 లక్షలతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును ఎంఎల్‌ఏ బాలునాయక్ ప్రారంబించారు. అనంతరం అదే వార్డులోని మరో కాలనీలో నూతనంగా నిర్మించిన ఇసి రోడ్డును పరిశీలించారు. ఈసందర్భంగా వార్డులోని వివిధ కాలనీల్లో ఎంఎల్‌ఏ పర్యటిస్తూ రోడ్లు, డ్రైనేజి, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. దేవరకొండ పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రజల అవసరాలను గుర్తించి రూ. 20కోట్లకు పైగా వ్యయంతో సిసి రోడ్ల పనులు చేపడుతున్నట్లు ఎంఎల్‌ఏ తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, ఆలంపల్లి నర్సింహా, వైస్ చైర్మన్ జువేరియా తబస్సుం, కౌన్సిలర్ అజయ్‌చంద్ర, రయిస్, నజీరుద్దిన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



# నల్లగొండ జిల్లాను 5వ స్థానంలో నిలపాలి

విద్య పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

కలెక్టర్ బి.చంద్రశేఖర్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** విద్యకు సంబంధించి అన్ని విషయాలలో జిల్లా స్థానాన్ని వచ్చే నెల నాటికి 5వ స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.గురువారం ఆయన జిల్లా కేంద్రంలోని సెయింట్ ఆల్ఫాన్సో హై స్కూల్లో ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు,హెడ్మాస్టర్లకు ఉద్దేశించి ఎఫ్ఎల్ఎన్‌పై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విద్యా విషయంలో జిల్లా ర్యాంకు మెరుగుపరచాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపై ఉందన్నారు. ఇందులో భాగంగా ముందుగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపొందింపజేయాలని, ఎక్కడైనా పాఠశాలల్లో విద్య పట్ల నిర్లక్ష్యం వహించినట్లు తన దృష్టికి వస్తే ఇకపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించే పలు సూచనలు, సలహాలు కలెక్టర్ తెలిపారు. విద్యతోపాటు శానిటేషన్, ఇతర అంశాల పట్ల కూడా ఎంఈఓ లు, కాం ప్లెక్స్ హెడ్మాస్టర్లు, హెడ్మాస్టర్లు దృష్టి సారించాలన్నారు.జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు,సెయింట్ ఆల్ఫాన్సో హై స్కూల్ ఫాదర్, తదితరులు ఉన్నారు.

### బిఎల్ఒలే ఇంటింటికి వెళ్లి ధ్రువపత్రాలు పరిశీలించాలి

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు సంబంధించి బిఎల్ఒలే ఓటర్ల ఇంటింటికి వెళ్లి ధ్రువపత్రాలను పరిశీలిస్తున్నారని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి తెలిపారు.గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై,అలాగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.జిల్లాలో ఎస్ఐఆర్‌కు సంబంధించి 100 శాతం నోటీసులు జారీ చేశామని,బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి సరైన డాక్యుమెంట్ల ద్వారా విచారణ చేస్తున్నారని,ఫారం6 దరఖాస్తులు ఇప్పటివరకు 4,300 పరిశీలించామని జిల్లా కలెక్టర్ వివరించారు.నల్లగొండ వరంగల్‌ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి రూల్ 31(బి) ప్రకారం నోటీసు పబ్లిష్ చేయడం జరిగిందని,ఇప్పటివరకు ఫారం18 ద్వారా 42,972 దరఖాస్తులు వచ్చాయని, వాటిని త్వరితగతిన క్షేత్రస్థాయి పరిశీలన చేసి వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఇప్పటికే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించామని, గతంలో 605 పోలింగ్ స్టేషన్లు ఉండగా, ప్రస్తుతం 644 పోలింగ్ స్టేషన్లకు ప్రతిపాదనలు పంపించామని వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో (రెవెన్యూ) అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్,ఆర్‌డిఓ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# గెలిచినా ఓడినా... ప్రజల మధ్యే ఉన్న నాయకుడు ఆర్‌డిఆర్

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/అర్వపల్లి :** ఎన్నికల్లో గెలిచినా ఓడినా నిత్యం ప్రజల మధ్యనే ఉండి ప్రజా సమస్యల కోసం కృషి చేసిన మహానేత మాజీ మంత్రి, దివంగత నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి అని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దరూరి యోగానందచార్యులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దామోదర్ రెడ్డి విగ్రహాన్ని ఆయన తనయుడు ఏఐసిసి సభ్యులు సర్వోత్తమ్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుంగతుర్తి, సూర్యాపేట నియోజక వర్గాల్లో శాసన సభ్యునిగా, మంత్రిగా పనిచేసిన సమయంలో ఎంతో అభివృద్ధి చేశారని అన్నారు. శ్రీరాంసాగర్ 2వ దశ కోసం ఆయన పోరాడిన తీరును గుర్తు చేశారు. అందుకే ప్రభుత్వం 2వ దశకు ఆర్‌డిఆర్ నామకరణం చేసిందని చెప్పారు. ఏఐసిసి సభ్యులు సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి అర్వపల్లిలో ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. పార్టీని నిలబెట్టేందుకు తాము సర్వశక్తులు ఒడ్డుతుండడంతోపాటు ఆస్తులను కూడా కోల్పోయామని చెప్పారు. అందుకు తనకు ఎలాంటి బాధలేదని ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు కమీషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, చెవిటి వెంకన్న యాదవ్, దామోదర్ రెడ్డి కుటుంబ సభ్యులు కృష్ణారెడ్డి, చరణ్ రెడ్డి, ఎస్‌సి కార్పోరేషన్ మాజీ చైర్మన్ ఎన్. ప్రీతమ్, జిల్లా అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, నాయకులు తీగల గిరిధర్ రెడ్డి, ఎల్లోజు చామంతి పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



మెస్ ఛార్జీలు విడుదల చేసి, రెగ్యులర్ వార్డెన్లను నియమించాలి

ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్

**ప్రజాపక్షం/భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లా లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఉప్పల శాంతి కుమార్ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ డిమాండ్ చేశారు. హాస్టళ్లను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్న అనంతరం ఆయన ఈ మేరకు ప్రభుత్వాన్ని కోరారు. హాస్టళ్లలో పెండింగ్లో ఉన్న మెస్ ఛార్జీలను వెంటనే విడుదల చేయడంతో పాటు, విద్యార్థులకు సరైన భోజనం, బెడ్లు, పరుపులు, తాగునీరు, మరుగుదొడ్లు, దోమల నివారణకు కిటికీలకు జాలీలు వంటి మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలకు మరమ్మతులు చేపట్టి, అవసరమైన చోట నూతన భవనాలు నిర్మించాలని కోరారు. అలాగే బాలుర, బాలికల హాస్టళ్లకు రెగ్యులర్ వార్డెన్లను నియమించి, అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులు చదువును కొనసాగించేందుకు ప్రభుత్వ హాస్టళ్లపై ఆధారపడుతున్నారని, వారి సమస్యలను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో మెరుగైన భోజనం అందించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నీళ్ల చారు ఉడికి ఉడకని అన్నంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఆహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల,హాస్టళ్ల సమస్యలపై, ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కారం చూపకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని శాంతి కుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు చెరుకు లక్ష్మీ సాయి, శ్యాగ జాను, నాయకులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# బాలలు నేరాల బాట పట్టొద్దు

జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బాలలు నేరాల బాట పట్టకుండా,చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ,బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్, చంద్రశేఖర్,జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ పిలుపునిచ్చారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో చైల్డ్ ప్రొటెక్షన్ వ్యవస్థ కి సంబందించిన వివిధ శాఖలతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో బాలలు నేరాలకు పాల్పడటానికి గల కారణాలు,చెడు వ్యసనాలకు అలవాటు పడటానికి దారితీస్తున్న పరిస్థితులు, వాటిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలల విద్య,ఆరోగ్యం,సంక్షేమం,రక్షణ కోసం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి చిన్నారికి అందేలా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ సందర్బంగా ఎస్పి మాట్లాడుతూ జిల్లాలో సుమారు 130 మంది బాలలు వివిధ నేరాలకు సంబంధించిన కేసుల్లో భాగమైన అంశాన్ని దృష్టిలో ఉంచుకుని,వారు నేరాల వైపు మళ్లడానికి గల సామాజిక,కుటుంబ,ఆర్థిక,మానసిక కారణాలను గుర్తించాల్సిన అవసరం ఉందని వివరించారు.ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా డాక్టర్. ఇసిడోర్ ఫిలిప్స్,అడిషనల్ ఎస్పి రమేష్,జడ్‌పి సీఈఓ ప్రేమ్ కరుణ్ రెడ్డి,డిఎస్‌పిలు శివరాం రెడ్డి,రవి,శ్రీనివాస్ రావు,విద్యాశాఖ పాల్గొన్నారు.

# గొంతు ఆపరేషన్‌కు వెళ్ళిన బాలుడికి... బ్రెయిన్ డెడ్!

డాక్టర్ నిర్లక్ష్యంతోటే ఇలా జరిగిందంటూ ఆసుపత్రి ఎదుట ఆందోళన




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గొంతు ఆపరేషన్‌కు వెళ్ళిన ఓ పద్నాలుగు ఏండ్ల బాలుడికి బ్రెయిన్ డెడ్ అయ్యింది. డాక్టర్ నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందంటూ ఆ బాలుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగిన సంఘటన గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కొత్త బస్టాండ్ సమీపంలోని ఆనంద రావు చెవి, ముక్కు, గొంతు ఆసుపత్రికి పట్టణంలోని 25వ వార్డు చంద్రన్నకుంటకు చెందిన మైనం ఉపేందర్ ఉషా దంపతుల కుమారుడు కార్తీక్ (14) గత కొంతకాలంగా గొంతులో గడ్డలు ఏర్పడి గురక సమస్యతో బాధపడుతుండడంతో వారం రోజుల క్రితం డాక్టర్ ఆనంద రావు వద్దకు చికిత్స కోసం తీసుకవచ్చారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆపరేషన్ చేయాలని సదరు డాక్టర్ సూచించారు. దీనికి ఖర్చు రూ.80వేలు అవుతుందని చెప్పడంతో అందుకు వారు అంగీకరించారు. ఆపరేషన్ చేస్తున్న సమయంలో ఆక్సిజన్ అయిపోయిందని చెప్పిన వైద్యుడు సిబ్బంది కొంతసేపు బయటకు వెళ్ళి వచ్చారని ఆ తరువాత ఆపరేషన్ చేసిన అనంతరం అతని పరిస్థితి విషమంగా మారడంతో మరో ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెదడు తీవ్రంగా దెబ్బతిందని 80 శాతం వరకు బ్రెయిన్ డ్యామేజ్ అయిందని తెలిపినట్లు విలేకరుల ముందు వాపోయారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే ఆపరేషన్ సమయంలో ఆక్సిజన్ అయిపోవడం వల్లే ఇలా జరిగిందంటూ వారు ఆరోపిస్తున్నారు. ఆందోళన ఉధృతం కావడంతో పోలీసులు రంగంలోకి దిగి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉంటే సదరు డాక్టర్ తన సామాజిక వర్గానికి చెందిన నేతలను రంగంలోకి దింపి బాధితుడి కుటుంబ సభ్యులతో బేరసారాలు జరిపారు. దీంతో ఆందోళన విరమించారు.

**ఆసుపత్రి ఎదుట ఆందోళన...** బాలుడి పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఆసుపత్రి నిర్వాహకులకు వారి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఆపరేషన్ సమయంలో ఏం జరిగింది, ఆక్సిజన్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతోనే ఇలా జరిగిందా వైద్యపరమైన లోపం ఏమైనా ఉందా సమగ్ర విచారణ జరుపాలని డిమాండ్ చేశారు.

**డాక్టర్ వివరణ...** ఈ సంఘటనపై డాక్టర్ ఆనంద రావును వివరణ కోరగా వైద్యం చేసి మూడు రోజులు అవుతుందని ఆ సమయంలో ఆ బాలుడి ఆరోగ్యం మెరుగ్గా ఉందన్నారు. ఇంత వరకు నేను పేషెంట్‌ను చూడలేదని చెప్పారు. అతడిని పరీక్షించిన తరువాత ఏం జరిగిందనేది చెబుతానంటూ దాటవేశారు.

## మతసామరస్యానికి ప్రతీకగా ఉర్సు ఉత్సవాలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సయ్యద్ షా లతీఫుల్లా ఖాద్రి ఉర్సు ఉత్సవాలను ఘనంగా,విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.గురువారం పట్టణంలోని క్లాక్ టవర్ సమీపంలోని మదీనా మసీదులో మాజీ జెడ్‌పిటీసీ గుమ్ముల మోహన్ రెడ్డితో కలిసి గంధం ఎత్తి ఉర్సు ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే ఉర్సు ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. గత 400 సంవత్సరాలుగా ఈ ఉర్సు ఉత్సవాలు కొనసాగుతున్నాయని తెలిపారు.నల్లగొండ పట్టణంలో హిందూ,ముస్లింలు కలిసి మతసామరస్యంతో సయ్యద్ షా లతీఫుల్లా ఖాద్రి ఉర్సు ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. మూడు రోజులపాటు జరిగే ఉర్సు ఉత్సవాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్లు ఇబ్రహీం,సమాద్,మాజీ కౌన్సిలర్ ఫసాద్ అలీ,బాబా,మామిడి కార్తీక్,రేగటే లింగస్వామి,వజ్జ రమేష్ పాల్గొన్నారు.







## దేశిడి అహల్యమ్మకు సిపిఐ నివాళులు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** సిపిఐ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ దేశిడీ నరేందర్ రెడ్డి మాతృమూర్తి దేశిడి అహల్యమ్మ బుధవారం సాయంత్రం మరణించారు. నరేందర్ రెడ్డి స్వగృహంలో ఆమె పార్థివ దేహం పై సిపిఐ జాతీయ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి యానాల దామోదర్, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, సిపిఐ రాష్ట్ర నాయకులు గోదా శ్రీరాములుతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. నరేందర్ రెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలువేరు అంజయ్య కంటి ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను పరామర్శించారు. అంజయ్య త్వరగా కోలుకొని ప్రజా ఉద్యమంలో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, కే.శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ, మండల పార్టీ కార్యవర్గ సభ్యులు రైతు సంఘం సీనియర్ నాయకుడు తోకల రామిరెడ్డి, వీరమల్ల యాదయ్య, పల్లె మల్లారెడ్డి, గీతా పనివారల సంఘం నాయకుడు పందుల యాదగిరి పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలకు తుది ఓటర్ల జాబితా విడుదల

**ప్రజాపక్షం/నల్లగొండ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నల్గొండ జిల్లా బ్రాంచి ఎన్నికలకు తుది ఓటర్ల జాబితాను గురువారం విడుదల చేశారు. గతంలో ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాపై అందిన అభ్యంతరాలు,క్లెయిములు,అప్పీళ్లను పరిశీలించిన అనంతరం రాష్ట్ర బ్రాంచ్ ఆదేశాల మేరకు అనుబంధ ఓటర్ల జాబితాను రూపొందించారు.అనంతరం తుది ఓటర్ల జాబితాను ప్రచురించారు.తుది ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్ కార్యాలయం,మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం,ఆర్‌డిఓ కార్యాలయం,తహసీల్దార్ (ఎంఆర్‌ఓ) కార్యాలయం,ఎంపీడీవో కార్యాలయం,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయ నోటీసు బోర్డుల్లో ప్రజల పరిశీలనార్థం ప్రదర్శించినట్లు ఎన్నికల అధికారి టి.మమత తెలిపారు.ఈనెల 3న నామినేషన్ల స్వీకరణ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లా సహకార అధికారి కార్యాలయం, నల్లగొండలో నిర్వహించనున్నారు. 5న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్ల పరిశీలన,6న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉపసంహరణ జిల్లా సహకార అధికారి కార్యాలయంలో నిర్వహిస్తారు.11న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నల్లగొండలోని ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోని రెడ్ క్రాస్ భవన్‌లో ఉన్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన గురుకుల విద్యార్థులు



**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని అన్నంపట్ల గ్రామంలో హైదరాబాద్ మేడ్చల్ జిల్లాలకు చెందిన మహాత్మ జ్యోతిబాపూలే సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఈనెల 26, 27 తేదీలలో హనుమకొండలో జరిగిన రాష్ట్రస్థాయి 12వ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ అండర్ 18, 20 సంవత్సరాల బాలికల పోటీల్లో పాల్గొన్న తొమ్మిది మంది విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేల్పూరి రాధా తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొన్న ముగ్గురి విద్యార్థులకు కే.యేషిత, ఎంఎస్‌డిఎస్ ద్వితీయ సంవత్సరము 300 మీటర్ల స్టీపిన్ చేజ్‌లో బంగారు పతకం సాధించగా శ్రీ చైతన్య బీకాం ద్వితీయ సంవత్సరం రజిత పథకం, ఎస్.నవ్య బీ కాం ప్రథమ సంవత్సరం 800 మీటర్ల స్టీపిన్ చేజ్ కాంస్య పథకం సాధించడం పట్ల ప్రిన్సిపల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల బృందం ఆయా విద్యార్థులను అభినందించారు.

## వయోవృద్ధులకు అండగా నిలవాలి

సీనియర్ సివిల్ న్యాయమూర్తి కవిత



**ప్రజాపక్షం/మంచిర్యాల :** వయోవృద్ధులను గౌరవిస్తూ వారి సంక్షేమానికి అండగా నిలవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ సివిల్ న్యాయమూర్తి కవిత అన్నారు. జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా మంచిర్యాల ఆనంద్ నిలయం రెడ్ క్రాస్ వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ తో కలిసి ప్రారంభించారు. వృద్ధుల సంరక్షణ చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని, ఆసుపత్రుల్లో వారికి వేగంగా సేవలందించాలని తెలిపారు. శిబిరంలో 25 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, లయన్స్ క్లబ్ ప్రతినిధి మధుసూదన్ రెడ్డి, రెడ్ క్రాస్ ప్రతినిధి మహేందర్, వైద్యులు డాక్టర్ అమన్, డాక్టర్ రమ్య, డాక్టర్ తబియా, డాక్టర్ రజిత, డాక్టర్ రాము పాల్గొన్నారు.

## గ్రామీణుల ఆరోగ్య రక్షణే ధ్యేయం



**ప్రజాపక్షం/వాంకిడి :** గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని ఆరోగ్య సిబ్బంది పేర్కొన్నారు. గురువారం వాంకిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిచ్చుపల్లి, సోనాపూర్ గ్రామాల్లో బంబారా సబ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. శిబిరంలో మొత్తం 63 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. వీరిలో జ్వర లక్షణాలు ఉన్న ఐదుగురికి ర్యాపిడ్ డయాగ్నస్టిక్ పరీక్షలు చేసి రక్త నమూనాలను సేకరించారు.ఉప సర్పంచ్ మరుబాయి, ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, ఎంఎల్‌హెచ్‌పీలు సుచరిత, ఉమారత్నమాల, ఏఎన్‌ఎం సునంద, ఆశా కార్యకర్తలు కిష్టుబాయి, లక్ష్మి, సరోజ, సునీత, గ్రామ పంచాయతీ కారోబార్ గోపాల్ పాల్గొన్నారు.

## తక్షణమే 'సర్' ప్రక్రియ నిలిపివేయాలి



**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిలిపివేసి, అర్హులైన వారందరికీ ఓటు హక్కును పునరుద్ధరించాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఐ, సిపిఎం, ఎంసిపిఐ(యు), సిపిఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సబ్‌కలెక్టర్ మనోజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. సాంకేతిక కారణాలతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించడం దారుణమన్నారు. దీనికి బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, లేనిపక్షంలో ఆయనను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాగం మల్లేష్, ఆడెపు రాజమౌళి, దాగం శ్రీకాంత్, పసులేటి వెంకటేష్, బొల్లం సోని, రెడ్డి చరణ్, అక్కెపల్లి బాబు, బొంతల లక్ష్మీనారాయణ, కొండు బానేష్, డిఆర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## బాసర మండల అభివృద్ధి పనుల పురోగతిపై ఎమ్మెల్యే సమీక్ష

ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



**ప్రజాపక్షం/భైంసా :** బాసర మండల కేంద్రంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.గ్రామాల్లోని సమస్యలు,పెండింగ్ పనులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.వ్యవసాయ, విద్య, వైద్యం,విద్యుత్, తాగునీరు,పంచాయతీరాజ్, ఇరిగేషన్, శాఖలకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు.గ్రామపంచాయతీ, వీఓ,అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను వేగవంతం చేసి నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ప్రజాప్రతినిధులు,సర్పంచులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లపై విచారణ చేపట్టాలి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరంజీవి

**ప్రజాపక్షం/వాంకిడి :** గిరిజన పేదల సొంతింటి కలను సాకారం చేయాల్సిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని రింగరిట్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను సిపిఐ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదల ఇళ్ల నిర్మాణంలో నాసిరకం పనులు చేపడుతూ అవినీతికి పాల్పడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. గూడు లేని ప్రతి పేదవాడికి నాణ్యమైన ఇల్లు కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. రింగరిట్ లో చేపట్టిన పనులపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిరే ప్రకాష్, మండల కార్యదర్శి కొదురుపాక మహేష్, మండల కౌన్సిల్ సభ్యులు వడై రాందాస్ పాల్గొన్నారు.



# 'నిర్మల్'లో శ్రీలీల, ఐశ్వర్య రాజేష్ హల్‌చల్



'సిబియస్' ప్రారంభించిన ఐశ్వర్య రాజేష్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** పట్టణ ప్రజలు ఎం తో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సిబియస్ (చందన బ్రదర్స్ షాపింగ్ మాల్) ప్రారంభోత్సవం జనసందోహం మధ్య అత్యంత వైభవంగా జరిగింది.తెలంగాణలో ఇది 7వ షోరూమ్ కాగా, బోయివాడ, నటరాజ్ నగర్‌లో ఏర్పాటు చేసిన ఈ నూతన మాల్‌ను ప్రముఖ సినీనటి ఐశ్వర్య రాజేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. నాణ్యమైన వస్త్రాలను,అందరికీ అందుబాటు ధరలలో వన్ స్టాప్ మాల్‌గా నిర్మల్ ప్రజలకు అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా ఆమె అన్నారు.ఈ సందర్భంగా షోరూం మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ జానా సురేష్ మాట్లాడుతూ 40 సంవత్సరాల నమ్మకమైన అనుబంధంతో తెలుగు రాష్ట్రాల్లో ఏ ప్రాంతంలో ప్రారంభించినా,అతి తక్కువ కాలంలోనే కస్టమర్ల మనసులు గెలుచుకుని నెం. 1గా నిలవడం తమకు ఎంతో ప్రో త్సాహాన్ని ఇస్తోందన్నారు.నిర్మల్ ప్రజల అభిరుచులకు తగినట్లుగా సంప్రదాయ వస్త్రాలతో పాటు అధునాతన మోడ్రన్ ఫ్యాషన్ కలెక్షన్లను ప్రత్యేక శ్రద్ధతో అందుబాటులో ఉంచామన్నారు.షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంతో పాటు దసరా, దీపావళి వేడుకల సందర్భంగా అక్టోబర్ 1 నుండి 5 వరకు అన్ని రకాల వస్త్రాలపై అదిరిపోయే తగ్గింపు ఆఫర్లను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న సినీనటి ఐశ్వర్య రాజేష్ మాట్లాడుతూ సిబియస్ ప్రారంభోత్సవంలో భాగం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.కుటుంబంలో ఎలాంటి శుభకార్యాలైనా, చివరికి షూటింగ్ కాస్ట్యూమ్‌లకైనా తమ మొదటి ప్రాధాన్యత సిబియస్ మాత్రమేనని పేర్కొన్నారు. ఇక్కడ లభించే సరికొత్త డిజైన్లు, వెరైటీలు మరెక్కడా లభించవని, అందుకే ఇది హైదరాబాద్ ఫేవరెట్ షోరూమ్‌గా మారిందని, ఇప్పుడు నిర్మల్ ప్రజలకు కూడా అంతే చేరువైందని కొనియాడారు.షాపింగ్ మాల్ లోపల ఏర్పాటు చేసిన ప్రతీ ఫ్లోర్ కస్టమర్లతో కిటకిటలాడింది. ముఖ్యంగా మహిళా వినియోగదారులు ప్రారంభోత్సవ ఆఫర్లలో లభిస్తున్న పట్టు చీరలు, ఫ్యాన్సీ డిజైన్లతో పాటు పండుగ కలెక్షన్లను కొనుగోలు చేయడానికి పోటీ పడ్డారు. అత్యంత నాణ్యమైన వస్త్రాలు, రీజనబుల్ ధరలకే లభిస్తుండటంతో పండుగ షాపింగ్‌కు నిర్మల్ పరిసర ప్రాంతాల ప్రజలకు సిబియస్ ఒక చక్కని వేదికగా మారింది.ఈ ప్రారంభోత్సవ వేడుకలో షోరూమ్ ప్రతినిధులు,నిర్మల్ పట్టణ ప్రముఖులు,వ్యాపారవేత్తలు,పెద్ద సంఖ్యలో ప్రజలు పా ల్గొని కార్యక్రమాన్ని ఘనంగా విజయవంతం చేశారు.



'చెన్నై షాపింగ్ మాల్' ప్రారంభించిన శ్రీలీల

**ప్రజాపక్షం/నిర్మల్ :** పట్టణ ప్రజలకు సరికొత్త ఫ్యాషన్ అనుభూతిని అందిస్తూ 'చెన్నై షాపింగ్ మాల్' నూతన శాఖ నిర్మల్‌లో గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది.ఈ ప్రారంభోత్సవ వేడుకకు ప్రముఖ సినీనటి శ్రీలీల ముఖ్య అతిథిగా హాజరై షోరూమ్‌ను ప్రారంభించారు.ఆమెను చూడటానికి అభిమానులు,పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పరిసర ప్రాంతాలన్నీ జనసందోహంతో సందడిగా మారాయి. చారిత్రక నేపథ్యం ఉన్న నిర్మల్ పట్టణంలో ఆధునిక ఫ్యాషన్ ప్రపంచానికి వేదికగా చెన్నై షాపింగ్ మాల్ నిలవడం సంతోషకరమన్నారు. వినియోగదారుల నమ్మకానికి నిజమైన చిరునామా ఈ మాల్ అని,కుటుంబ సమేతంగా విచ్చేసి దసరా, దీపావళి వివాహ శుభకార్యాలకు కావలసిన లక్షలాది డిజైన్ల వ స్త్రాలను ఎంపిక చేసుకోవాలని కోరారు.సాంప్రదాయ వస్త్రాలతో పాటు ఆధునిక ఫ్యాషన్ కలెక్షన్లను ఒకే చోట అందుబాటులోకి తెచ్చినట్లు యా జమాన్యం తెలిపింది. మెట్రో నగరాల తరహాలోనే నిర్మల్ ప్రజలకు కూడా నాణ్యమైన ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని ప్రతినిధులు పేర్కొన్నారు. ఆకట్టుకునే ఇంటీరియర్, విభిన్న శ్రేణుల దుస్తులు, బడ్జెట్ ఫ్రెండ్లీ ధరలు ఫ్యాషన్ ప్రియులకు, కుటుంబ వినియోగదారులకు సరికొత్త షాపింగ్ అనుభవాన్ని ఇస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే పండుగలు పెళ్లిళ్ల సీజన్ దృష్ట్యా ప్రత్యేక డిస్కౌంట్లు, వినూత్న మోడళ్లను ఆఫర్ చేస్తున్నట్లు తెలిపారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ మర్రి వెంకటరెడ్డి,డైరెక్టర్ కృష్ణారావు,బిజెపి ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి,కాంగ్రెస్ ఇంచార్జ్ కూచాడి శ్రీహరి రావు,మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య,కౌన్సిలర్లు, వివిధ పార్టీల ప్రముఖులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డి మాం డ్ చేస్తూ ఈ నెల 6న చేపట్టే కెరమెరి వాటర్ ప్లాంట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పిలుపునిచ్చారు. గురువారం కాగజ్‌నగర్‌లో మిషన్ భగీరథ డిఇ పృథ్వీరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పెండింగ్ జీతాలు, బోనస్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతన స్లిప్పులు, ఇఎస్ఐ, ఇపిఎఫ్ సౌకర్యాలు కల్పించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.ఎఐటియుసి జిల్లా కార్యదర్శి షాకీర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంషద్, కార్మికులు పాల్గొన్నారు.

## వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేలా చర్యలు

ఆదిలాబాద్ ఎంపి గోడం నగేష్,
కలెక్టర్ భవేశ్ మిశ్రా

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఆధునిక సాంకేతికతను దృష్టిలో ఉంచుకొని రై తులు శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబిస్తూ వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చుకోవాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ సూచించారు .గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎఫ్ఎస్‌సిఎస్ కన్వెన్షన్‌లో ఆత్మ (అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ–ఎటిఎంఎ), వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కిసాన్ మేళాను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి ఎంపీ గోడం నగేష్ ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారు. రైతులు పంటల ఎంపిక సమయంలో వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, నీటి లభ్యత, మార్కెట్ పరిస్థితులు, విత్తనాల లభ్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకొని ఆయిల్‌పామ్ సాగును మరింత విస్తరించాలని రైతులకు సూచించారు.





నిర్మల్ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తరిస్తుండటం అభినందనీయమని పేర్కొన్న ఎంపీ, రైతుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు, ఆధునిక సాగు విధానాలపై అవగాహన కల్పించేందుకు కిసాన్ మేళాలు, రైతు సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.రైతులు ఎరువుల సరఫరా, పంటల బీమా, బ్యాంకింగ్ సేవలు, వ్యవసాయ సాంకేతికత, ఆధునిక సాగు విధానాలు తదితర అంశాలపై మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి సంబంధిత అధికారుల నుంచి సమాచారం, సలహాలు పొందాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు 9,400 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఆత్మ కమిటీ చైర్మన్లు వివేకానంద, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాం గోపాల్, వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీధర్ చౌహాన్, రాహుల్ విశ్వకర్మ, రాంగోపాల్ వర్మ, దినేష్, సురేష్, వ్యవసాయ శాఖ అధికారు లు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## పిల్లలకు సమతుల్య పౌష్టికాహారం అందించాలి

కలెక్టర్ కె.హరిత

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు సమతుల్యమైన పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో గల అంగన్వాడీ కేంద్రంలో చేపట్టిన తొలిముద్ద అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 3 నుంచి 6 సంవత్సరాల వయసు గల పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించి ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నా రు. తల్లులు తమ పిల్లలను కేంద్రాలకు పంపించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారులకు ఉప్మా, కిచిడీ తినిపించారు. అనంతరం రైతు వేదికలో పోషణ మాసం సందర్భంగా గర్భిణులకు నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, అంగన్వాడీల్లో అందించే పౌష్టికాహారాన్ని సకాలంలో తీసుకోవాలని మహిళలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూపారాణి, కౌన్సిలర్ కొండు భారతి, ఐసిడిఎస్ అధికారులు, సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.



## 'సర్' నోటీసులకు ఆన్‌లైన్‌లో ధృవీకరణ పత్రాలు అందించవచ్చు

కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు వ్యక్తిగతంగా బీఎల్‌ఓలను నేరుగా కలువకుండా ఆన్‌లైన్‌లో ఈ మెయిల్, వాట్సప్‌లతో కూడా సంబంధిత ధృవీకరణ పత్రాలను పంపవచ్చని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సమగ్ర సవరణ ప్రక్రియ పురోగతిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఫారం 6, 7, 8 దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. మ్యాపింగ్ జరగని వారికి పేరు, ఇతర వివరాలలో వ్యత్యాసం కలిగి ఉన్న వారికి సర్‌లో భాగంగా జారీ చేసిన నోటీసులకు సంబంధించి విచారణ పక్కాగా జరపాలన్నారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తు.చ. తప్పక పాటించాలని హియరింగ్‌ను పారదర్శకంగా నిర్వహిస్తూ నిర్ణీత గడువులోగా సర్ ప్రక్రియను చేయాలని ఈఆర్‌ఓలను కలెక్టర్ ఆదేశించారు.

## విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం కృషి

మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడి



**ప్రజాఫక్షం/సంగారెడ్డి:** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సిడబ్ల్యు సి సభ్యులు దామోదర్ రాజనర్సింహను ఏఐసిసి సెక్రటరీ రాష్ట్ర మహిళా కాంబ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జీ ఎం.ఎస్ మయూరి సింగ్ హైదరాబాదులోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసారు. రాష్ట్రంలో మహిళా సాదికారిత కోసం ప్రజా ప్రభుత్వం చేస్తున్న కృషి ,అభివృద్ధి ,సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా శిశు, సంక్షేమం ,విద్య వైద్య రంగాలకు ఎంతో ప్రాదాన్యత ఇస్తున్నామన్నారు. సంక్షేమం ప్రజల్లోకి పెద్ద ఎత్తున తీసుకెళ్లడం మహిళా కాంగ్రెస్ బలోపేతం పై చర్చించారు.

## రోగుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత : కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/మెదక్ :** జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, వైద్య సంస్థల్లో భద్రతా నిబంధనలు కచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ క్యాంప్ ఆఫీస్ నుంచి అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించారు.ఆసుపత్రుల్లో అగ్ని, విద్యుత్ ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రుల భద్రతా ప్రమాణాలు, అగ్ని మాపక పరికరాలు, అత్యవసర మార్గాలు, విద్యుత్ భద్రతా ఏర్పాట్లను అధికారులు తనిఖీ చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులు, వారి బంధువులు, సిబ్బందిని సురక్షితంగా తరలించేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. సిబ్బందికి క్రమం తప్పకుండా





భద్రతా శిక్షణ ఇవ్వాలని, నిబంధనల్లో లోపాలు ఉంటే వెంటనే సరిచేయించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసి సమగ్ర నివేదిక అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## 'మెదక్' పట్టణ అభివృద్ధికి రూ.7.04 కోట్లతో పనులు

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

**ప్రజాపక్షం/మెదక్:** మెదక్ పట్టణ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. పట్టణంలోని 4, 5, 6, 7, 8, 9, 17, 18, 19, 25, 26, 29, 32వ వార్డుల్లో మొత్తం రూ. 7.04 కోట్ల అంచనా వ్యయంతో చే పట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ నవీన్, స్థానిక కౌన్సిలర్లతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్లు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్లాబ్‌లు, ప్రధాన కూడళ్ల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ముఖ్యంగా 8వ వార్డులో రూ. 2 కోట్లతో రామదాస్ చౌరస్తా, అంబేద్కర్ సర్కిల్, ఇతర చౌరస్తాల అభివృద్ధి చేపట్టనున్నారు. ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే రోహిత్ రావు తెలిపారు. మెదక్ పట్టణాన్ని ఆధునిక వసతులతో అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. ప్రతి వార్డులో ప్రజలకు అవసర



మైన మౌలిక వసతులకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అభివృద్ధి కాగితాలకే పరిమితం కాకుండా రోడ్లు, డ్రైనేజీ, జంక్షన్ల అభివృద్ధి రూపంలో ప్రజలకు కనిపించేలా పనులు చేపడుతున్నామన్నారు. మెదక్ పట్టణాన్ని ఆధునిక మౌలిక వసతులతో మోడల్ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు భట్టి ఉదయ్ కుమార్, మన్సూర్ అహ్మద్, హరిత, గంగమని, జుబేర్ అహ్మద్, శంసున్నిసా బేగం, స్వరూప, గౌస్ ఖురేషి, నాయకులు గంగాధర్, అశోక్ ,నర్సింలు, ఉమర్, ఫాజిల్, తాహెర్, సంగ శ్రీకాంత్, సుభాష్ చంద్రబోస్, సాయి కుమార్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## 'కరత్వాడ' ప్రాజెక్టు కుడి ఎడమ కాలువల నుండి నీటి విడుదల

**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండల కేంద్రానికి దగ్గరలో కరత్వాడ ప్రాజెక్టు కుడి కాల్వ ఎడమ కాలువ నీటిని విడుదల చేసిన డిఈఈ భూఖ్య భీమ్ రావు ఎ.ఈ.ఈ.జాదవ్ ప్రకాష్.ఎలినో ప్రభావంతో వర్షపాతం తక్కువ ఉండడం వలన భూగర్భ జలాలు కొంతమేర కూడా పెరగలేదు అందుకని రైతులు ఈప్పుడు మనకు ఆధారమైన కరాత్వాడ ప్రాజెక్టు నీటిని సరి అయిన పద్ధతిలో వాడుకొని కనీసం ఈ చేతికొచ్చిన పంట నైన కాపాడుకునే విధంగా రైతులందరూ చూసుకోవాలి తెలిపారు.తేదీ 1–10–2026 నుండి 10–10–2026 వరకు కుడి ఎడుమా కాల్వలకు నీరు అందుతుంది. తర్వాత కాలువలు మూసివేయబడతాయి మళ్లీ తిరిగి 10 రోజుల తర్వాత మళ్లీ నీరు అందించడం జరుగుతుంది.ఇట్టి విషయాన్ని రైతులు గమనించాలి అని తెలిపారు. మన బోథ్ (కరత్వాడ) ఆయకట్టు రైతులకు తెలియజేయునది రెండో పంటకు నీరు అందించడం వీలు కాదు రైతులు రెండో పంట వేయకపోవడం ఉత్తమం మన ఆయకట్టు ఒక పంటకు నీరు అందించడానికి వీలుపడుతుంది. ఈ డిసెంబర్‌లో నీటి సరఫరా నిలిపివేయబడుతుంది రైతులు సహకరించగలరు అని తెలిపారు.



విక్టరీ వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందిన ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనరర్ ఆదర్శ కుటుంబం'- హౌస్ నెం.47'. శ్రీనిధిశెట్టి కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ అక్టోబరు 9న ప్రేక్షకుల ముందుకు రానుంది.

రీల్



## 'కుకూన్స్' పోస్టర్ లాంచ్

జగన్ జోగిరాజ్, సాగర్ కిరణ్, వికాస్ చైతన్య, సంగన దుగ్గు, సురభి దీప్తి, దీప్తి పద్మనిమ్మ నగోటి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'కుకూన్స్'. ఈ చిత్రాన్ని న్యూ వేవ్ పిక్చర్స్, ఎం.ఆరట్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై సుఖేష్ పొట్ల, మమత రెడ్డి కాసం, మహేశ్ గౌరి నిర్మిస్తున్నారు. డైరెక్టర్ మహేశ్ గౌరి దర్శకత్వం వహిస్తున్నారు . యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌కు నచ్చే మంచి ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ రోజు 'కుకూన్స్' చిత్ర పోస్టర్ ను బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి రిలీజ్ చేశారు. అనంతరం డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'కుకూన్స్' సినిమా పోస్టర్ రిలీజ్ చేయడం హ్యాపీగా ఉంది. ఈ పోస్టర్ కొత్తగా ఉండి ఆకట్టుకుంది. డైరెక్టర్ మహేశ్ గౌరి సరికొత్త ఆలోచనలు ఈ పోస్టర్‌లో తెలుస్తున్నాయి. టైటిల్ కూడా చాలా బాగుంది. ఈ సినిమాలో వన్ ఆఫ్ ది లీడ్ రోల్ చేసిన వికాస్ గతంలో డ్రామా జూనియర్స్ ప్రోగ్రాంకు మెంటార్‌గా పనిచేశారు. ఇప్పుడీ చిత్రంతో నటుడిగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. జగన్, సాగర్, వికాస్ తో పాటు మిగతా 'కుకూన్స్' టీమ్ అందరికీ నా బెస్ట్ విశెస్ తెలియజేస్తున్నా. అన్నారు. జగన్ జోగిరాజ్, సాగర్ కిరణ్, వికాస్ చైతన్య, సంగన దుగ్గు, సురభి దీప్తి, దీప్తి పద్మనిమ్మనగోటి, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్ శ్రీశైలం, ఎడిటర్ ఆదిత్య తివారి డిఒపి నిఖిల్ శ్యామ్, మ్యూజిక్ డైరెక్టర్ బి.ఎస్.ఆదిత్య, స్క్రిప్ట్, డైరెక్షన్ మహేశ్ గౌరిపీఆర్ఒ గాండ్ల శ్రీనివాస్ (జి.ఎస్.మీడియా).

## క్లైమాక్స్‌ను ఎవరూ గెస్ చేయలేరు

### 'తత్వం' హీరో దినేష్ తేజ



అర్జున్ కోలా దర్శకత్వంలో దినేష్ తేజ్, దష్వి.క.కె హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'తత్వం' త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె.ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో శీమకుర్తి వంశీ కృష్ణ , శ్వేత పసుపులేటీ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా హీరో దినేష్ తేజ బుధవారం పాత్రికేయులతో ముచ్చటించారు. ఈ సినిమాలో ఎవరూ గెస్ చేయలేని ట్విస్ట్‌లు.. క్లైమాక్స్‌లో ఉండే ఎమోషన్.. తనకు తాను ఏమీ తెలుసుకున్నాడు తనకు ఏమీ తత్వం బోదపడింది అనే పాయింట్‌తో పాటు టోటల్ ఈ మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ కొత్తగా అనిపించింది. రేపు థియేటర్‌లో జనాలు కూడా అదే ఫీలవుతారు. మూఢనమ్మకంకు నమ్మకం మధ్య ఓ సన్నని గీత ఉంటుంది. దాని చుట్టే ఈ కథ తిరగుతుంది. 2000వ సంవత్సరంలో నడిచే కథ ఇది. ఈ సినిమా ప్రమోషన్ టైమ్‌లో నాకు హీరోయిన్‌కు యాక్సిడెంట్ జరిగింది. నాకు ఇది సెకండ్ లైఫ్. దే ఆడియన్స్ సినిమా తప్పకుండా నచ్చుతుంది. అందరూ నన్ను నీ ఫ్రైడే ఎప్పుడూ నీ టైమ్ ఎప్పుడూ అంటుంటారు.. తప్పకుండా ఈసినిమాతో ఆ రోజు వస్తుంది. నిజాయితీగా నా పని నేను చేసుకుంటూ మంచి సినిమాల్లో నటిస్తాను. ఇలాంటి సినిమాలు విజయం సాధిస్తే మా అందరిలో కూడా నమ్మకం కలుగుతుంది. ఈ సినిమా క్లైమాక్స్ అందరి మనసులను తాకుతుంది.

**సక్సెస్ ఈ సినిమాతో వస్తుందని అనుకుంటున్నారా?**

కమర్షియల్ సక్సెస్ ఒక్కటే చూడటం లేదు. కొన్ని సినిమాలు చేస్తున్నప్పుడు. ఈ కథ చెప్పాలని అనిపించి చేసిన సినిమా. ఇది కూడా నావెల్టీ కథ కాబట్టి చేశాను. అందుకే ఒప్పుకోలేదు. హుషారు 2తో పాటు విజయనగరం బ్యాక్డ్రాప్తో ఓ యాక్షన్ డ్రామా చేశాను. సతీష్ వెగేశ్న కథా కేళి ఉంది. ఈ సినిమా తరువాత కొత్త కథలతో వచ్చే రచయితలకు నేను కూడా ఒక అప్పన్నా ఉంటాననే నమ్మకం ఉంది. ఈ సినిమాకు ఫేస్ చేసిన స్ట్రగుల్స్ ఏ సినిమాకు ఫేస్ చేయలేదు.. దర్శక, నిర్మాతలు కూడా ఎన్నో కష్టాలు ఎదుర్కొని ఈ సినిమాను ఈ స్టేజ్ వరకు తీసుకొచ్చారు.

## నవంబర్ 13న 'గీతాంజలి'



కొన్ని సినిమాలు థియేటర్లలో విడుదలై ఎన్నేళ్లు గడిచినా ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేస్తుంటాయి. అలాంటి ఎవర్‌గ్రీన్ క్లాసిక్స్‌లో కింగ్ నాగార్జున 'గీతాంజలి' ఒకటి. ఇప్పుడు ఈ లవ్ఫుల్ క్లాసిక్ మరోసారి థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమైంది. నవంబర్ 13న తెలుగు, తమిళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా 4K వెర్షన్‌లో 'గీతాంజలి' గ్ర రీ రిలీజ్ కానుంది. దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన ఈ చిత్రం అద్భుతమైన కథనం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాలు, గొప్ప సంగీతంతో ప్రేక్షకులపై ప్రత్యేకమైన ముద్ర వేసింది. నాగార్జున, గిరిజ జంటగా నటించిన ఈ సినిమా ప్రేమ, భావోద్వేగాలు, అందమైన అనుభూతులను ప్రత్యేకమైన శైలిలో ఆవిష్కరించింది.ఇప్పటివరకు 'గీతాంజలి'ని ప్రేమించిన ప్రేక్షకులకు ఈ 4K రీరిలీజ్ మరోసారి ఆయన స్వరపరిచిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఎవర్‌గ్రీన్. బూర్లె శివ ప్రసాద్ నేతృత్వంలోని శ్రీ పద్మిని సినిమాస్ ఈ ఎవర్గ్రీన్ క్లాసిక్‌ను మరోసారి ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకొస్తోంది. ఇప్పటికే ఈ సినిమాను ప్రేమించిన అభిమానులతో పాటు, కొత్త తరం ప్రేక్షకులకు కూడా 'గీతాంజలి'ని బిగ్ స్క్రీ ఎక్స్ పీరియన్స్ చేసే అవకాశం లభించనుంది.

## 'ఆత్మకథ' ఆడియో ఆవిష్కరణ



వారాహి ఎంటర్‌టైనమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై సోమేష్ నిర్మాతగా శ్రీనివాస్ బండ్రెడ్డి రచనా దర్శకత్వంలో రానున్న చిత్రం ఆత్మ కథ యాన్ అన్ టోల్ స్టోరీ. జెమిని సురేష్ హీరోగా రూప హీరోయిన్‌గా చేయగా సమ్మెట గాంధీ, షకలక శంకర్, తాగుబోతు రమేష్, ధనరాజ్, నాగ మహేష్, బలగం విజయలక్ష్మి , శ్రీనివాస్ నాయుడు, 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వి తదితరులు కీలకపాత్రలు పోషించారు. శ్రేయాంశ్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి గోపి డిఒపిగా చేయగా రాఘవేంద్ర రెడ్డి ఎడిటింగ్ చేశారు. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ్, మలయాళం, కన్నడ భాషలలో విడుదల కానుంది. మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి గారు, రిథమ్ స్టూడియో ఇన్చార్జి కొల్లి రామకృష్ణ గారు, అలాగే కూనపరెడ్డి అవినాష్ గారి చేతుల మీదగా హనుమాన్ మ్యూజిక్ లాంచ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఈ మ్యూజిక్ లేబుల్ లో మొదటిగా ఆత్మకథ చిత్ర పాటలు ఉండేలా ఆత్మకథ ఆడియోను ప్రముఖ సంగీత దర్శకులు ఆర్ పి పట్నాయక్, రఘు కుంచె చేతుల మీదగా విడుదల చేశారు. ఈ సినిమా కథ నాకు దర్శకులు చెప్పినప్పుడు నాకు చాలా సర్ప్రైజ్‌గా అనిపించింది. సురేష్ నటిస్తున్న ఆత్మ కథ చిత్ర సూపర్ హిట్ కావాలని కోరుకుంటున్నాను.హీరోయిన్ రూప మాట్లాడుతూ... 'మా సినిమా ఒక చిన్న కథ. నాకు మొదటిసారి అవకాశం ఇచ్చిన నడుచకుడు శ్రీనివాస్ గారికి థాంక్స్. ఈ సినిమాను అందరూ ఆదరించాల్సిందిగా కోరుకుంటున్నాను. హీరో జెమిని సురేష్ మాట్లాడుతూ... 'సినిమాలకు ఆడియో లాంచ్ కార్యక్రమాలు జరిగి చాలా రోజులు అయింది. ఇప్పుడు హనుమ మ్యూజిక్ ద్వారా నేను నటించిన ఆత్మకథ సినిమాతో మరోసారి ప్రారంభం కావడం చాలా సంతోషం అనిపించిందని అన్నారుం .

## పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ కథ 'జంగా'




శ్రీమతి వనిత కిలారి సమర్పణలో శ్రీ ఆర్‌కె ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్ మీద రమ్య కిలారి, జయచంద్ర నాయుడు కిలారి నిర్మిస్తున్న చిత్రం 'జంగా'. త్రిగుణ్, నేహా పఠాన్, వరలక్ష్మి శరత్ కుమార్, శ్రావణ్, మధునందన్ , గగన్ విహారి, చందు గౌడ,సమీర్, నాగ మహేష్,భూపాల్, రఘు కారుమంచి, రచ్చ రవి, ప్రధాన పాత్రల్లో రాబోతోన్న ఈ మూవీకి కెవిన్ గడ్డం(శ్రీహరి) కథ, స్క్రీన్‌ప్లే అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. ఆ మధ్య త్రిగుణ్ బర్త్ డే స్పెషల్‌గా వదిలిన 'జంగా' పోస్టర్ & మోషన్ పోస్టర్ అందరినీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. రా అండ్ రస్టిక్ లుక్‌లో కనిపించిన త్రిగుణ్ అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ మూవిలో కీలక పాత్రను పోషిస్తున్న మధునందన్ కారెక్టర్‌ను రివీల్ చేశారు. ఈ పోస్టర్‌లో ఆయన లుక్ చూస్తుంటే ఏదో తదేకంగా పరిశీలిస్తున్నట్టుగా కనిపిస్తోంది. మరి ఆయన ఏం చేస్తున్నారు? అక్కడ ఏం జరిగింది? అన్నది తెలియాలంటే ఇంకొన్ని రోజులు వేచి చూడాల్సిందే. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రసాద్ వర్మ, ప్రేమ్ రాజ్ మాటలు రాయగా.. కాసర్ల శ్యాం, పూర్ణాచారి, కళ్యాణ్ చక్రవర్తి పాటల్ని రాస్తున్నారు. ప్రవీణ్ పూడి ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. త్రిగుణ్, నేహా పఠాన్, వరలక్ష్మి శరత్ కుమార్, శ్రావణ్, మధునందన్ ,చందు గౌడ,సమీర్, నాగ మహేష్, రఘు కారుమంచి, రచ్చ రవి కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## బ్లాక్ స్వాన్ ఎఫెక్ట్‌లా 'ఆదర్శ కుటుంబం'


త్రివిక్రమ్

విక్టరీ వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందిన ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనరర్ ఆదర్శ కుటుంబం' హౌస్ నెం.47'. శ్రీనిధిశెట్టి కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ అక్టోబరు 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో త్రివిక్రమ్, వెంకటేశ్, శ్రీనిధి శెట్టి మాట్లాడారు. ముఖ్యంగా 'ఆదర్శ కుటుంబం' కథ గురించి ఒక్క ముక్కలో చెబుతూ 'బ్లాక్ స్వాన్' ఎఫెక్ట్‌లో ఉంటుందన్నారు. ''ఈ కథ గురించి ఒక్క ముక్కలో చెప్పాలంటే రెండు వర్గాల మధ్య పోరు జరుగుతున్నప్పుడు దాన్ని కొందరు చూస్తూ ఉంటారు. వాళ్లపై ఈ గొడవ ప్రభావాన్ని ఎవరూ పట్టించుకోరు. ఇప్పుడు రెండు దేశాలు యుద్ధం చేసుకుంటున్నాయి. అక్కడా ఇక్కడా ప్రజలు ఉంటారు. దాన్ని థియేటర్లో చూస్తేనే ఆస్వాదించగలం. ఇదే బ్లాక్స్వాన్ ఎఫెక్ట్. అలాగే, చాలా తెలివిగా ప్లాన్ చేశామనకున్న ఇద్దరి మధ్యలోకి వాళ్లు ఊహించని దారి నుంచి వచ్చిన ఒక ఎఫెక్ట్ వారి కథను ఎలా మార్చిందనేది 'ఆదర్శ కుటుంబం'. ఇందులో క్రైమ్, యాక్షన్, కామెడీ, ఎమోషన్ అన్నీ కలిపి ఉంటాయి. 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి'లో అన్ని కోణాలు మేము టచ్ చేశాం. ఎవరికీ తెలియని విషయం ఏంటంటే, ఆయన నటించిన 'పవిత్ర బంధం', 'పెళ్లి చేసుకుందాం' సినిమాలకు పోసాని గారి దగ్గర నేను సహ రచయితగా పనిచేశా. కుటుంబం బంధాలు, మానవ విలువలు, స్త్రీ, పురుష సంబంధాలు అన్నీ జానర్ చిత్రాలు వెంకటేశ్ చేసేశారు. అది కాకుండా ఏం చేయవచ్చనేది ఈ సినిమా. అప్పుడు ఎన్వీఆర్ 'మనమే జనం.. జనమే మనం' అంటారు. కాబట్టి, మాకు ఈ కథ ఆసక్తిగా అనిపించింది. ప్రేక్షకులకు కూడా అనిపిస్తుందని అనుకుంటున్నా''అని త్రివిక్రమ్ అన్నారు.

# బొగ్గు రవాణాలో సింగరేణి ముందంజ

తొలి అర్ధ సంవత్సరంలో 299.4 లక్షల టన్నుల రవాణా

ఓవర్ బర్డెన్ తొలగింపులో 11 శాతం వృద్ధి

తెలంగాణ జెన్ కో కు 24.58 శాతం అధికంగా బొగ్గు సరఫరా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సింగరేణి కాలరీస్ సంస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ సంవత్సరంలో బొగ్గు రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపులో గణనీయమైన వృద్ధిని సాధించింది. సెప్టెంబర్ 30తో ముగిసిన అర్ధ సంవత్సరంలో 299.4 లక్షల టన్నుల బొగ్గును వినియోగదారులకు రవాణా చేసింది. గత ఏడాది ఇదే కాలంలో రవాణా చేసిన 287.6 లక్షల టన్నులతో పోలిస్తే ఇది 4 శాతం అధికం. ఓవర్ బర్డెన్ తొలగింపులోనూ 11 శాతం వృద్ధిని నమోదు చేసింది. రాష్ట్ర విద్యుత్ అవసరాలకు ప్రాధాన్యమిస్తూ తెలంగాణలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఈ ఏడాది తొలి అర్ధ సంవత్సరంలో 198.2 లక్షల టన్నుల బొగ్గును సింగరేణి సరఫరా చేసింది. గత ఏడాది ఇదే కాలంలో 159.1 లక్షల టన్నులు సరఫరా చేయగా, ఈసారి 24.58 శాతం అధికంగా సరఫరా చేసినట్లు సంస్థ వెల్లడించింది. థర్మల్ విద్యుత్ కేంద్రాల వారీగా చూస్తే కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రానికి గత ఏడాది 26.4 లక్షల టన్నుల బొగ్గు సరఫరా చేయగా, ఈ ఏడాది 39.8 లక్షల టన్నులు సరఫరా చేసింది. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు గత ఏడాది 21.5 లక్షల టన్నులు, ఈ ఏడాది 33.9 లక్షల టన్నులు సరఫరా చేసింది. భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు 19.5 లక్షల టన్నుల నుంచి 24.4 లక్షల టన్నులకు సరఫరా పెరిగింది. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి 26.6 లక్షల టన్నులు, ఎన్‌టిపిసి తెలంగాణ ప్లాంట్‌కు 25.3 లక్షల టన్నుల బొగ్గును సరఫరా చేసింది. ఎన్‌టిపిసి రామగుండం ప్లాంట్‌కు ఈ ఏడాది 42.7 లక్షల టన్నుల బొగ్గు సరఫరా చేసినట్లు సంస్థ తెలిపింది.

**విద్యుత్ అవసరాలకు ప్రాధాన్యం..**

ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర విద్యుత్ అవసరాలకు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి, రవాణాను పెంచేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సింగరేణి తెలిపింది. విద్యుత్ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు నిరంతరాయంగా బొగ్గు సరఫరా చేస్తున్నట్లు పేర్కొంది. సంస్థ చైర్మన్, ఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి అన్ని ఏరియాల జిఎంలతో ప్రతిరోజూ సమీక్షిస్తూ ఉత్పత్తితో పాటు బొగ్గు రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. విద్యుత్ కేంద్రాలకు ఉన్నతాధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడం సింగరేణి నైతిక బాధ్యతగా భావిస్తోందని సంస్థ పేర్కొంది. స్వరాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అధిక మొత్తంలో బొగ్గు సరఫరా చేస్తున్నట్లు తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 620 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 650 లక్షల టన్నుల బొగ్గు రవాణా లక్ష్యాలను సాధించే దిశగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు.

## 'సర్' నిలిపేయాలి

(మొదటి పేజీ తరువాయి)

సిపిఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షత వహించగా, సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఎన్. అశోక్ స్టాలిన్, ఎదునూరి వెంకట్రాజం,మునిగాల బిక్షపతి, కొట్టె పాక రవి, బత్తిని సదానందం,జక్కు రాజు గౌడ్, మాలోతు శంకర్,కొట్టె వెంకటేష్, గుంటి రాజేందర్, సిపిఎం జిల్లా నాయకులు సారంపల్లి వాసుదేవరెడ్డి, ఎం. చుక్కయ్య, బొట్ల చక్రపాణి, టి.ఉప్పలయ్య,గొడుగు వెంకట్,మంద సంపత్, వీరన్న, ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## త్వరలో అఖిలపక్షం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న డిఎలలో రెండు డిఎలను వెంటనే మంజూరు చేయాలని, అప్పటి నుంచి బకాయి పడిన ఎరియర్స్‌ను వాయిదాల్లో చెల్లిస్తారు. ప్రభుత్వానికి ఆర్థికంగా భారమైనప్పటికీ ఇటీవల ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగుల కు డిఎ, పెన్షనర్లకు డిఆర్ మంజూరు చేసేందు కు మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నది. రెండు డిఎలను చెల్లించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై న ప్రతి ఏడాది రూ.2500 కోట్ల భారం పడనుం ది. ఈ వానాకాలంలో దాదాపు 17 శాతం వ ర్షపాతం లోటు ఉంది. బుధవారంతో రుతుపవనాల కాలం కూడా ముగిసింది. దాదాపు 235 మండలాల్లో తీవ్ర వర్షాభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కరువు ప్రాంతాల్లో తక్ష ణం చేపట్టాల్సిన చర్యలపై కేబినెట్ సబ్ కమిటీ లో చర్చించాలనినిర్ణయించింది. త్వరలోనే అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని,రైతు సంఘాలతో పాటు వివిధ రంగాల నిపుణులతో కూడా భేటీ కానున్నారు. ఈ సందర్భంగా ఎల్ నినో పరిస్థితులలో చేపట్టాల్సిన ఉపశమన చర్యలపై సలహాలు సూచనలు స్వీకరిస్తారు. కరువు మండలాల ప్రకటనతో పాటు రాష్ట్రానికి తగిన సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర మంత్రివర్గం విజ్ఞప్తి చేసింది. ఈవిషయమై త్వరలోనే మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర పరిస్థితిని నివేదిస్తారు. ఖరీఫ్ సీజన్ కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నారు. ఈ సీజన్‌లో దాదాపు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని సివిల్ సప్లయిస్ విభాగం అంచనా వేసింది. కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని మంత్రివర్గం అధికారులకు సూచించింది. ఎల్‌నినో పరిస్థితులతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలో సాధారణంగా ఒక్క రోజుకు 15000 మెగావాట్ల విద్యుత్తు వినియోగం ఉండగా ప్రస్తుత సీజన్‌లో రికార్డు స్థాయిలో 19,892 మెగావాట్ల పీక్ డిమాండ్‌కు చేరింది. దాదాపుగా 20 వేల మెగావాట్లకు చేరింది. గత ఏడాది మొత్తంలో 16,613 మెగావాట్ల గరిష్ట వినియోగం నమోదైంది. ఈ నేపథ్యంలో విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోత లేకుండా సరఫరా చేసేందుకు అవసరమైనంత విద్యుత్‌ను సమకూర్చుకోవాలని, డిమాండ్ మేరకు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. భవిష్యత్తు డిమాండ్, అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్తగా పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి, విద్యుత్తు సమీకరణపై దృష్టి పెట్టాలని నిర్ణయించింది. దాదాపు 7800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా యూనిట్లు నెలకొల్పేందుకు ఆమోదం తెలిపింది. ఇందులో 3,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ , 4000 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్, 800 మెగావాట్ల పవన విద్యుత్ యూనిట్ల ఏర్పాటు ప్రతిపాదనలపై మంత్రివర్గం చర్చించింది. కేంద్ర నిబంధనల మేరకు బిడ్డింగ్ విధానంలో ఈ ప్రాజెక్టులు చేపట్టాలని నిర్ణయించింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో వరల్ క్లాస్ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని నిర్ణయించింది. పూర్తిగా ప్రభుత్వ నిధులతోనే ఈ మార్కెట్ ఏర్పాటు చేయాలని సూచించింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పున: సమీక్షించాలని మంత్రి వర్గం నిర్ణయించింది. ఇప్పటికే జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఈపీసీ విధానంలో చేపట్టిన ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉంటే రద్దు చేయాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా 10 ఈపీసీ సాగునీటి ప్రాజెక్టులను నిలిపివేసేందుకు మంత్రివర్గం ఆమో దం తెలిపింది. తెలంగాణలో డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్‌కు ప్రత్యేక పాలసీ అమలు చేసే ప్రతిపాదనను మంత్రివర్గం పరిశీలించింది. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ పోస్టు మంజూరుకు కేబినేట్ ఆమోదించింది. మరో నలుగురు గ్రూప్ 1 అధికారులను కూడా ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం తరపున పని చేసేందుకు నియమించాలని నిర్ణయం తీసుకుంది.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com